www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

● ఉత్తరాంధ్రలో అకాల వర్షాలు


విశాఖలో జోరున కురుస్తున్న వర్షం

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

నేలకూలిన భారీ వృక్షాలు

కాకినాడలో వడగళ్ల వాన

ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం 2

గురువారం | 21-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 336 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి తె. 4.46 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఆశ్లేష రా. 1.28 తదుపరి మఖ; వర్జ్యం: మ. 12.57-2.44; దుర్ముహూర్తం: ఉ. 10.23-11.11, మ. 3.11-3.59; అమృతఘడియలు: రా. 11.40-1.28; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.22; సూర్యాస్తమయం: 6.23 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పైసా వసూల్!

కాంట్రాక్టర్లకు కాసులు.. వైసీపీకి కమీషన్లు

ఆర్థిక శాఖ వేదికగా అడ్డగోలు జాతర

కోడ్‌కు 10 రోజుల ముందు 6,500 కోట్లు పందేరం

ఆపై 5 రోజుల్లోనే 584 కోట్లు పంపకం

4,700 కోట్లు అప్పు తెచ్చి మరీ బిల్లులు

ఎన్నికల తర్వాత ఏమవుతుందో ఏమో!

ఇప్పుడే బిల్లుల పండగ చేసేసుకోండి!

మా కమీషన్ మాకు ఇచ్చేయండి

క్విడ్ ప్రోకో తరహాలో సాగుతున్న దందా

"ఆలసించిన ఆశాభంగం! ఎన్నికల తర్వాత ఏమవుతుందో ఏమో! తేడా వస్తే... అసలుకే మోసం! ఇప్పుడే బిల్లుల పండగ చేసుకుందాం! మీకు కాసులు.. మాకు కమీషన్లు"...

కొన్ని రోజులుగా రాష్ట్ర ఆర్థిక శాఖలో జరుగుతున్న తతంగమిది! అధికార పార్టీకి అస్మదీయులైన కాంట్రాక్టర్లు, వెండర్లు, సప్లయర్లకు బంపర్ ఆఫర్ ఇచ్చేశారు. ఎన్నికల తర్వాత సర్కారు మారితే సొమ్ములకు గ్యారెంటీ లేదని, ఇప్పుడే 'సెటిల్' చేసేస్తున్నారు. అంతా అడ్డగోలుగా... ఇష్టారాజ్యంగా! బిల్లుల చెల్లింపు వ్యవహారాలు చూస్తున్న ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ కనుసన్నల్లోనే ఈ తతంగం జరుగుతోంది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ముందు వచ్చిన వారికి ముందు' (ఫిఫో) అనే నియమాన్ని ఆర్థిక శాఖ తుంగలో తొక్కింది. తమకు నచ్చిన వారికి మాత్రమే బిల్లులు చెల్లిస్తోంది. కోడ్ రావడానికి పది రోజుల ముందు నుంచే ఈ చెల్లింపు జాతర మొదలైంది. 'మీ బిల్లు మీకు.. మా వాటా మాకు' అనేలా ఈ 'క్విడ్ ప్రోకో' సాగుతోంది. ఈ వాటాల సొమ్ము ఎవరికి వెళ్లాల్సింది వారికి వెళ్తోంది. సింహభాగం... అధికార పార్టీకే దక్కుతున్నట్లు సమాచారం. ఈ డబ్బును ఎన్నికల్లో వెదజల్లేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈనెల 16వ తేదీన ఎన్నికల షెడ్యూలు వెలువడింది. ఆ రోజునే కోడ్ అమలులోకి వచ్చింది. అంతకుముందు పది రోజుల్లో... అంటే మార్చి 6వ తేదీ నుంచి 15వ తేదీ మధ్య



ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు రూ.6500 కోట్లు చెల్లించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా ఈ పందేరం

మిగతా 11వ పేజీలో...



కమీషన్ల 'కానుక'!

విద్యా కానుక కాంట్రాక్టు పాత కాంట్రాక్టర్లకే..

650 కోట్లతో 37 లక్షల కిట్లు కొనుగోలు

టెండర్లు పిలవకుండా ఇచ్చేసిన ప్రభుత్వం

వైసీపీ పెద్దల కోసమే నామినేషన్ పద్ధతి!

రూ.100 కోట్లు దాటినా న్యాయ సమీక్షకు నో

చక్రం తిప్పిన సీనియర్ మంత్రి 11


గిద్దలూరులో వైసీపీ దాడిలో చనిపోయిన టీడీపీ నేత మునయ్య


నంద్యాల జిల్లాలో హత్యకు గురైన ఇమాంహుస్సేన్

రాజకీయ హత్యలపై ఈసీ కన్నెర్ర

3 జిల్లాల ఎస్పీలకు సీఈవో పిలుపు

ఆళ్లగడ్డ, గిద్దలూరు, మాచర్ల ఘటనలపై ఆగ్రహం

హింసను ఎందుకు ఆపలేకపోయారో వచ్చి వివరణ ఇవ్వాలని ముగ్గురు ఎస్పీలకు ఆదేశం

ప్రధాని సభ భద్రతా వైఫల్యం మా పరిధిలోకి రాదు

ఆ ఫిర్యాదును హోం కార్యదర్శికి పంపాం

ఎన్నికల సంఘం అనుమతిస్తేనే డీఎస్సీ

తప్పు చేసిన వలంటీర్లు, సిబ్బందిని తొలగించాం

1.99 లక్షల బ్యానర్లు, హోర్డింగులు తొలగించాం

సీ-విజిల్ ఫిర్యాదులపై నిమిషాల్లోనే చర్యలు: మీనా

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాక గత రెండ్రోజుల్లో రాష్ట్రంలో జరిగిన రాజకీయ హింసాత్మక ఘటనలను ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ప్రకాశం, నంద్యాల జిల్లాల్లోని గిద్దలూరు, ఆళ్లగడ్డలో జరిగిన రాజకీయ హత్యలు, మాచర్లలో ఒక రాజకీయ పార్టీకి

మిగతా 12వ పేజీలో...

నిందితులను జైల్లోనే ఉంచేందుకు

ఎన్ని చార్జిషీట్లు?

ఈడీపై సుప్రీంకోర్టు ఆగ్రహం



దర్యాప్తు పూర్తయ్యే వరకు నిందితుడిని అరెస్టు చేయొద్దు

అదే డిఫాల్ట్ బెయిల్ ఉద్దేశమన్న కోర్టు.. ఝార్ఖండ్ మైనింగ్ కేసులో హేమంత్ సోరెన్ పీఏ బెయిల్ పిటిషన్ విచారణ

నిందితుడిని 18 నెలలుగా జైల్లో ఉంచడం ఇబ్బందికరమని వ్యాఖ్య

చివరకు ఈడీ అభ్యర్థనతో బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ, మార్చి 20: మనీ లాండరింగ్ కేసుల్లో నిందితులకు డిఫాల్ట్ బెయిల్ తిరస్కరించడానికి, వారిని జైల్లోనే ఉంచే ఉద్దేశంతో ఎన్ని అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేస్తారంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణ లేకుండానే నిందితులను నిరవధికంగా జైల్లోనే ఉంచేందుకు ఈడీ అనుసరిస్తున్న పద్ధతి సరికాదంటూ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఆక్షేపించింది. 'డిఫాల్ట్ బెయిల్ ఉద్దేశమేమిటంటే.. దర్యాప్తు పూర్తయ్యేవరకు మీరు నిందితుడిని అరెస్ట్ చేయకూడదు. మీరు (నిందితులను అరెస్టు చేసి కూడా) దర్యాప్తు పూర్తి చేసేవరకు విచారణ చేయొద్దని మాకు చెప్పలేరు. అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేస్తూ విచారణ లేకుండా నిందితులను నిరవధికంగా జైల్లో ఉంచలేరు' అంటూ ఈడీ తరపు

మిగతా 2వ పేజీలో...

రూ.8,350 కోట్లు

2023 డిసెంబరు 29 - ఫిబ్రవరి 15 మధ్య కేంద్రం ముద్రించిన ఎలక్టోరల్ బాండ్ల విలువ

ఆర్టీఐ ప్రశ్నతో వెలుగులోకి

సీజేఐ లేకపోతే స్వతంత్రంగా వ్యవహరించదా?

ఈసీ స్వతంత్రతకేమీ ముప్పు లేదు

సీఈసీ చట్టంపై నిరాధార ఆరోపణలే

సుప్రీంలో కేంద్రం వాదన

జిందాల్ X జిందాల్!

ఐరన్ వోర్ టెండర్లలో తనకు తానే పోటీ

'పోటీ ఉండాలి! కానీ... ఆ పోటీ నాతోనే అయి ఉండాలి. నన్ను కొట్టాలి. కానీ... ఆ కొట్టేది నేనే అయి ఉండాలి!' ఇవి పుష్ప-2 డైలాగులు కాదండోయ్! జగన్ సర్కారు టక్కుటమార విన్యాసాలు! 'జిందాల్'కు ఇనుప ఖనిజం టెండర్లు దక్కేలా చేసిన చిత్రాలు! టెండరు దక్కింది జిందాల్‌కు! ఈ బిడ్డింగ్‌లో జిందాల్‌పై పోటీగా ఉన్నదీ 'జిందాల్' సంస్థే! 'స్కీమ్' అదిరిపోయింది కదూ!

గనులు ఏపీఎండీసీవి! అధిక ఆదాయం దక్కాల్సింది ప్రభుత్వానికి. కానీ... దేశంలో ఎక్కడా లేని విధంగా జాయింట్ వెంచర్‌లో ప్రభుత్వ సంస్థ ఏపీఎండీసీ 11 శాతం ఆదాయంతో సరిపెట్టుకుంది. జిందాల్‌కు 89 శాతం దక్కుతోంది. 'స్కామ్' సూపర్ కదూ!

వచ్చిన టెండర్లు రెండే రెండు

అవి రెండూ 'జిందాల్'కు చెందినవే

మూడో కంపెనీకి అవకాశమే లేకుండా వ్యూహం

కొణిజేడు-మర్లపాడు ఐరన్‌వోర్ సమర్పయామి

ఏపీఎండీసీతో జిందాల్‌కు జాయింట్ వెంచర్

11:89 వాటాతో ప్రభుత్వ సంస్థకు పాతర

JINDAL GROUP

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఈ స్కీమూ, ఈ స్కామూ నభూతో న భవిష్యత్! టెండర్లలో సిండికేట్ కావడం, ఉత్తుత్తి కంపెనీలతో బిడ్లు వేయించడం చాలా చూశాం. కానీ... మూడో వాళ్లకు అవకాశం ఇవ్వకుండా, 'ఒకే' కంపెనీ ద్వారా రెండు టెండర్లు వేయించి... ఒకటి ఖరారు చేయడం బహుశా ఎక్కడా, ఎప్పుడూ జరిగి ఉండదు. ప్రకాశం జిల్లా కొణిజేడు-మర్లపాడు ఐరన్‌వోర్ టెండర్ విషయంలో ఇదే జరిగింది. ఈ టెండర్ నోటిఫికేషన్ సిద్ధమయ్యే దశలోనే దాన్ని జిందాల్‌కు కట్టబెట్టబోతున్నారని, ప్రభుత్వ పెద్దలు ముందే నిర్ణయించారని

మిగతా 11వ పేజీలో...

58 ఏళ్ల వయసులో ఐవీఎఫ్‌కు

అనుమతి ఎలా?



రెండో బిడ్డను కన్న సిద్ధూ మూసేవాలా తల్లిదండ్రులకు న్యాయపరమైన చిక్కులు

ఐవీఎఫ్‌కు అనుమతించే వయసు 21-50

చట్టపరమైన పత్రాలను సమర్పించండి

పంజాబ్ ప్రభుత్వాన్ని కోరిన కేంద్రం 2



సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు

బ్రెయిన్ సర్జరీ

4 వారాలుగా తీవ్రమైన తలనొప్పితో ఇబ్బంది

అయినప్పటికీ ఉత్సాహంగా శివరాత్రి వేడుకలకు హాజరు

17న ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రిలో చేరిక

వెంటనే సర్జరీ చేసిన వైద్యులు

సద్గురుకు ప్రధాని పరామర్శ

న్యూఢిల్లీ, మార్చి 20: ఆధ్యాత్మికవేత్త, ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ (66)కు బ్రెయిన్ సర్జరీ జరిగింది. గత నాలుగు వారాలుగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్న ఆయన మార్చి 14న న్యూఢిల్లీలోని అపోలో

మిగతా 2వ పేజీలో...



రూ. 75కే లీటర్ పెట్రోలు!

500కే గ్యాస్.. చెన్నైలో సుప్రీం బెంచ్

ఇండియా కూటమి గెలిస్తే సీఏఏ రద్దు

రైతుల రుణాలు వడ్డీ సహా మాఫీ

గృహిణులకు నెలకు రూ.వెయ్యి

డీఎంకే మేనిఫెస్టోలో వరాలు 2

లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్లు షురూ

తొలి దశ నోటిఫికేషన్ విడుదల

నామినేషన్ సమర్పణకు గడువు 27


శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువులో వైసీపీ ఎన్నికల ప్రచారంలో చిందులు వేస్తున్న గోరంట్లపల్లి గ్రామ వలంటీర్ హర్షద్ 2

వైసీపీ.. వలంటీర్!

కార్యకర్తలను మించి వలంటీర్ల బరితెగింపు

మంత్రి సురేశ్, చెవిరెడ్డితో చెట్టపట్టాల్.. పుట్టపర్తిలో కార్యకర్తల్లా చిందులు

అనిల్‌కుమార్‌కు జైకొట్టి కరపత్రాల పంపిణీ.. సోషల్‌మీడియాలో వైరల్

గుంటూరు జిల్లాలో 45 మంది తొలగింపు.. చిలకలూరిపేటలో వీఆర్‌ఏపై వేటు

ఎన్నికల కోడ్ ఉల్లంఘనులు!

ఎన్నికల సంఘం ఆదేశాలను లెక్కచేయని వైసీపీ ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌కు నోటీసులిచ్చిన సబ్ కలెక్టర్ 12

సత్తెనపల్లి కేవీఆర్ మార్ట్‌లో సోదాలు.. 1,684 ఎన్నికల చీరలు స్వాధీనం

రేపల్లెలో అనుమతి లేని సభను అడ్డుకున్న అధికారులు.. కేసు నమోదు



రోగులతో చెలగాటం

ఎన్నికల కోడ్ నెపంతో సీఎంసీవో సేవలకు బ్రేక్

ఆరోగ్యశ్రీ ట్రస్ట్ దారుణ నిర్ణయం.. రిఫరల్స్ జారీచేయని కో-ఆర్డినేటర్లు

రెండు రోజులుగా నిలిచిన సేవలు.. సీఎంసీవోకు, కోడ్‌కు సంబంధం లేదు

గతంలో సీఎం ఫొటో తొలగించి లెటర్లు జారీ.. ఈసారి నిలిపివేత

కో-ఆర్డినేటర్ల ఆఫీసుల వద్ద పేద రోగుల పడిగాపులు

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ నెపంతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మరో దారుణమైన నిర్ణయం తీసుకుంది. పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే చీఫ్ మినిస్టర్ క్యాంప్ ఆఫీస్ (సీఎంసీవో) రిఫరల్ లెటర్ల జారీని ఉన్నట్టుండి నిలిపివేసింది. ఇప్పటికే నెట్‌వర్క్ ఆస్పత్రుల నిరసనలతో పేద రోగులకు ఆరోగ్యశ్రీ సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. నెట్‌వర్క్ ఆస్పత్రులు కొత్త కేసులు తీసుకోవడం లేదు. దీనికి తోడు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఎంసీవో రిఫరల్స్‌ని కూడా నిలిపివేసింది. రాష్ట్రంలో ఎక్కడా వాటిని జారీ చేయొద్దని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో జిల్లా కో-ఆర్డినేటర్లను ఆదేశించారు. దీంతో రెండు రోజులుగా రిఫరల్స్ నిలిచిపోయాయి. ఎన్నికల కోడ్ రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రస్ట్ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఎన్నికల కోడ్‌కీ, ప్రజారోగ్యానికీ ఎలాంటి సంబంధం లేదు. గతంలో ఎన్నికల కోడ్ ఉన్నా సీఎంసీవో రిఫరల్స్‌ను మాత్రం నిలిపివేయలేదు. ఎలక్షన్ కమిషన్ కూడా ప్రజారోగ్యానికి ఇబ్బందులు లేకుండా చూడాలనే చెబుతుంది. ఆరోగ్యశాఖను ఎన్నికల కోడ్ పరిధిలోకి తీసుకోదు. కాబట్టి రిఫరల్స్‌ను నిలిపివేయాలని ఆదేశాలిచ్చే ప్రసక్తే లేదు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ముఖ్యమంత్రి ఫొటో పెట్టి సీఎంసీవో రిఫరల్ లెటర్లు జారీచేస్తారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో మాత్రం ముఖ్యమంత్రి బొమ్మను తొలగించి ఇస్తారు. గతంలో ఎన్నికల కోడ్ వచ్చినప్పుడు పేద రోగులు ఇబ్బంది పడకుండా ట్రస్ట్ అధికారులు రిఫరల్స్ జారీ చేశారు. కానీ, ఇప్పుడు మాత్రం

మిగతా 12వ పేజీలో...

ఒక్క చాన్స్ ఇస్తే అథఃపాతాళానికి

తొక్కేశాడు

జగన్ దెబ్బకు పరిశ్రమలు పరార్



అమరరాజా తెలంగాణకు పోయింది

భారత్ బయోటెక్స్ ఒడిశాకు వెళ్లింది

ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం కొనసాగుతూనే ఉంది

వ్యవస్థలను సర్వ నాశనం చేశారు

రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్రబాబు పగ్గాలు చేపట్టాల్సిందే

వైసీపీ అరాచకాలకు చెక్ పెట్టండి..

ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటేయండి

'బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్' కార్యక్రమంలో టీడీపీ నేత నారా లోకేశ్ పిలుపు 11

కడప నుంచే షర్మిల పోటీ! 11

నేడు జిల్లా కాంగ్రెస్ సీనియర్లతో భేటీ.. అనంతరం నిర్ణయం వెల్లడి?

దేశంలో స్టార్టప్ విప్లవం

2014లో వందలోపే.. ప్రస్తుతం 1.25 లక్షల స్టార్టప్‌లు.. మళ్లీ వచ్చేది మేమే: మోదీ



స్టార్టప్ మహాకుంభ్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మార్చి 20: ఐటీ రంగంలో ఒక స్టార్టప్ విజయం సాధించకపోతే మరో స్టార్టప్‌ను తీసుకొస్తారని.. కానీ, రాజకీయాల్లో మాత్రం కొందరిని పదేపదే ప్రయోగించాల్సి వస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ చెణుకులు విసిరారు. ఢిల్లీలో మూడు రోజులుగా జరుగుతున్న 'స్టార్టప్ మహాకుంభ్' ముగింపు సమావేశాలను ఉద్దేశించి ప్రధాని మోదీ బుధవారం ప్రసంగించారు. 'స్టార్టప్‌లను లాంచ్ చేసే వారి సంఖ్య ఎక్కువే. స్టార్టప్‌ల రంగం ప్రయోగాత్మకంగా ఉంటుంది. ఒకటి విఫలమైతే మరో కొత్తదాని కోసం పరిశోధిస్తారు. కానీ, రాజకీయాల్లో అలా లేదు. కొందరిని పదే పదే లాంచ్ చేయాల్సి వస్తోంది' అంటూ రాహుల్ పేరు ప్రస్తావించకుండా పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఎన్నికల తర్వాత వరుసగా మూడోసారి ప్రభుత్వంలోకి వచ్చి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతామని మోదీ ధీమా వ్యక్తం చేశారు. తన హయాంలో దేశంలో స్టార్టప్‌ల సంఖ్య గణనీయంగా పెరిగిందని.. 2014లో వందలోపు ఉన్న స్టార్టప్‌లు ప్రస్తుతం 1.25 లక్షలకు చేరుకున్నాయని, వాటితో దాదాపు 12 లక్షల మంది యువత ప్రత్యక్షంగా అనుబంధాన్ని కలిగి ఉన్నారని ప్రధాని తెలిపారు. ప్రపంచంలోనే భారత్ మూడో అతిపెద్ద స్టార్టప్‌ల దేశం, మన వద్ద వందకుపైగా యూనికార్న్‌లున్నాయని వెల్లడించారు. భారతీయ స్టార్టప్‌లు 12 వేలకుపైగా పేటెంట్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయని, ఈ సంఖ్య మరింత పెరగాలని మోదీ సూచించారు. ఒకప్పుడు విద్య అంటే ఉద్యోగం కోసమేనని, ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే జీవితంలో స్థిరపడ్డామనే అభిప్రాయాలు ఉండేవని.. ఇప్పుడు ఆ ఆలోచనా ధోరణి మారిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారతీయ యువత ఉద్యోగాలు అడగటం లేదని, ఉద్యోగాలను సృష్టిస్తోందన్నారు. ఇదంతా దేశాన్ని ఊపేస్తోన్న స్టార్టప్ విప్లవం వల్లే సాధ్యమైందని చెప్పారు.

బాండ్ల వివరాలు బయటకొస్తే.. రాహుల్ మొహం చూపించలేరు!

న్యూఢిల్లీ, మార్చి 20: ఎలక్టోరల్ బాండ్ల పూర్తి సమాచారం వెల్లడైనప్పుడు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ప్రతిపక్ష ఇండియా కూటమి మొహం చూపించలేరని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఈ బాండ్ల ద్వారా రూ.6,200 కోట్లు ఎందుకు తీసుకున్నారో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'న్యూస్ 18' నిర్వహించిన సదస్సులో అమిత్ షా మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోని ఇండియా కూటమి గతంలో మాదిరిగానే 'కట్ మనీ' (కమిషన్లు) దండుకోవాలనుకుంటోందని, అందుకే ఎలక్టోరల్ బాండ్లను వ్యతిరేకి స్తోందని ఆరోపించారు. ఈ బాండ్ల పూర్తి వివరాలు బయట పెట్టాలన్న సుప్రీం కోర్టు తీర్పు వల్ల రాజకీయ పార్టీలకు విరాళాల్లో మళ్లీ నల్లధనం ప్రవేశించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బాండ్ల వల్ల నల్లధనం అంతమయ్యే దశకు వచ్చిందన్నారు.

లోకం తీరు



నిందితులను జైల్లోనే ఉంచేందుకు ఎన్ని చార్జిషీట్లు?

(మొదటి పేజీ తరువాయి)

న్యాయవాది అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజుకు సూచించింది. జార్ఖండ్ మైనింగ్ కేసులోని నిందితుడు ప్రేమ్ ప్రకాశ్ (మాజీ సీఎం హేమంత్ సోరెన్ సహాయకుడు) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 'నిందితుడు 18 నెలలుగా జైల్లోనే ఉన్నాడు. ఇది మమ్మల్ని ఇబ్బందికి గురిచేస్తోంది. అందుకే మీ (ఈడీ) దృష్టికి తీసుకొస్తున్నాం. నిందితుడిని మీరు అరెస్టు చేసినప్పుడే విచారణ మొదలు కావాలి' అని స్పష్టంచేసింది. దీనిపై స్పందించిన ఎస్వీ రాజు.. పిటిషనర్ సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశముందని వాదించారు. అయితే ఆయన వాదనతో ఏకీభవించని కోర్టు.. 'అతను (ప్రేమ్ ప్రకాశ్) అలాంటిది ఏదైనా చేస్తే మా వద్దకు రండి' అంటూ వ్యాఖ్యానించింది. అలాగే ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా జైలు శిక్షను కూడా కోర్టు ప్రస్తావించింది. అయితే దర్యాప్తు పురోగతిని నిర్ధారించేందుకు ఒక నెల పాటు విచారణ జరపాలన్న ఈడీ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. ప్రేమ్ ప్రకాశ్‌కు మధ్యంతర బెయిల్‌ను నిరాకరిస్తూ విచారణ వాయిదా వేసింది.

సద్గురు వాసుదేవ్‌కు బ్రెయిన్ సర్జరీ

(మొదటి పేజీ తరువాయి)

ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు.ఆయనకు స్కానింగ్‌లు నిర్వహించిన వైద్యులు ఆయన తలలో రక్తస్రావం అవుతున్నట్లు గుర్తించారు. మార్చి 17న ఆయనకు సర్జరీ చేశారు. ఇప్పుడాయన వేగంగా కోలుకుంటున్నారని వైద్యులు ప్రకటించారు. ఆస్పత్రిలో కోలుకుంటున్న సద్గురు బుధవారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో హాస్యాత్మక ధోరణిలో ఒక వీడియోను విడుదల చేశారు. తన తలలో ఏదో వెతికేందుకు వైద్యులు తన తలను కోశారని, ఖాళీగా ఉండడంతో వెంటనే కుట్లు వేశారని చెప్పారు. కాగా, ఆస్పత్రిలో ఉన్న సద్గురుకు ప్రధాని మోదీ ఫోన్ చేసి పరామర్శించారు.


శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం పోన్నానపేట వద్ద రాలిపోయిన మామిడి కాయలు

ఉత్తరాంధ్రను ఊపేసిన వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఉత్తర తెలంగాణ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దాని ప్రభావంతో ఉత్తర కోస్తాలో అనేకచోట్ల మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. కొద్దిప్రాంతాల్లో భారీవర్షాలు పడ్డాయి. అకాల వర్షాలతో వాతావరణం కాస్త చల్లబడినా.. మెట్ట పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. భారీ వర్షానికి కాకినాడలో ప్రధాన రహదారులు నీటమునిగిపోయాయి. జగన్నాథపురం, పడగాలపేట, తూరంగిలో వడగండ్ల వాన కురిసింది. నడకుదురులో భారీ వృక్షం నేలకూలడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రత్తిపాడు మండలం టి.రాయవరంలో పిడుగుపడి పతేటి మహేష్(28)అనే పశువుల కాపరి మృతిచెందాడు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు సమీప చొదిమెళ్ళలో రైతు రావూరి రాటాల వెంకట సత్యనారాయణ(45) పిడుగు పడి మృతి చెందాడు. చింతలపూడి, లింగపాలెం, పోలవరం, చాట్రాయి, పెదవేగి, జీలుగుమిల్లి తదితర మండలాల్లో పొలాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న, కల్లాల్లో ఎండబెట్టిన ఎండుమిర్చి తడిసిపోయింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. శ్రీకాకుళం జిల్లాలో వర్షాలకు ఉద్దానం ప్రాంతంలో మామిడి పంటకు నష్టం ఏర్పడింది. రాయలసీమలో మాత్రం ఎండ తీవ్రత కొనసాగింది. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తాలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

500కే సిలిండర్.. 75కే లీటర్ పెట్రోల్

» డీఎంకే మ్యానిఫెస్టోలో వరాలు

చెన్నై, మార్చి 20(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తమిళనాడులోని అధికారపక్షం డీఎంకే ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. డీఎంకే మహిళా విభాగం నాయకురాలు కనిమొళి నాయకత్వంలో ఏర్పాటైన ప్రత్యేక కమిటీ ఈ మ్యానిఫెస్టోను రూపొందించింది. స్టాలిన్ మ్యానిఫెస్టోను ఆవిష్కరించారు. ప్రతిపక్ష ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే పౌరసత్వ సవరణ చట్టం-2019(సీఏఏ)ను రద్దు చేస్తామని ప్రకటించారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామన్నారు. వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తామని, లీటరు పెట్రోలు రూ.75, డీజిల్ రూ.65కు అందజేస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా రైతుల రుణాలు వడ్డీతో సహా మాఫీ చేస్తామని, అన్ని రాష్ట్రాల్లో గృహిణులకు ప్రతినెలా రూ.1,000 అందజేస్తామన్నారు. గవర్నర్ వ్యవస్థ రద్దుకు కృషి చేస్తామని, నీతి ఆయోగ్‌ను రద్దు చేస్తామని, హైవేలపై టోల్‌గేట్లు రద్దు చేస్తామని ప్రకటించారు. తమిళనాడులో నీట్‌ను రద్దు చేస్తామని, శ్రీలంక తమిళులకు భారత పౌరసత్వం ఇస్తామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా బడిపిల్లలందరికీ ఉదయం అల్పాహారం అందజేస్తామని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కోసం స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తామన్నారు.

58 ఏళ్ల వయసులో ఐవీఎఫ్‌కు అనుమతి ఎలా?

» సిద్ధూ మూసేవాలా తల్లిదండ్రులకు చిక్కులు

న్యూఢిల్లీ, మార్చి 20: ప్రముఖ పంజాబీ గాయకుడు, దివంగత సిద్ధూ మూసేవాలా తల్లిదండ్రులు బాల్‌కౌర్ సింగ్, చరణ్ కౌర్ ఐవీఎఫ్ (ఇన్-విట్రో ఫెర్టిలైజేషన్) పద్ధతిలో రెండో బిడ్డకు జన్మనిచ్చిన అంశం వివాదానికి కారణమవుతోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ప్రస్తుతం చరణ్ కౌర్ వయస్సు 58 సంవత్సరాలు, బాల్‌కౌర్ సింగ్‌కు 60 ఏళ్లు. దీంతో వీరు చిక్కుల్లో పడ్డారు. నిబంధనల ప్రకారం ఐవీఎఫ్ పద్ధతిలో బిడ్డను కనడానికి అనుమతించే వయస్సు 21 నుంచి 50 ఏళ్లు మాత్రమే. కానీ, మూసేవాలా తల్లి చరణ్ కౌర్‌ను 58 ఏళ్ల వయసులో ఈ విధానానికి ఎలా అనుమతించారని కేంద్ర ఆరోగ్యశాఖ పంజాబ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. చరణ్ కౌర్ ఐవీఎఫ్ చికిత్స ద్వారా గర్భం దాల్చిన విషయం ఇటీవల ఒక వార్తాపత్రికలో వచ్చిన కథనం ద్వారా తమ దృష్టికి వచ్చిందని, ఈ చికిత్సకు సంబంధించిన నివేదిక సమర్పించాలని కోరుతూ ఈ నెల 14న పంజాబ్ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ విషయాన్ని ఆప్ నేతృత్వంలోని భగవంత్ మాన్ ప్రభుత్వం బుధవారం ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడించింది. కాగా, బాల్‌కౌర్ సింగ్, చరణ్‌కౌర్ దంపతులకు సిద్ధూ మూసేవాలా ఒక్కడే సంతానం. గాయకుడు, కాంగ్రెస్ నేత అయిన సిద్ధూను 2022 మే 29న దుండగులు తుపాకీతో కాల్చి చంపారు.

వైసీపీ.. వలంటీర్!

కార్యకర్తలను మించి బరితెగింపు

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)


శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువులో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్న స్టోర్ డీలర్ మండ్లి ప్రభావతమ్మ


మంత్రి సురేశ్, చెవిరెడ్డితో ప్రచారం నిర్వహిస్తున్న వలంటీర్లు పొన్నూరి సురేశ్, దేపూరి శివయ్య (వృతంలో)

ఎన్నికల కోడ్ అడ్డుగా ఉన్నా వలంటీర్లు హద్దుమీరుతున్నారు. అధికార పార్టీ అభ్యర్థుల ప్రచారంలో అత్యుత్సాహం చూపుతున్నారు. బుధవారం ప్రకాశం జిల్లా సింగరాయకొండలో మంత్రి సురేశ్, వైసీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పొన్నూరి సురేశ్, సిరిమల్లె మణికంఠ, దేపూరి శివయ్య, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కామినేని కొండలరావు... పాల్గొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి ఈర లక్కప్పతో కలిసి రాళ్లపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్ రెండు రోజులుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు మండల కేంద్రంలో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నిర్వహించిన ప్రచారంలో గోరంట్లపల్లి గ్రామ వలంటీరు హర్షద్ చిందులు వేస్తూ ఇంటింటికీ తిరిగారు. కొత్తచెరువు బీసీ కాలనీలో 4వ సచివాలయం వలంటీరు సాయిప్రకాశ్, ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న సుదర్శన్‌బాబు కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కల్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రంలో వైసీపీ అభ్యర్థి, ఎంపీ తలారి రంగయ్యతో కలిసి వార్డు వలంటీరు రిజ్వాన్ ప్రచారంలో పాల్గొన్నాడు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం ఏనుగుపాలెంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, నరసరావుపేట పార్లమెంటు వైసీపీ అభ్యర్థి అనీల్ కుమార్ యాదవ్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు వజ్జ రామకోటేశ్వరరావు, పిలికదుపుల నాగరాజు, గుమ్మ వెంకటేశ్వర్లు సందడిచేశారు. అనీల్‌కుమార్‌యాదవ్ బెల్లంకొండలో నిర్వహించిన ప్రచారంలో బెల్లంకొండకు చెందిన వలంటీర్ పర్వతం రాములు వైసీపీకి అనుకూలంగా నినాదాలు చేశారు. దీనిపై టీడీపీ నాయకులు...పెదకూరపాడు రిటర్నింగ్ అధికారికి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పాతపాడులో ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు నిర్వహించిన ప్రచారంలో ఆ గ్రామానికి చెందిన ఇద్దరు వలంటీర్లు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం గోపాలపురంలో మంగళవారం రాత్రి వైసీపీ అద్దంకి అభ్యర్థి హనిమిరెడ్డి ఎన్నికల ప్రచారంలో 1వ వార్డు వలంటీర్ నారాయణ ప్రచారంలో పాల్గొన్న ఫొటోలు, వీడియోలు వైరలయ్యాయి.

వలంటీర్లపై ఈసీ కొరడా

వైసీపీ సమన్వయకర్తల సమావేశాలకు హాజరవుతున్న 45మంది వలంటీర్లను గుంటూరు జిల్లా అధికారులు విధుల నుంచి తొలగించారు. ఈ నెల 16న ఎన్నికల కోడ్ అమలులోకి రాగా అదే రోజున గుంటూరు జిల్లా పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఏర్పాటు చేసిన సమావేశానికి పలువురు వలంటీర్లు హాజరయ్యారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం సీఈవో ఎంకే మీనా ఆగ్రహం వ్యక్తం చేయ డంతో విచారణ జరిపి ఆ వలంటీర్లను తొలగించారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ పంచాయతీలో వైసీపీ సమావేశానికి హాజరైన వెనిగండ్లకు చెందిన ఇద్దరు, తక్కెళ్లపాడుకు చెందిన ఐదుగురు, పెదకాకానికి చెందిన ఒక వలంటీర్‌ని కూడా తొలగించారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో అభ్యర్థుల ప్రచారంలో పాల్గొన్న జె.వెంకటంపల్లికి చెందిన వలంటీర్ శ్రీనివాసులు, మద్యం అక్రమ రవాణా చేస్తున్న పూలకుంటకు చెందిన వలంటీరు హనుమంతును విధుల నుంచి తొలగించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్న ఉపాధ్యాయుడు ఎస్. రామాంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ జె.శివప్రసాద్‌ను సస్పెండ్ చేశామని శ్రీసత్యసాయి జిల్లా డీఈవో మీనాక్షి తెలిపారు. విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 19వ వార్డు వలంటీర్ పి.కరుణను కలెక్టర్ విధుల నుంచి తొలగించారు. ఉండి మండలం ఉణుదుర్రు గ్రామ సచివాలయంలో పని చేస్తున్న తొమ్మిదిమంది గ్రామ వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్టు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.

వలంటీర్ వద్ద 66 మద్యం బాటిళ్లు స్వాధీనం

మోపిదేవి, మార్చి 20 : కృష్ణా జిల్లా మోపిదేవి మండలం కప్తానుపాలెంలో ఎస్ఈబీ అధికారులు బుధవారం రాత్రి చేసిన దాడిలో వలంటీరు వద్ద 66 మద్యం (క్వార్టర్ బాటిళ్ల)ను స్వాధీనం చేసుకున్నారు. వలంటీరుగా పనిచేస్తున్న డి.వేణు ఇంటిలో అధికమొత్తంలో మద్యం బాటిళ్లు ఉన్నాయనే సమాచారంతో పోలీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. అధికమొత్తంలో మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నా అధికారపార్టీ నాయకుల ఒత్తిడి కారణంగా 66 మద్యం బాటిళ్లనే లెక్కచూపుతున్నారని గ్రామస్తులు చెప్పుకుంటున్నారు.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
అనంతపురం	39.0	23.0
కర్నూలు	38.7	25.8
ఒంగోలు	33.9	26.0
ఏలూరు	33.0	21.0
విజయవాడ	33.5	24.0

లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ షురూ

న్యూఢిల్లీ, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. తొలి దశలో దేశంలోని 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 లోక్‌సభ సీట్లకు ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం బుధవారం జారీ చేసింది. దీంతో నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైంది. అభ్యర్థులు తమ నామినేషన్లు సమర్పించేందుకు మార్చి 27వ తేదీ తుది గడువు. అయితే, ఓ పండగ నేపథ్యంలో బిహార్‌లో మార్చి 27న సెలవు రోజు కావడంతో అక్కడ మాత్రం నామినేషన్ల స్వీకరణ మార్చి 28తో ముగుస్తుంది. అభ్యర్థుల నుంచి స్వీకరించిన నామినేషన్ల పరిశీలన మార్చి 28న జరుగుతుంది. బిహార్‌లో మాత్రం మార్చి 30న నిర్వహిస్తారు. ఇక, నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు మార్చి 30 కాగా బిహార్‌లో ఈ గడువును ఏప్రిల్ 2గా నిర్ణయించారు. తొలి దశలో అరుణాచల్ ప్రదేశ్, అసోం, బిహార్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జమ్మూకశ్మీర్, లక్ష్యద్వీప్, పుదుచ్చేరిలో ఎన్నికలు జరగనున్నాయి.

ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి కారుపై దాడి

» వలంటీర్లకు వైసీపీ తాయిలాలు పంచుతున్నట్టు సమాచారం
» పట్టుకునేందుకు వెళ్లిన రామాంజనేయులు
» కారుపై దాడి.. పోలీస్‌స్టేషన్ వద్ద మరోసారి

గుంటూరు, మార్చి 20: గుంటూరు జిల్లా ప్రత్తిపాడు వైసీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు కారుపై బుధవారం వైసీపీ వర్గీయులు దాడి చేశారు. టీడీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. గుంటూరు జేకేసీ కళాశాల రోడ్డులోని ప్రత్తిపాడు వైసీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ కార్యాలయంలో వలంటీర్లకు నగదు, తాయిలాలు పంచుతున్నట్లు టీడీపీ అభ్యర్థి రామాంజనేయులుకు సమాచారం అందింది. దీంతో వారిని పట్టుకునేందుకు ముఖ్య నేతలతో కలిసి రామాంజనేయులు వెళ్లారు. ఆయన రాకను గమనించిన వైసీపీ వర్గీయులు ఒక్కసారిగా టీడీపీ అభ్యర్థి కారును చుట్టుముట్టి దాడికి యత్నించారు. కారు అద్దాలు ధ్వంసం చేసి కార్యకర్తలపై దాడి చేశారు. పోలీసులు ఇరువర్గాలను సముదాయించి పంపారు. రామాంజనేయులు అక్కడి నుంచి నేరుగా నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. వారి వెంటే వైసీపీ వర్గీయులు కూడా వెళ్లారు. పెద్ద సంఖ్యలో వచ్చిన వైసీపీ కార్యకర్తలు తీవ్రస్థాయిలో హెచ్చరికలు, బెదిరింపులతో టీడీపీ వారిపై ఊగిపోవడంతో పోలీసులు సైతం టెన్షన్‌కు గురయ్యారు. అతి కష్టం మీద వైసీపీ వర్గీయులను అదుపు చేయగలిగారు. ఇరువర్గాలు జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదులు చేసుకున్నాయి. ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు వాహనంపై వైసీపీ గూండాల దాడిని పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య తీవ్రంగా ఖండించారు. దాడులకు పాల్పడిన గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేపల్లెలో టీడీపీ నాయకులపై వైసీపీ దాడి

రేపల్లె: బాపట్ల జిల్లా నిజాంపట్నానికి చెందిన చెందిన వైసీపీ నాయకులు మోపిదేవి మార్కండేయులు, కొప్పనాతి శ్రీను, పెద పోతురాజు, రేవు ఏడుకొండలు తనపై దాడి చేశారని అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణకు బుధవారం ఫిర్యాదు చేశారు. వారు తన ఇంటికి వచ్చి టీడీపీలో తిరిగితే ఉపేక్షించేది లేదని బెదిరించారన్నారు.

ఎమ్మెల్యే వస్తే నిల్చోలేవా?

దెందులూరు ఎమ్మెల్యే అనుచరుల వీరంగం

ఏలూరు (దెందులూరు), మార్చి 20: చింతలపూడి శివారు తిమ్మనగూడెంలో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి 'నేను సిద్ధం.. నా ఊరు సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ఎమ్మెల్యే తిరిగి వెళుతూ.. తిమ్మనగూడెంలో బెంచీపై కూర్చున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన పిపర్ల దుర్గాప్రసాద్‌కు అభివాదం చేశారు. దుర్గాప్రసాద్ స్పందించకుండా అలాగే కూర్చుని ఉండడంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే అనుచరులు అతడిపై దాడి చేశారు. గాయపడిన దుర్గాప్రసాద్‌ను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జనసేన నేత కారుపై రాళ్ల దాడి

కొల్లిపర, మార్చి 20: గుంటూరు జిల్లా కొల్లిపర మండలం వల్లభాపురంలో బుధవారం జనసేన నాయకుడు భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి కారుపై రాళ్లదాడి జరిగింది. జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల పలువురు వైసీపీ కార్యకర్తలను జనసేనలో చేర్చారు. దీంతో కక్షగట్టిన అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఆయన కారుపై రాళ్లు విసిరారు. కారు అద్దాలు పగిలిపోయాయి.

దళితులపై వైసీపీ నేత ఫ్యామిలీ దాడి

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం అయ్యప్పనగర్‌లో జెర్రిపోతుల ప్రియాంక బుధవారం ఉదయం చెత్తను బయటపడేసేందుకు వెళ్తుండగా గొట్టిముక్కల శివారెడ్డి బెదిరించారు. ప్రియాంకతోపాటు ఆమె భర్త మురళి అంతుచూస్తామని బెదిరిస్తుండగా.. తిరిగి ప్రశ్నించడంతో మురళిని కొట్టారు. అదే సమయంలో శివారెడ్డి, మాజీ సర్పంచ్ తాళ్ల సంజీవరెడ్డి కుటుంబ సభ్యులు కూడా తమపై దాడి చేసినట్లు ప్రియాంక తెలిపారు. కులం పేరుతో దూషించారని ప్రియాంక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, తెల్లవారుజామున తన భర్త లేని సమయంలో శివారెడ్డి ఇంటికొచ్చి తలుపు తీయాలని బెదిరించాడని ప్రియాంక ఫిర్యాదులో పేర్కొన్నారు.

టీడీపీ నేత మునయ్య హత్యకు ముందే కుట్ర!

» వైసీపీ నుంచి వలసలు పెరగడం వల్లే!!
» చంపుతామని బెదిరించినా 2022 నుంచి తెలుగుదేశంలో క్రియాశీలంగానే మునయ్య
» సిద్ధం సభకు పరమేశ్వరనగర్ నుంచి వెళ్లని జనం
» ఇటీవల ప్రధాని సభకు మాత్రం భారీగా హాజరు
» దీంతో పథకం ప్రకారమే మునయ్య హత్య?

(ఒంగోలు-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీకి చెందిన గిరిజన యువకుడు మునయ్య హత్య కేసులో కుట్రదారులను కాపాడేందుకు ప్రయత్నం జరుగుతోంది. వారి పేర్లు చెప్పొద్దని ఆయన భార్యపై కొందరు పోలీసు అధికారులు ఒత్తిడి కూడా తెస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో రాజకీయంగా సంచలనం సృష్టించిన ఈ హత్య ఘటనపై ప్రకాశం జిల్లా పోలీసు అధికారులు పెదవి విప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఈ ఘటనపై దృష్టిసారించడంతో వారిలో కలవరం ఆరంభమైంది. గిద్దలూరు మండలంలో గిరిజన గ్రామమైన పరమేశ్వరనగర్‌కు చెందిన మునయ్యపై సోమవారం (18న) వైసీపీ నేతలు దాడిచేయడం, హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించడం తెలిసిందే. ఈ హత్యకు 2022లోనే కుట్ర జరిగినట్లు తాజాగా తెలుస్తోంది. గడికోట పంచాయతీలోని పరమేశ్వరనగర్‌లో నిన్న మొన్నటివరకు వైసీపీదే ఆధిపత్యం. గిరిజనులు నివసించే ఆ గ్రామంలో వైసీపీ విధానాలు, జగన్ పాలనతో మునయ్య విభేదించి రెండేళ్ల కిందటే టీడీపీలో చేరాడు. ఆ తర్వాత ఆ ఊరి గిరిజనుల్లో అత్యధికులు ఆయన బాటే పట్టారు. ఆయన చొరవతో గడికోటలో కూడా వైసీపీ నుంచి కొందరు టీడీపీలో చేరారు. వలసలు నానాటికీ పెరిగిపోతుండడంతో వైసీపీ నేతలు మునయ్యను మొదట బెదిరించారు. ఆ తర్వాత హత్య చేయాలని నిర్ణయించారు. మునయ్యకు సన్నిహితుడైన వ్యక్తే ఫోన్ చేసి 'నిన్ను లేపేందుకు సిద్ధమయ్యారు.. జాగ్రత్త' అని హెచ్చరించారు. అయినా మునయ్య టీడీపీలో క్రియాశీలంగానే ఉంటూ వచ్చారు. మేదరమెట్లలో ఇటీవల సీఎం జగన్ సిద్ధం సభకు గడికోట, పరమేశ్వరనగర్ నుంచి ప్రజలు పెద్దగా వెళ్లలేదు. చిలకలూరిపేటలో ప్రధాని పాల్గొన్న టీడీపీ కూటమి సభకు మాత్రం బస్సు నిండా వెళ్లారు.

వలసలను అదుపు చేసేందుకే..

వాస్తవానికి గడికోట ప్రాంత గ్రామాల్లో ఒకప్పుడు హత్యా రాజకీయాలు కొనసాగాయి. అయితే దశాబ్దకాలంగా అలాంటి ఆనవాళ్లు లేవు. ఇటీవల ఆ ప్రాంత జడ్పీటీసీ సభ్యుడు, బీసీ వర్గానికి చెందిన మధుసూదన్‌యాదవ్ కూడా వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. ఆ తర్వాత పలు గ్రామాల్లో ఎస్టీలు పెద్ద సంఖ్యలో ఆ పార్టీలో చేరారు. నానాటికీ టీడీపీలోకి వలసలు పెరిగిపోతుండడంతో మునయ్యపై 2022 లోనే హత్యకు పథకం రూపొందించినా.. ఇప్పుడు అమలు చేశారని అంటున్నారు. ఇంకోవైపు.. హత్యకు కుట్ర చేసిన వైసీపీ నాయకులను తప్పించేందుకు పోలీసు అధికారులు విశ్వప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. దాడిలో పాల్గొన్న నలుగురు వైసీపీ కార్యకర్తలకు నిత్యం అండగా ఉండే ఇద్దరు వైసీపీ నాయకుల పేర్లు బయటకు రాకుండా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. సోమవారం రాత్రి మునయ్యపై దాడిచేయగా, తొలుత కొట్లాటగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదు. రాజకీయంగా వాతావరణం వేడెక్కడంతో హత్య ఘటనగా గుర్తించారు. అయితే ఇప్పటివరకు హతుడి భార్య నుంచి ఎలాంటి స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదు. ఇదే సమయంలో మునయ్యపై దాడిచేసిన నలుగురి పేర్లు మాత్రమే చెప్పాలని.. వారి వెనుక ఉన్నవారి పేర్లు చెప్పవద్దంటూ ఆమెను భయపెడుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న టీడీపీ నాయకత్వం.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక హత్య జరిగినా పోలీసు శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై ఈసీకి ఫిర్యాదు చేసింది. దీనిపై రాష్ట్ర ఎన్నికల అధికారులు దృష్టిసారించడంతో పోలీసులు వైసీపీ నాయకులపై ఒత్తిడి పెంచారు. దీంతో వారు దాడికి పాల్పడిన నలుగురినీ మంగళవారం రాత్రే మార్కాపురం డీఎస్పీ బాలసుందర్‌రావు వద్దకు పంపినట్లు తెలుస్తోంది. అయితే ఇంతవరకు నిందితుల అరెస్టు చూపించకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ 45 రోజుల్లో రూ.8,350 కోట్ల బాండ్లు!

న్యూఢిల్లీ, మార్చి 20: ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది ఫిబ్రవరి 15నే అయినా.. ఆ తీర్పును రిజర్వ్ చేసింది 2023 నవంబరులో. ఆ తర్వాత.. డిసెంబరు 29 నుంచి తీర్పు వెలువరించే రోజు దాకా మోదీ సర్కారు ముద్రించిన ఎన్నికల బాండ్ల విలువ ఎంతో తెలుసా? అక్షరాలా రూ.8,350 కోట్లు. ఈ రెండున్నర నెలల సమయంలో మోదీ సర్కారు ఒక్కొక్కటీ రూ.కోటి విలువ చేసే 8,350 ఎలక్టోరల్ బాండ్లను ముద్రింపజేసింది. లోకేశ్ బాత్రా అనే సామాజిక కార్యకర్త సమాచారహక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ ఇచ్చిన సమాచారమిది. 2018లో ఈ పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచీ ప్రభుత్వం ముద్రించిన మొత్తం బాండ్ల విలువ రూ.35,600 కోట్లు. ఇక.. 2018 నుంచి 2023 నడుమ ఎన్నికల బాండ్లను జారీచేసినందుకుగాను, ఈ పథకాన్ని అమలు చేసినందుకుగాను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కమీషన్‌గా తీసుకున్న సొమ్ము రూ.13.5 కోట్లు అని ఆర్టీఐ సమాధానం ద్వారా వెల్లడైంది.

సీజేఐ లేకపోతే స్వతంత్రంగా వ్యవహరించదా?

న్యూఢిల్లీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం కమిషనర్లను ఎంపిక చేసే కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేనంత మాత్రాన ఈసీ స్వతంత్రంగా వ్యవహరించదని ఎలా అంటారని కేంద్ర ప్రభుత్వం నిలదీసింది. ఎన్నికల కమిషనర్ల నియామకంపై తాము గత సమావేశాల్లో ఆమోదించిన సీఈసీ చట్టాన్ని రాజకీయ దురుద్దేశాలతోనే వ్యతిరేకిస్తున్నారని సుప్రీంకోర్టుకు తెలిపింది. తాజాగా ప్రభుత్వం చేపట్టిన ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాన్ని నిలిపివేయాలంటూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ , కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్లను ప్రభుత్వం వ్యతిరేకించింది. తాము నియమించిన కమిషనర్ల సామర్థ్యం, అర్హతలపై ఏ అభ్యంతరాలు రాలేదని బుధవారం కేంద్ర ప్రభుత్వం తరపున న్యాయ శాఖ అదనపు కార్యదర్శి సుప్రీంకు ఇచ్చిన అఫిడవిట్‌లో తెలిపారు.

దేశంలో 1% మంది చేతిలో 40 శాతం సంపద

» 2000 సంవత్సరం ప్రారంభం నుంచి పెరుగుతున్న అసమానత్వం

న్యూఢిల్లీ, మార్చి 20: భారత్‌లో 2000 సంవత్సరం ప్రారంభం నుంచి అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయని, 2022-23 సంవత్సరంలో అగ్రశ్రేణి ఒక శాతం మంది ఆదాయం, సంపద వరుసగా 22.6 శాతానికి, 40.1 శాతానికి పెరిగిందని ఓ వర్కింగ్ పేపర్ పేర్కొంది. 'ఇన్‌కమ్ అండ్ వెల్త్ ఇన్‌ఈక్వాలిటీ ఇన్ ఇండియా, 1922-2023: ది రైజ్ ఆఫ్ బిలియనీర్ రాజ్' పేరుతో ఈ పేపర్‌ను విడుదల చేశారు. 2022-23నాటికి దేశంలోని అగ్రశ్రేణి 1% మంది ఆదాయం, సంపద వాటాలు (22.6%, 40.1%) వారి చరిత్రలో గరిష్ఠ స్థాయిల్లో ఉన్నాయని, వీరి ఆదాయం వాటా దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికాకన్నా కూడా అధికంగా ఉందని పేపర్ తెలిపింది. ఆదాయం, సంపదకు సంబంధించిన పన్ను కోడ్‌లో పునర్‌వ్యవస్థీకరణతోపాటు ఆరోగ్యం, విద్య, పోషకాహారంలో ప్రభుత్వ పెట్టుబడుల వల్ల ప్రపంచీకరణమూలంగా సంపన్నులే కాకుండా సగటు భారతీయులు కూడా ప్రయోజనం పొందే అవకాశం ఉందని పేర్కొంది.

విద్యా'రత్నం' ఇకలేరు

- రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం కన్నుమూత
- అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరులో తుదిశ్వాస
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య సహా పలువురి దిగ్భ్రాంతి



నెల్లూరు(విద్య), మార్చి 20: విద్యావేత్త, రత్నం విద్యాసంస్థల అధినేత కొర్రపాటి వెంకట రత్నం (కేవీ రత్నం, 82) తుదిశ్వాస విడిచారు. మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం తీవ్ర అస్వస్థకు గురై కన్నుమూశారు. విద్యారంగంలో చెరగని ముద్రవేసిన ఆయన విద్యాసంస్థల విజయాలకు నెలవుగా నెల్లూరు జిల్లా కీర్తిని ఇనుమడింప చేశారు. రాష్ట్రంలోనే తొలిసారిగా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి లక్షలాది మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించారు. ఆయన శిష్యులు ఎందరో నేడు ప్రపంచ వ్యాప్తంగా అత్యున్నత స్థానాల్లో ఉన్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం చలపనాయుడుపల్లిలో 1943 మే 23న జన్మించిన రత్నం... ఆత్మకూరు ప్రాంతంలోనే పదో తరగతి పూర్తి చేశారు. 1961-62లో పీయూసీ, 1963-66లో నెల్లూరు వీఆర్ కళాశాలలో బీఎస్సీ కెమిస్ట్రీలో డిస్టింక్షన్ సాధించారు. 1966లో అదే కళాశాల కెమిస్ట్రీ విభాగంలో నెలకు రూ.240 జీతంతో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అదే ఏడాది నగరంలోని రజక వీధిలో జయంతి ట్యుటోరియల్స్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత 1983లో రాష్ట్రంలోనే తొలిసారిగా రత్నం కోచింగ్ సెంటర్ ప్రారంభించి, 1985లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. అక్కడినుంచి అంచెలంచెలుగా ఎదిగిన రత్నం విద్యాసంస్థలు రాష్ట్రంలోనే సంచలనాత్మక విద్యావేదికగా గుర్తింపు పొందాయి. ఓవైపు విద్యనందిస్తూనే మరోవైపు సేవా కార్యక్రమాలకూ శ్రీకారం చుట్టారు. 2005లో చిన్నారి హార్ట్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి 140మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేయించి అందరి మన్ననలు పొందారు. కేవీ రత్నం మృతిపట్ల మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నెల్లూరు హరనాథపురం శ్రీకృష్ణ అవెన్యూలోని ఆయన నివాసంలో ఉంచిన భౌతికకాయాన్ని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇతర ప్రముఖులు, విద్యావేత్తలు, విద్యార్థులు సందర్శించి నివాళులర్పించారు.

టెన్త్ పరీక్షకు 96.86 శాతం హాజరు

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):పదో తరగతి పరీక్షల్లో బుధవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 96.86 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 6,51,607 మంది విద్యార్థులకు గాను 6,30,468 మంది పరీక్షలు రాశారని వివరించారు. 17,274 మంది గైర్హాజరయ్యారన్నారు.

జగన్ ఓటమే లక్ష్యంగా పనిచేస్తాం: సర్పంచుల సంఘం

విశాఖపట్నం (డాబాగార్డెన్స్), మార్చి 20: రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఓటమే ధ్యేయంగా పనిచేస్తామని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు ప్రకటించారు. బుధవారం విశాఖపట్నం డాబాగార్డెన్స్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని ఆరోపించారు. పంచాయతీల్లో సమస్యలపై తమ సంఘం గత మూడున్నరేళ్లుగా ఆందోళనలు చేస్తోందన్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పంచాయతీలకు జరిగిన అన్యాయం వివరిస్తామని తెలిపారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతకాయల ముత్యాలరావు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్ల ఏర్పాటు పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. సర్పంచుల సమస్యలను పరిష్కరించే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇస్తామని స్పష్టంచేశారు.

వైసీపీ అరాచకాన్ని అడ్డుకుందాం టీడీపీని గెలిపించుకుందాం

- అధైర్యం వద్దు... అన్నివేళలా అండగా ఉంటాం
- నేనూ సీమ బిడ్డనే... దేనికీ భయపడను
- 'నిజం గెలవాలి'లో భువనేశ్వరి

రాయచోటి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఐదేళ్లుగా జరుగుతున్న వైసీపీ అరాచకాన్ని అందరం కలిసి అడ్డుకుందాం. టీడీపీని గెలిపించుకుందాం. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందాం' అని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో 'నిజం గెలవాలి' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బుధవారం ఉదయం భువనేశ్వరి హైదరాబాదు నుంచి తిరుపతికి విమానంలో వచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన మధ్యాహ్నం రాయచోటి నియోజకవర్గం గాలివీడు మండలం ఎగువగొట్టివీడు పంచాయతీ నాగన్నగుట్టపాలెం నగరికి చేరుకున్నారు. ఈ గ్రామానికి చెందిన రెడ్డెమ్మ, చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్తాపానికి గురై మృతి చెందారు. ఆమె భర్త, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌నాయుడును భువనేశ్వరి ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం రాయచోటి మునిసిపాలిటీలోని రాజుల కాలనీలో రవీంద్రరాజు కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని తండ్రి వెంకటరాజు, ఇతర కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'జగన్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎదుర్కొని, నిజాన్ని గెలిపిద్దాం. టీడీపీకి నిర్భయంగా ఓటు వేసి చంద్రబాబును సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేను కూడా రాయలసీమ ఆడబిడ్డనే. ఎటువంటి వాటికి భయపడే ప్రసక్తే లేదు' అని అన్నారు.



రాయచోటిలో రవీంద్రరాజు కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న భువనేశ్వరి

దిశ కానిస్టేబుల్ సస్పెన్షన్

తిరుపతి క్రైం/భాకరాపేట, మార్చి 20: భువనేశ్వరికి స్వాగతం పలికిన దిశ కానిస్టేబుల్ సస్పెండయ్యారు. తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటకు చెందిన రాజశేఖర్ తిరుపతి దిశ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం తిరుపతి నుంచి రాయచోటి వెళుతున్న భువనేశ్వరికి భాకరాపేట టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన కూడా స్వాగతం పలికారు. అధికారులు ఈ విషయాన్ని ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ దృష్టికి తీసుకెళ్లడంతో రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుమలలో నారా లోకేశ్

- నేటి ఉదయం తల్లి, సతీమణితో శ్రీవారి దర్శనం
- కుమారుడు దేవాన్ష్ జన్మదినం సందర్భంగా అన్నదానం

తిరుమల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు చేరుకున్నారు. గురువారం దేవాన్ష్ పుట్టినరోజు కావడంతో ఒక్కరోజు అన్నప్రసాద వితరణ పథకానికి నారా కుటుంబం టీటీడీకి రూ.38 లక్షలు విరాళాన్ని అందజేసింది. బుధవారం రాత్రి 7 గంటలకు భువనేశ్వరి తిరుమలలోని గాయత్రి నిలయం అతిథిగృహానికి చేరుకున్నారు. అలాగే రాత్రి 8.30 గంటలకు సతీమణి బ్రహ్మణి, కుమారుడు దేవాన్ష్‌తో కలిసి లోకేశ్ అక్కడికి వచ్చారు. గురువారం ఉదయం లోకేశ్ దంపతులు, భువనేశ్వరి శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనానికి చేరుకుని భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేయనున్నారు.

భారీగా గంజాయి పట్టివేత


కొయ్యూరు/శృంగవరపుకోట, మార్చి 20: అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల్లో భారీగా గంజాయి పట్టుబడింది. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ బచ్చింత గ్రామ శివారులో బుధవారం 532 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్టు చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. బచ్చింత గ్రామ శివారులో భారీగా గంజాయి ఉన్నట్టు సమాచారం అందడంతో ముగ్గురిని అరెస్టు చేసి, 532 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం బొడ్డవర చెక్‌పోస్టు సమీపంలో ఎస్ఈబీ అధికారులు బుధవారం 350 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం వైపు వెళ్తున్న ఒక లారీని తనిఖీ చేయగా గంజాయి బయటడినట్టు ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బీటీజీ రాజు, సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

వైభవంగా మొదలైన శ్రీవారి తెప్పోత్సవాలు



తెప్పపై విహరిస్తున్న సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి

తిరుమల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం శ్రీవారి తెప్పోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం పక్కనే ఉన్న పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పపై మూడుచుట్లు తిప్పారు. గురువారం రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి పుష్కరిణిలో తెప్పపై విహరించనున్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎదురులేని నేత!

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో అత్యధిక శాతం ఓట్లు సాధించి ఐదోసారి మళ్ళీ అధ్యక్షుడైనారు. ఆయనకు వ్యతిరేకంగా పోటీచేసిన మూడుపార్టీల అభ్యర్థులకు నాలుగుశాతం చొప్పున ఓట్లు పడితే, మిగతా 88శాతం ఓట్లు పుతిన్‌కే వచ్చాయి. తొలి ఓటు పడడానికి ముందే ఫలితం నిర్ణయమైపోయింది అంటూ పాశ్చాత్యమీడియా ఎప్పటినుంచో రాస్తున్నది, ఆయా దేశాల ప్రతిస్పందన కూడా తదనుగుణంగానే ఉన్నది. రష్యా మిత్రదేశాధినేతలు పుతిన్‌ను అభినందించారు, కలసికట్టుగా ప్రపంచాన్ని ఉద్ధరించాలని ఆకాంక్షించారు.

ప్రధానిగా, అధ్యక్షుడిగా మొత్తం పాతికేళ్ళు గద్దెమీద ఉన్న పుతిన్ అంటే ప్రజలకు నిజంగానే విసుగెత్తలేదో, సుదీర్ఘకాలం అధికారంలో ఉండటం వల్ల ఒనగూరిన ప్రయోజనమో తెలియదు కానీ, 2030లో కూడా గెలిస్తే ఈయన ఏకంగా స్టాలిన్ రికార్డునే బద్దలుకొడతారట. పుతిన్‌కు వ్యతిరేకంగా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలబడినవారు నిజమైన ప్రత్యర్థులు కారన్న విషయం అందరికీ తెలుసు. ఉక్రెయిన్ యుద్ధాన్ని వ్యతిరేకించే ఒకరిద్దరిని సైతం చివరిదశలో అభ్యర్థుల జాబితాలోనుంచి తొలగించి పుతిన్ ప్రజాదరణకు ప్రమాదం లేకుండా అధికారులు చూసుకున్నారు. అసలు ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రశ్నించడమే తీవ్రమైన నేరం కిందకు మార్చేసిన తరువాత, ఎన్నికల్లో ప్రధానమైన అంశమంటూ ఏమీ మిగలకుండా పోయింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన అలెక్సీ నావెల్నీ కనుక బతికుంటే, ఎన్నికల వేళ స్వేచ్ఛగా తిరగగలిగివుంటే ఫలితాలు ఈ విధంగా ఉండేవా? ఆరేళ్ళనాటి ఎన్నికల్లో పుతిన్‌కు కంటినిండా నిద్రలేకుండా చేసినందుకు ఈ జనాకర్షక ప్రజానాయకుడు ఈ ఎన్నికలకు సరిగ్గా నెలరోజుల ముందు ఆర్కిటిక్ జైలులో అనుమానాస్పదంగా మరణించాడు. దేశాన్ని విడిచిపోయినవాడు, తిరిగి ప్రజలకోసమంటూ వచ్చినందుకు ప్రాణాలు కోల్పోయాడు. నావెల్నీ మాత్రమే కాదు, ఆయనకు ముందు పుతిన్‌కు సవాలువిసరగలడనుకున్న బోరిస్ నెమ్‌త్సోవ్ అనే నాయకుడు ఏకంగా నడిరోడ్డుమీదే హత్యకు గురైనాడు. అనేకమంది అసమ్మతినేతలు, రాజకీయ ప్రత్యర్థులు అనూహ్యంగా కన్నుమూస్తుండటంతో, పుతిన్‌తో వైరం ఉన్నవారు ఎత్తయిన భవనాల్లో నివసించకూడదని, ముఖ్యంగా బాల్కనీలో నిలబడి ప్రకృతిని ఆస్వాదించకూడదని ఓ హెచ్చరికలాంటి జోక్ ప్రచారంలో ఉంది. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడం, అసమ్మతి గొంతునొక్కడంలో పుతిన్ ఇంకా సంపూర్ణ విజయం సాధించలేకపోయి ఉండవచ్చును కానీ, అన్ని వ్యవస్థలమీదా ఆయన ఆధిపత్యం నూరుశాతం పూర్తయింది.

అంతమాత్రాన, పుతిన్ ఇప్పుడు సాధించిన ఘనవిజయమంతా అక్రమంగా ఆర్జించినదేనని అనడం అన్యాయమవుతుంది. బలమైన ప్రత్యర్థి అంటూ లేకపోయినందువల్ల ఆయన ఇంకా బలపడివుండవచ్చునేమో కానీ, ప్రజల్లో ఆయనకు విశేషమైన ఆదరణే ఉంది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నంతో కృంగి, కృశించిన రష్యాకు తిరిగి ప్రాభవాన్ని కట్టబెట్టిన నేతగా ఆయనను అభిమానిస్తున్నవారున్నారు. ఒకప్పుడు పాశ్చాత్యదేశాల ముందు తలదించుకున్న దేశాన్ని తిరిగి తలెగరేసే స్థాయికి తెచ్చాడని, అవమానభారం నుంచి బయటపడవేశాడని ఆయనను కీర్తిస్తున్నవారు ఉన్నారు. ఆయన నిర్ణయాలు, చర్యలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నదన్న పాశ్చాత్యదేశాల ప్రచారం పూర్తిగా తప్పని, రష్యా ప్రయోజనాల పరిరక్షణ వినా పుతిన్‌కు ఏ స్వార్థమూ లేదని నమ్మే ప్రజల సంఖ్య అధికంగానే ఉన్నదని కొందరు అంటారు. ఉక్రెయిన్ యుద్ధంతో రష్యన్లు తీవ్రంగా విసిగిపోయి ఉన్నారని, అది తెచ్చిన కష్టాలతో నానాబాధలు పడుతున్నారని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కానీ, పాశ్చాత్యదేశాల రాజ్య విస్తరణ కాంక్షను ప్రతిఘటించేందుకు, నాటో వీరంగానికి అడ్డుకట్టవేసేందుకు ఈ యుద్ధం సాగుతోందని రష్యన్లు నమ్ముతున్నారు. దీనికితోడు, పశ్చిమదేశాల ఆంక్షలు రష్యాను గట్టిగా దెబ్బతీయలేకపోయాయి. మిగతారోజుల్లో కంటే ఈ యుద్ధకాలంలో అనేక రెట్ల చమురు తోడుతూ, అమ్ముతూ రష్యా ఆర్థికంగా మరింత బలంగా ఉంది. యుద్ధం మూడోఏడాదిలోకి ప్రవేశించినప్పటికీ, రష్యాదే పైచేయిగా ఉంటోంది. ఈ ఎన్నికలను ఉక్రెయిన్ యుద్ధం మీద రెఫరెండమ్‌గా ప్రచారం చేసుకున్న పుతిన్, ఫలితాలు వెలువడిన అనంతరం ప్రజలకు ధన్యవాదాలు తెలియచేశారు. ఈ సందర్భంగా యుద్ధాన్ని కొనసాగించే విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు, పాశ్చాత్య దేశాలకు చేసిన హెచ్చరికలను గమనిస్తే, ఆయన సమధికోత్సాహంతో ఉన్నాడని అర్థమవుతుంది. ఇప్పటికైతే పుతిన్‌ను సవాలు చేయగల నేత కనుచూపుమేరలో ఎవరూ లేరు.

పాతికేళ్ళు ఆలస్యమైనా, సరైన తీర్పు!

జేఎంఎం ముడుపుల కేసుపై 1998 నాటి దురదృష్టకర తీర్పును తోసిపుచ్చుతూ మార్చి 5న సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా ఇచ్చిన తీర్పు స్వాగతించాల్సినది. నిజానికి ఎప్పుడో జరగాల్సిన దిద్దుబాటిది. 1998 తీర్పు అత్యంత లోపభూయిష్టమైనది. 105(2), 194(2) అధికరణాలకు కోర్టు ఆ రోజు వక్రభాష్యం చెప్పింది. చట్టసభ సభ్యులు పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభలో ఓటు వేసే లేదా ప్రసంగించే సందర్భాల్లో లంచం తీసుకుంటే నేర విచారణ నుంచి వారికి మినహాయింపు ఉంటుందని ప్రకటించింది. తద్వారా చట్టసభలో తమ ఓటును లేదా ప్రసంగాన్ని ప్రభావితం చేయటానికి సభ్యులు లంచం తీసుకున్నా ఎటువంటి చట్టపరమైన చర్యలూ తీసుకోకుండా 1998 తీర్పు సంపూర్ణ రక్షణ కల్పించింది. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఉండాల్సిన రక్షణకు ఇది దిగ్భ్రాంతికర వ్యాఖ్యానం. ఆ తీర్పు తప్పని చెప్పటం ద్వారా కోర్టు ఇప్పుడు సరైన రీతిలో వ్యవహరించింది.

రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు, నియమితులైన అధికారులు అందరూ ప్రజాసేవకులే. అధికారంలో ఉన్నారు కాబట్టి వారి చర్యలకు పూర్తిస్థాయి రక్షణ అంటే ఆమోదయోగ్యం కాదు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చేసిన పనులన్నిటికీ సంపూర్ణ రక్షణ ఉండాలని డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు. అమెరికా సుప్రీంకోర్టు వచ్చే కొన్ని వారాల్లో ఆ కేసును విచారిస్తుంది. ట్రంప్ కేసు తీర్పులో కొత్తగా చేసే నిర్ణయం ఏమీ లేదు: అధ్యక్షుడు దైవాంశసంభూత చక్రవర్తి కాడు, ఎల్లకాలం సంపూర్ణ రక్షణ లభించదు.

దీనర్థం, ప్రభుత్వాధికారులు, చట్టసభ సభ్యులకు ఎటువంటి రక్షణా వద్దనటం కాదు. విధి నిర్వహణలో భాగంగా చట్టబద్ధంగా తీసుకునే నిర్ణయాలు, చర్యలకు సంబంధించి వారిపై సివిల్, క్రిమినల్ కేసులు దాఖలు చేయాలనటం కాదు. సభలో స్వేచ్ఛగా అభిప్రాయాల్ని చెప్పటం, లేదా ప్రశ్న అడగటం, ఓటు వేయటం సందర్భాల్లో అటువంటి రక్షణ చట్టసభ సభ్యులకి వర్తిస్తుంది. కానీ ఒక నిర్దేశిత రీతిలో ఓటు వేయటానికి, లేదా సభలో మాట్లాడటానికి, ఓ ప్రశ్న లేవనెత్తటానికి లంచాన్ని అంగీకరిస్తే, ఆ రకంగా లంచం తీసుకోవటానికి చట్టపరమైన చర్యల నుండి రక్షణ లభించదు. లంచం తీసుకోవటం ప్రజాసేవకుడి అధికారిక బాధ్యతల్లో భాగం కాదు. లంచం తీసుకునే వ్యక్తి ఏ స్థాయి ప్రజాసేవకుడైనా, అది నేరం. రాజ్యాధినేత వంటి బాధ్యతల్లో ఉన్న కొందరు ప్రజాసేవకులకు వాళ్ళ పదవీ కాలంలో ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ ఉండవచ్చు, కానీ అధికారం నుంచి వైదొలిగాక ఆ రక్షణ కొనసాగదు.

చట్టబద్ధ చర్యలు లంచాలకు మాత్రమే కాకుండా, సభ్యుల ఇతర చట్టవిరుద్ధ చర్యలకు కూడా వర్తిస్తుంది. ఉదాహరణకు, జో బైడెన్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ధ్రువీకరించకుండా అమెరికా కాంగ్రెస్‌ను అడ్డుకునే ఉద్దేశంతో జనవరి 6, 2021న మూకలతో అరాచకత్వాన్ని రెచ్చగొట్టాడని, క్యాపిటల్‌పై దాడిని ప్రేరేపించాడని ట్రంప్‌పై ఆరోపణ. రాజ్యాంగబద్ధ వ్యవస్థను కూల్చటానికి నేరాన్ని ఎగదోసేందుకు బరితెగించాడు. అటువంటి చర్యలకు ప్రాసిక్యూషన్ నుంచి ఎటువంటి రక్షణా ఉండదు. అయితే, అధికారంలో ఉన్నప్పుడు తీసుకునే కొన్ని రకాల చర్యలకు భవిష్యత్తులో న్యాయ విచారణ నుంచి రక్షణ ఉండాలి. ఉదాహరణకు, తమ దేశానికి వ్యతిరేకంగా యుద్ధం చేసే తీవ్రవాదులను చంపేందుకు అమెరికా అధ్యక్షులు కొన్ని సందర్భాల్లో ఆదేశాలివ్వొచ్చు. అటువంటి కేసులకు సంబంధించి కీలక నాయకత్వ స్థానాల్లో ఉన్న కొద్దిమందికి మాత్రం సమాచారం తెలియచేస్తుంటారు. అందుకు ఎప్పటినుంచో ఓ పద్ధతి ఉంది. అదేవిధంగా, తీవ్రవాద ముప్పును తొలగించటానికి కొందరు వ్యక్తులు లక్ష్యంగా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక ఆపరేషన్లకు భారత్‌లో ప్రధానమంత్రి అనుమతి మంజూరు చేయాల్సి ఉండవచ్చు. అటువంటి అధికారం ప్రధాని ప్రమాణ స్వీకారంలో భాగమైన అధికారిక చర్యే అవుతుంది. కాబట్టి భవిష్యత్తులో క్రిమినల్ న్యాయ విచారణ చర్యల నుంచి పూర్తిస్థాయి రక్షణ ఉండాలి.




జేఎంఎం ముడుపుల కేసుపై 1998 నాటి దురదృష్టకర తీర్పును తప్పని చెప్పటం ద్వారా సుప్రీంకోర్టు ఇప్పుడు సరైన రీతిలో వ్యవహరించింది. ఒకే ఒక్క బాధాకర అంశం న్యాయ వ్యవస్థ అలసత్వం. ప్రజాజీవితంలో నిజాయితీ, జవాబుదారీతనానికి సంబంధించిన ఒక కీలక అంశంపై ఇంగితజ్ఞానానికి సైతం అర్థమయ్యే తప్పుడు తీర్పుని తిరగరాయటానికి 25 ఏళ్లు పట్టటం న్యాయ వ్యవస్థకి గౌరవం కాదు.

సుప్రీంకోర్టు నిర్ణయం ఏ రకంగానూ ప్రభుత్వాధికారుల, చట్టసభ సభ్యుల అధికారాన్ని బలహీనపరచదు; అవినీతి, అధికార దుర్వినియోగాలకు సంబంధించి జవాబుదారీతనాన్ని పెంచుతుంది. లంచం తీసుకోవటానికి సంబంధించి మాత్రమే ప్రాసిక్యూషన్ వర్తిస్తుంది, ఆ తర్వాత సభ్యుడు ఎవరికి ఓటు వేశారన్నది ఆ పరిధిలోకి రాదు.

ఈ మొత్తం సుదీర్ఘ పరిణామంలో ఒకే ఒక్క బాధాకర అంశం న్యాయ వ్యవస్థ అలసత్వం. ప్రజాజీవితంలో నిజాయతీ, జవాబుదారీతనానికి సంబంధించిన ఒక కీలక అంశంపై ఇంగితజ్ఞానానికి సైతం అర్థమయ్యే తప్పుడు తీర్పుని తిరగరాయటానికి 25 ఏళ్లు పట్టటం న్యాయ వ్యవస్థకి గౌరవం కాదు. శిబూ సోరెన్ (జేఎంఎం ముడుపుల కేసులో ప్రధాన నిందితుడు) కోడలు సీతా సోరెన్ న్యాయ విచారణ నుంచి తనకు రక్షణ కోరిన సందర్భం నుంచే ఆ కేసు రావటం యాదృచ్ఛికం. 2012 రాజ్యసభ ఎన్నికల్లో ఒక ఎమ్మెల్యేగా జార్ఖండ్ అసెంబ్లీలో ఒక స్వతంత్ర అభ్యర్థికి ఓటు వేయటానికి సీతా సోరెన్ లంచం తీసుకున్నారన్నది ఆరోపణ. చివరికి తన పార్టీ అభ్యర్థికే ఆమె ఓటు వేశారు; కానీ లంచం తీసుకున్నారనటానికి ఆధారాలుంటే, ఎవరికి ఓటు వేశారన్నది ప్రాసిక్యూషన్‌కి అసంగతం. సీతా సోరెన్‌కి వ్యతిరేకంగా క్రిమినల్ న్యాయ విచారణ చర్యలను రద్దు చేయటానికి జార్ఖండ్ హైకోర్టు తిరస్కరించటం సరైన చర్య. దీనిపై 2012లో ఆమె సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఏ రకమైన గందరగోళం లేని అటువంటి కీలక కేసుపై నిర్ణయం తీసుకోవటానికి సుప్రీంకోర్టుకి 11 ఏళ్లు పట్టింది! ఇద్దరు జడ్జీల బెంచ్ (2012) నుంచి ఆ కేసు నత్తనడకన ముగ్గురు జడ్జీల బెంచ్‌కి (2014) మారింది. చివరికి విస్తృత ధర్మాసనం ముందుకి (2019) వచ్చి, ఇప్పుడు 2024లో తేలింది. ఈ అసాధారణ జాప్యం చెబుతున్న పాఠం సుస్పష్టం: అత్యున్నత రాజ్యాంగ కోర్టు తనను తాను సమీక్షించుకోవాలి, మార్గాన్ని సరిదిద్దుకోవాలి. ఇటువంటి కేసులపై నిర్ణయం కొన్ని వారాల్లో చేయవచ్చు. రాజ్యాంగపరంగా తలెత్తే పర్యవసానాల దృష్ట్యా ఇలాంటి కేసులకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. అటువంటి ముఖ్యమైన అంశాలను త్వరితంగా, సమర్థంగా న్యాయం అందిస్తూ పరిష్కరించేలా ఒక శాశ్వత రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుకి బహుశా సమయం ఆసన్నమైంది.

○ డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
లోక్‌సత్తా వ్యవస్థాపకులు

‘దక్షిణ’ ద్వారం తెరుచుకుంటుందా?



ఒకనాడు ఎక్కడ ప్రజా ఉద్యమాలు బలంగా ఉన్నాయో అటువంటి చోట్లనే ఇప్పుడు మత ఉద్రిక్తతలు, తీవ్రజాతీయవాదంపై ఆకర్షణలు పెరిగిపోయాయి. చిన్న పట్టణాలలో, జిల్లా కేంద్రాలలో యువకులు, విద్యార్థులు మోదీ ఆకర్షణలో ఉన్నారని, ‘కొత్త’ రాజకీయాలంటే ఉద్రూతలూగుతున్నారని వింటున్నప్పుడు, తెలంగాణలో అనూహ్యమైనది జరగబోతున్నదా అనిపిస్తున్నది. నాలుగైదు స్థానాలు గెలుస్తుందని కొందరు, లేదు, తొమ్మిది స్థానాల దాకా గెలిచి కాంగ్రెస్‌ను రెండోస్థానంలోకి నెట్టివేస్తుందని మరి కొందరు లెక్కలు వేస్తున్నారు. ఏది నిజమైనా, అది బీజేపీని తెలంగాణలో రెండో స్థానానికి తెస్తుంది. బీఆర్ఎస్‌లో కొందరిని, కాంగ్రెస్‌లో కూడా కొందరిని తమ వైపు తిప్పుకుని చక్రం తిప్పగల అవకాశం బీజేపీకి వస్తుంది. ‘మితవాద’ జాతీయ జీవనస్రవంతిలో కలిసే అవకాశం తెలంగాణకు లభిస్తుంది.

శివుడూ పార్వతీ పెళ్లిచేసుకుంటుంటే, అంబానీ చిన్నకొడుకు పెళ్లికి వచ్చినట్టుగా, పొలోమంటూ దేవలోకంలోని వీఐపీలు అందరూ హిమాలయాలకు వెళ్లారట. ఉత్తరం దిక్కున బరువు ఎక్కువై భూమి ఒకవైపు ఒరిగిపోవడం మొదలుపెట్టింది. దక్షిణంవైపు బరువు పడితే కానీ, తూకం సరిపోదని అనుకుని అగస్త్యముని దక్షిణాదికి వచ్చి, బేలన్స్ చేశాడట. ఇదికాక మరొక కథ కూడా ఉంది. వింధ్య పర్వతం అడ్డూఆపూ లేకుండా నిలువుగా పెరిగిపోవడం మొదలు పెట్టిందట. ఆకాశంలోకి చొచ్చుకువెళ్లి సూర్యుడికీ చంద్రుడికీ కూడా అడ్డుపడి, గ్రహగతులు ఆగిపోయేట్టు చేసిందట. ఉత్తరానికీ దక్షిణానికీ రాకపోకలు కూడా అసాధ్యమయ్యాయట. లోకమంతా వచ్చి మొరపెట్టుకుంటే, అగస్త్యుడు వింధ్య దగ్గరికి వచ్చి, నేను దక్షిణం వైపు పోవాలి దారివ్వమని అడిగాడు. అగస్త్యుడంటేనే పర్వతాలనే కదిలించగలవాడు అని అర్థం కదా, అందుకని గౌరవంగా, వింధ్యుడు తలవంచి, తన ఎత్తు తగ్గించుకున్నాడు. నేను మళ్లీ దక్షిణం నుంచి ఉత్తరం వైపుకు తిరిగివెడతాను, అప్పటిదాకా ఇట్లాగే ఉండు అని అగస్త్యుడు చెప్పాడు. అగస్త్యుడు తిరిగి ఉత్తర దిక్కు వెళ్లలేదు. వంగిపోయిన వింధ్య అట్లాగే, దక్షిణానికి దారి ఇస్తూ మిగిలిపోయింది. దక్షిణం వాళ్లు, ముఖ్యంగా తమిళుల కథలో కొన్ని చేర్పులుంటాయి. తమిళుల మొదటి వ్యాకరణం పేరు అగత్తియం. రాసింది అగస్త్యుడు. అతను ఉత్తరాది నుంచి వస్తే వచ్చాడు కానీ, దక్షిణంలో స్థిరపడి, ద్రావిడం నేర్చుకుని భాషకు సేవ చేశాడు. ఆర్యద్రావిడ సమాజాలకు మధ్య అవరోధాలను తొలగించి, ఉత్తరం వారు దక్షిణానికి వలసరావడానికి, దక్షిణాన్ని లోబరచుకోవడానికి అగస్త్యుడిని ఒక సంకేతంగా చెప్పేవాళ్లు ఉన్నారు. బలిచక్రవర్తి కథ కూడా అటువంటిదే అంటారు!

ప్రధానమైన ద్రావిడ భాషలు మాట్లాడే ప్రాంతాలు భారతదేశంలో దక్షిణంలో ఉన్న మాట నిజమే కానీ, అంత మాత్రమే చెబితే సరిపోదు. మూడువైపులా సముద్రం ఆవరించిన ద్వీపకల్ప భాగంలో ఉన్నాయని కూడా చెప్పుకోవాలి. మధ్య ఆసియా నుంచి ఉత్తరభారతంలోకి ప్రవేశించిన ఆర్యులు ఐదునదుల మైదానాల నుంచి క్రమంగా గంగా యమునా బేసిన్‌లోకి విస్తరించి తమదైన నాగరికతను నిర్మించుకున్నారు. తమ ప్రస్థానాన్ని దక్షిణాదికి కొనసాగించడం వారికి అంత సులభం కాలేదు. వంగ దేశం నుంచి సముద్రతీరం గుండా ఓఢ్రదేశం మీదుగా దక్షిణానికి రావడం కూడా ఏమంత సులువు కాలేదు. మరణానంతర వైతరిణి ఒరిస్సాలోనే ఉందట. వింధ్యపర్వతశ్రేణి, దండకారణ్యం నైసర్గిక కుడ్యాలుగా నిలిచాయి. అశోకుడు ఆంధ్ర, కర్ణాటకలలో కూడా శిలాశాసనాలు వేశాడు కానీ, ఈ ప్రాంతాలు మగధలో భాగమయ్యాయో లేదో చెప్పలేము. మౌర్యులు, శాలివాహనులు, కాకతీయులు, మొగలులు, కుతుబ్ షాహీలు దిగువకు దూసుకుపోయారు కానీ, దక్షిణాన ఎంతో కొంత కొస అజేయంగానే మిగిలిపోయింది. భారతీయ జనతాపార్టీ పదేళ్ల రాజసూయంలో కూడా దక్షిణాగ్ర భాగం ఇంకా స్వాధీనం కాలేదు.

దక్షిణ రాష్ట్రాలలో కలిగే ప్రయోజనానికి మించి నరేంద్ర మోదీ ఎక్కువ కష్టపడుతున్నారు. ‘సౌత్ పుష్’ అంటున్నది జాతీయ ఇంగ్లీషు మీడియా. కొరకరాని కొయ్యగా ఉన్న దక్షిణాదిని ఈసారి లొంగదీసుకోవాలని ఆయన పట్టుదలగా ఉన్నారని చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా దేశమంతటికీ తన రాజకీయ ప్రాబల్యాన్ని విస్తరించినా, ఆ పార్టీలో కూడా ఉత్తరాది నాయకత్వానిదే పైచేయి అయినా, స్థానికంగా అటానమీని అనుమతించింది. అనేక రంగాలలో ఉత్తరాది ఆధిపత్యానికి తానొక రాయబారిగా కాంగ్రెస్ వ్యవహరించలేదు. దక్షిణభారతంలో వ్యక్తమైన స్థానిక ఆకాంక్షలను నెరవేర్చింది, భయాలను గౌరవించింది. ప్రాంతీయ పార్టీ చేతిలో ఓడిపోవడం తమిళనాడుతోనే కాంగ్రెస్ మొదటి సారిగా రుచిచూసింది. బీజేపీ పరిస్థితి వేరు. అతి బలహీనంగా ఉన్న కాలం నుంచి (జనసంఘంగా ఉన్నప్పుడు కూడా) దాన్ని ఉత్తరాది పార్టీగానే దక్షిణాది జనం భావించారు. ఎమర్జెన్సీ తరువాత కానీ, 1980 దశకం చివరలో కానీ ఉత్తరాది మధ్యే వాద పార్టీ ప్రభంజనాలు దక్షిణాదిని పెద్దగా కదిలించలేదు. తమ జాతీయ వాదానికి దేశవ్యాప్త ఆమోదం కోసం, ‘ప్రగతిశీల’ భారతంలో విజయం కోసం భారతీయ జనతాపార్టీకి బెంగాల్ లోను, దక్షిణ రాష్ట్రాలలోను గెలుపు కావాలి. అతి సూక్ష్మ స్థాయి నుంచి పనిచేసుకుంటూ పథకం ప్రకారం బలాన్ని పెంచుకోగలిగిన ‘శక్తి’ బీజేపీకి ఉంది. కార్యశీలురైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఫలితాలు ఎట్లా ఉన్నా, వారి ప్రయత్నాన్ని మెచ్చుకోవచ్చు.



▪ కె. శ్రీనివాస్

సందర్భం

అశోకుడు కాకపోయినా, హర్షుడు కొంత, ఔరంగజేబు మరికొంత దక్షిణంలోకి చొచ్చుకువచ్చి ఆ తరువాత ఆగిపోయారు. గోవా ఎట్లాగూ భౌగోళికంగా తప్ప సాంస్కృతికంగా దక్షిణం కాదు. తక్కిన ఐదు రాష్ట్రాలూ ఉత్తరాది ప్రభావం నుంచి సమానంగా రక్షించుకున్నాయని చెప్పలేము. కర్ణాటక విజయం బీజేపీకి కొత్తేమీ కాదు. పొత్తులతోనో, ఫిరాయింపులతోనో బీజేపీ కర్ణాటకలో ఒకటి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 2014లోనే ఒక మైనర్ భాగస్వామిగా అయినా ప్రభుత్వంలో ఉన్నది. తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో ప్రభావశీలమైన ఉనికితో ఎప్పటి నుంచో ఉంటూ, గత పార్లమెంటు ఎన్నికలలో నాలుగు స్థానాలతో, సుమారు 20 శాతం ఓట్లతో పెద్ద విజయవిస్తరణ చేసుకోగలిగింది. కేరళలో 2016లో ఒక ఎమ్మెల్యేను గెలిపించుకున్న బీజేపీ, 2021లో 11 శాతానికి పైగా ఓట్లను సంపాదించింది. మరి కొత్తగా, దక్షిణ ద్వారాన్ని బద్దలు కొట్టడమనే ఘన కార్యంలో మోదీ ప్రస్తుతం ఉన్నారని అనడం సమంజసమేనా? అక్కడక్కడా బలంగానో, బలహీనంగానో ఉనికిలో ఉన్నప్పటికీ, సారాంశంలో దక్షిణాది ఇంకా పట్టుబడలేదన్న లోటు మాత్రం బీజేపీకి ఉన్నది. వింధ్యపర్వతం ఎక్కడున్నదో గుర్తించి, దాన్ని వంచగలిగితే, దక్షిణంలోకి మహాద్వారం తెరుచుకుంటుందని ఆశిస్తున్నది.

అంచుల్లో పలచబడుతున్నప్పటికీ, లోలోపలి అడవి దట్టంగానే మిగిలినట్టు, దక్షిణాదిలో కూడా కొంత అతి దక్షిణం ఉన్నది. భావపరంగానూ, భౌగోళికంగానూ కూడా ఉత్తరత్వానికి కొరుకుడుపడని కంచుకోటలు దక్షిణంలో మిగిలే ఉన్నాయి. వాటిని కొట్టగలిగితే, గంగా కావేరీ అనుసంధానం జరిగినట్టే. బీజేపీకి, మోదీకి అదే అంతిమలక్ష్యం కావచ్చును కానీ, ప్రస్తుతం దానిమీదే గురిపెట్టారనడం సరి కాదు. ఎందుకంటే, మోదీ ‘సౌత్ పుష్’ దాడి వ్యూహం కాదు. ఆత్మరక్షణా వ్యూహం మాత్రమే. ఉత్తరాదిలో ఈ సారి తరిగిపోయే అవకాశమున్న సంఖ్యను దక్షిణాదిలో భర్తీ చేసుకోవడం కోసం మాత్రమే ఈ ప్రత్యేక ప్రయత్నం. తమిళనాడు, కేరళల్లో ప్రస్తుతానికి కొత్త ఆశ ఏమీ లేదు. ఆ రెండు రాష్ట్రాలలో గతం కంటె నాలుగు ఓట్లు పెంచుకోవడమే లక్ష్యం. అతి దక్షిణం అని భౌగోళికంగా చెప్పగలిగే రాష్ట్రాలు ఆ రెండూ. కర్ణాటకలో ఒకవేళ కాంగ్రెస్ మీద విముఖత కలిగినా, గతంలో ఉన్న బలాన్ని దాదాపుగా నిలుపుకోవడమే తప్ప అదనపు ప్రయోజనం లేదు. సాంస్కృతికంగా, సామాజికంగా ఆ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు ఈ పాటికే ఉత్తరాది ప్రభావంలో పడిపోయాయి. కొత్తగా భావజాల పరంగా గెలుచుకునే ప్రాంతాలు, వర్గాలు ప్రస్తుతం అయితే లేవు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించినప్పటికీ, అందులో బీజేపీ పాలు అతి తక్కువ. కాకపోతే, దీర్ఘకాలికంగా బీజేపీ విస్తరణ ప్రయత్నాలకు ఆ విజయం తోడ్పడవచ్చు. తెలంగాణలో బీజేపీ ప్రభావం పెరుగుతున్నదన్న వార్తలు నిజమైతే మాత్రం, అది ఆ పార్టీకి కీలకమయిన విజయం అవుతుంది. దక్షిణ దిశగా తోసిన ‘తోపు’ ఫలితం ఇచ్చినట్టు.

ఎందువల్ల? అంటే, తెలంగాణలో అధిక ప్రభావం చూపగలిగితే కనుక, బీజేపీ వెంటనే రెండో స్థానానికి, అతి త్వరలో అధికారస్థానానికి చేరుకోగలుగుతుంది. తెలంగాణలో బలం పెంచుకోవడం అంటే, పొత్తుల సాయంతో ఆంధ్రాలో నాలుగు సీట్లు సంపాదించుకున్నట్టు కాదు. తన సొంత ‘సిద్ధాంత’ బలంతో సంపాదించుకున్నట్టు. తన వేళ్లను తెలంగాణ నేలలో బలంగా నాటుకున్నట్టు. తెలంగాణ సమాజం ఆ మేరకు బీజేపీయాకరణం చెందినట్టు కూడా. దాని పర్యవసానాలు, ప్రభావాలు ఎట్లా ఉంటాయో సామాజిక, రాజకీయ పరిశీలకులు పోల్చుకోవచ్చు. తమిళనాడు, కేరళ అతి దక్షిణం అయినట్టు, తెలంగాణ ఎప్పటి నుంచో పలచబడిన దక్షిణం. చారిత్రకంగా ఉత్తర, దక్షిణాల మధ్య ఉండడం వల్ల కావచ్చు, ఉత్తరాది వలసలు అధికంగా ఉండడం వల్ల కావచ్చు, ముస్లిమ్ పాలకుల కింద దీర్ఘకాలం ఉన్న చరిత్ర వల్ల కావచ్చు, తెలంగాణ బీజేపీకి పంట పండించుకోవడానికి అనువైన క్షేత్రంగా ఉండింది. అయితే, అక్కడ భూస్వామ్యానికి, రాచరికానికి వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు, విప్లవ చరిత్ర కూడా ఉన్నది కాబట్టి, మితవాద రాజకీయాలకు అనువైన పరిస్థితులు ఇంతకాలం లేకుండా పోయాయి. తెలంగాణ వేదిక మీద ప్రజా ఉద్యమ రాజకీయాలు బలహీనపడి, సామాజిక దృష్టికోణాలు పలచబడడం మొదలయింది. దురదృష్టవశాత్తు, అందుకు ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతర దశాబ్ద కాలం కూడా తోడ్పడింది. ఒకనాడు ఎక్కడ ప్రజా ఉద్యమాలు బలంగా ఉన్నాయో అటువంటి చోట్లనే ఇప్పుడు మత ఉద్రిక్తతలు, తీవ్రజాతీయవాదంపై ఆకర్షణలు పెరిగిపోయాయి. చిన్న పట్టణాలలో, జిల్లా కేంద్రాలలో యువకులు, విద్యార్థులు మోదీ ఆకర్షణలో ఉన్నారని, ‘కొత్త’ రాజకీయాలంటే ఉద్రూతలూగుతున్నారని వింటున్నప్పుడు, తెలంగాణలో అనూహ్యమైనది జరగబోతున్నదా అనిపిస్తున్నది. నాలుగైదు స్థానాలు గెలుస్తుందని కొందరు, లేదు, తొమ్మిది స్థానాల దాకా గెలిచి కాంగ్రెస్‌ను రెండోస్థానంలోకి నెట్టివేస్తుందని మరికొందరు లెక్కలు వేస్తున్నారు. ఏది నిజమైనా, అది బీజేపీని తెలంగాణలో రెండో స్థానానికి తెస్తుంది. బీఆర్ఎస్‌లో కొందరిని, కాంగ్రెస్‌లో కూడా కొందరిని తమ వైపు తిప్పుకుని చక్రం తిప్పగల అవకాశం బీజేపీకి వస్తుంది. ‘మితవాద’ జాతీయ జీవన స్రవంతిలో కలిసే అవకాశం తెలంగాణకు లభిస్తుంది.

భావపరంగానూ, భౌగోళికంగానూ కూడా ఉత్తరత్వానికి కొరుకుడుపడని కంచుకోటలు దక్షిణంలో మిగిలే ఉన్నాయి. మోదీ ‘సౌత్ పుష్’ దాడి వ్యూహం కాదు. ఆత్మరక్షణా వ్యూహం మాత్రమే. ఉత్తరాదిలో ఈ సారి తరిగిపోయే అవకాశమున్న సంఖ్యను దక్షణాదిలో భర్తీ చేసుకోవడం కోసం మాత్రమే ఈ ప్రత్యేక ప్రయత్నం.

కవితా సుమగంధం






తెల్లని మల్లె వికసించముందే
సువాసన మనసంతా అలుముకొంది

ఎప్పటికీ నాశనం కాని విత్తనం
కాగితమ్మీద తడిగా ఒలికి హృదయంగానో,
పిడికిలిగానో లోలోపల
భావసముద్రమై ఉరకలెత్తుతుంది

పొడిరాగాల గొంతు అయస్కాంతమై
మనసును ఊపేస్తుంది

ఎప్పటికీ ఆకాశం వీడని వానచినుకై
గుండెలోతుల్లో చిక్కుకుపోతోంది.

వేదనలో నినాదాలు లహరీ సహస్రాలై
నేలంతా ప్రవాహ ఝరులవుతాయి

నిద్రనెరుగని కన్నె బాధల సమూహంలో
కన్నీటి సిరా పయనిస్తుంది

దుఃఖార్తులను, అన్నార్తులను
ఆప్యాయంగా కౌగిలించుకొంటుంది
కాళిదాసు నుంచి నా వరకు...

– ర్యాలి ప్రసాద్
(నేడు అంతర్జాతీయ కవితా దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లేఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపానికి...!

2019లో వైసీపీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన నాటికీ, నేటికీ అన్ని నిత్యావసర వస్తువుల, సేవల ధరలు కనీసం 50 శాతం నుంచి 200 శాతం దాకా పెరిగాయి. ‘ఒక్క ఛాన్స్’ అంటూ ప్రజల్ని ఆనాడు ప్రాధేయపడింది ఈ బందిపోటు దోపిడీ కోసమేనని ఇప్పుడు ప్రజలకు అర్థమైంది. ఒక్క ఛాన్స్ ఇచ్చినందువల్ల మనలో ప్రతి కుటుంబమూ సగటున లక్ష రూపాయల చొప్పున ఈ బందిపోట్లకు కోల్పోయింది.



ఒక్క ఛాన్స్ ఇమ్మని ప్రాధేయపడితే రాజకీయ అనుభవం లేకపోయినా, భయంకరమైన అవినీతి ఆరోపణలు ఉన్నా, పాపం పోనీలే అని ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. పాదయాత్ర పేరుతో మన గ్రామాలూ పట్టణాలూ తిరిగి, అక్కడక్కడా మన వాకిళ్ళలోకి అడుగుపెట్టి, మన పిల్లల బుగ్గలు నిమిరి, తియ్యని మాటలు మాట్లాడి, దగ్గరగా ఉన్నవారి నెత్తి మీద చేతులు పెట్టి ఆనాడు ఒక్క ఛాన్స్ ఇమ్మని బతిమిలాడిన పెద్దమనిషి ఆ ఛాన్స్ తీసుకొన్న తర్వాత రాష్ట్రం నెత్తిన చేతులు పెట్టాడు. అంతకు ముందరి అవినీతి, తండ్రి పేరు వాడుకొని వందల వేల కోట్ల రూపాయల క్విడ్ ప్రో కో అక్రమాలు, ఫాక్షన్ రాజకీయాలు అన్నీ మరిచిపోయి మనం ఒక్క ఛాన్స్ ఇచ్చాం. తర్వాత ఐదేళ్ళు గడిచాయి. రాష్ట్రానికి ఏం జరిగింది, ప్రజలకు ఏం ఒరిగింది? ఆ ఒక్క ఛాన్సును ఆ పెద్దమనిషి ఎలా దుర్వినియోగం చేశాడు? అదంతా మహా విషాద చరిత్ర. మచ్చుకు కొన్ని సంగతులు మాత్రం చూద్దాం.

ఉన్న పన్నులను ఇబ్బడి ముబ్బడిగా లెక్కా పత్రం లేకుండా పెంచారు. విపరీతంగా కొత్త పన్నులు వేశారు. నిత్య జీవితావసరాల, సేవల ఛార్జీలను పెంచారు. కక్ష సాధింపుతో పాత ప్రభుత్వ ప్రజానుకూల విధానాలను రద్దు చేశారు. ముడుపుల కోసం రాష్ట్ర వనరులను ఇతరులకు దోచిపెట్టారు. సొంత, కుటుంబ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారు. ఇలా జగన్మోహన్ రెడ్డి పాలనలో సాగిన అక్రమాలకు లెక్క లేదు. ఒక లెక్క ప్రకారం ఒక్క ఛాన్స్ పేరుతో గద్దెనెక్కినవారు ఐదు సంవత్సరాలలో మన జేబుల నుంచి కొల్లగొట్టిన మొత్తం ఒక లక్ష కోట్ల రూపాయల పైనే. ఒక్క ఛాన్సంటే ఆయన జేబులోకి ఒక లక్ష కోట్ల రూపాయలు చేరడమన్న మాట! ఆహార పదార్థాల నుంచి వినోద అవసరాల దాకా, గృహవసతి నుంచి ప్రజా పంపిణీ పథకం కింద చౌకధరల దుకాణాల్లో సరఫరా చేసే సరుకుల ధరల దాకా, భూమి నుంచి ప్రభుత్వ సేవల దాకా ‘ఎందెందు చూసిన’ అన్నట్టు ఒక్క ఛాన్స్ ప్రభుత్వం చాలా మార్పులు చేసింది.

అన్ని సరుకుల ధరలు పెరగడానికి మూలకారణమైన పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతూ పోవడానికి కేంద్ర ప్రభుత్వమే కారణం అని ఈ రాష్ట్ర ప్రభుత్వం అబద్ధ ప్రచారం చేస్తూ వచ్చింది. కానీ కేంద్ర పన్నులకు అదనంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం అదనపు వాట్ వేసింది. రోడ్ డెవలప్‌మెంట్ సెస్ వేసింది. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండిటినీ వేయకుండా ఉంటే పెట్రోల్, డీజిల్ ధరలు తక్కువగానే ఉండేవి. ఇతర సరుకుల రవాణా వ్యయం తగ్గి, వాటి ధరలు కూడా తగ్గుస్థాయిలో ఉండేవి. కొన్ని ఇతర రాష్ట్రాలు తమ వంతు పన్నులను తగ్గించి ప్రజల మీద భారం తగ్గించగా జగన్ ప్రభుత్వం మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రజల మీద పగ బూనినట్టు అదనపు పన్నులు వేసింది.

రాష్ట్రంలోని కోట్లాది ప్రజలకు నిత్యమూ అందుబాటులో ఉండే, వారి అవసరాలు తీర్చే చౌకధరల దుకాణాల మీద కూడా జగన్ ప్రభుత్వ డేగకన్ను పడింది. ఒకవైపు చౌకధరల రేషన్‌లో ఇచ్చే కందిపప్పు పరిమాణం సగానికి తగ్గించి, మరొకవైపు ధరలను విపరీతంగా పెంచింది. బియ్యం, చక్కెర, నూనె వంటి ఇతర నిత్యావసర వస్తువుల పరిమాణం తగ్గించడం, ధర పెంచడం, చీకటి బజారుకు అవకాశం కలిగించడం... ఇవన్నీ విపరీతంగా సాగిపోయాయి.

అలాగే రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిరథ చక్రాలుగా చెప్పుకునే, సామాన్య ప్రజలందరికీ ప్రయాణ సౌకర్యాలు కల్పించే ఆర్టీసీ ఛార్జీలను పెంచడానికి ఈ ‘ఒక్క ఛాన్స్’ ప్రభుత్వం మూడు సంవత్సరాలలో మూడు ఛాన్సులు తీసుకుంది. సాధారణ ప్రజానీకానికీ, మధ్యతరగతి వారికీ కూడా బస్సు ప్రయాణం ఖరీదైన వ్యవహారం అయిపోయింది.

ఇక ఆంధ్రప్రదేశ్ ప్రజలు కరెంటు తీగలు ముట్టుకుంటే కాదు, ఇంటి అవసరాలకు వాడుకుంటేనే షాక్ కొట్టేలా చేసిన మహా ఘనత ఈ ప్రభుత్వానిదే. విద్యుత్ ఛార్జీలను ఎప్పటికప్పుడు పెంచడంతో పాటు, ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలు, అభివృద్ధి ఛార్జీలు, కనీస వినియోగ ఛార్జీలు వంటి ఎన్నెన్నో పేర్లతో జగన్ ప్రభుత్వం ప్రజల గోళ్లూడగొట్టి, షాక్ కొట్టించి డబ్బులు కైంకర్యం చేసింది.

ఇటీవల రాష్ట్రంలో విపరీతంగా పెరిగిన భూమి క్రయ విక్రయ లావాదేవీల నుంచి, అంటే భూమి అమ్మకందారుల నుంచి, కొనుగోలుదారుల నుంచి కూడా ఒకటికి రెండింతలు డబ్బు లాగడానికి ‘ఒక్క ఛాన్స్’ ప్రభుత్వం ఎన్నో ఎత్తులు వేసింది. అధికారంలోకి రాగానే 2020లో భూముల మార్కెట్ విలువల్ని సవరించింది. కొత్త జిల్లాల ఏర్పాటు పేరుతో కొత్త రియల్ ఎస్టేట్ మార్కెట్లను పెంచి, అక్కడ కూడా మార్కెట్ విలువలను సవరించింది, అంటే పెంచింది. ఈ పెరుగుదల కనీసం 15శాతం నుంచి గరిష్ఠం 75శాతం వరకూ జరిగింది. కొన్ని లావాదేవీలలో అంతకుముందు ఒక శాతంగా ఉన్న స్టాంప్ డ్యూటీని ఒక్క ఛాన్స్ ప్రభుత్వం 4శాతానికి పెంచింది. ఈ చర్యలన్నీ అంతిమంగా ప్లాట్లు కొనుక్కునే మధ్యతరగతి వారి మీద భారాన్ని మోయలేనంతగా పెంచాయి.

అలాగే సేల్ కమ్ జీపీ రిజిస్ట్రేషన్ మీద స్టాంప్ డ్యూటీని కూడా విపరీతంగా పెంచారు. ఆస్తి పన్ను విధానంలో మార్పు తెచ్చి ఆ పన్నునూ విపరీతంగా పెంచారు. నిర్మాణమైన గృహాల మీద రిజిస్ట్రేషన్ కోసం వన్ టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో దోపిడీ ప్రారంభించారు. ఈసేవ కేంద్రాల ద్వారా, రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రజలకు అందే వివిధ సేవల మీద యూజర్ ఛార్జీలు, సర్వీసు ఛార్జీలు పేరుతో పెద్ద మొత్తాలు వసూలు చేయడం ప్రారంభించారు. రాష్ట్రంలో వాహనాల కొనుగోళ్ళు పెరుగుతున్న సందర్భంలో లైఫ్ టాక్స్ పెంచారు. మద్యం ధరలు పెంచారు. చివరికి చెత్త పైనా పన్నులు విధించడం ప్రారంభించారు. ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసి, ధర నిర్ణయించి, ఆ తర్వాత ఇసుక అమ్మే బాధ్యతను ఒక ప్రైవేటు కంపెనీకి అప్పగించి, ధర ఇంకా పెంచేశారు.

అంటే విద్యుత్తు, పెట్రోలు, డీజిల్, గ్యాస్, ఇంటిపన్ను, చెత్త పన్ను, ఇసుక ధర, సిమెంట్ ధర, మద్యం ధర, ఫైబర్ నెట్, బియ్యం, నూనె, కందిపప్పు, మినప పప్పు, శనగ పప్పు, పెసర పప్పు, చిరుధాన్యాలు, చింతపండు, పంచదార, కూరగాయలు, బెల్లం – ఇలా మార్కెట్లో ప్రతి ఒక్క సరుకు మీద, సేవ మీద పన్నులపై పన్నులు విధిస్తూ ప్రజా జీవితాన్ని అతలాకుతలం చేసిన ప్రభుత్వం ఇది. ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకు ప్రజలకు ఇచ్చిన ప్రతిఫలం ఇది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన నాటికీ, నేటికీ అన్ని నిత్యావసర వస్తువుల, సేవల ధరలు కనీసం 50 శాతం నుంచి 200 శాతం దాకా పెరిగాయి. ‘ఒక్క ఛాన్స్’ అంటూ ప్రజల్ని ఆనాడు ప్రాధేయపడింది ఈ బందిపోటు దోపిడీ కోసమేనని ఇప్పుడు ప్రజలకు అర్థమైంది!

ఒక్క ఛాన్స్ ఇస్తే ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, మెగా డీఎస్సీ వేస్తానని చెప్పి ఎన్నికలకు ముందు ‘దగా డీఎస్సీ’ని విడుదల చేసి యువతను నిట్టనిలువునా మోసగించారు. ఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపానికి పోలవరం ప్రాజెక్టును పాతర వేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేశారు. ఒక్కఛాన్స్ ఇచ్చిన పాపానికి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన నిధులను దారి మళ్ళించడంతో పాటు అనేక పథకాలను రద్దు చేశారు. కాపులను దగా చేశారు. పేదల ఆకలి తీర్చే ‘అన్న క్యాంటిన్’లను మూసివేశారు.

ఒక అంచనా ప్రకారం నవరత్నాల పేరు మీద ఒక సగటు కుటుంబానికి అందిన సంక్షేమ పథకాల సగటు లబ్ధి ఎంత ఉదారంగా లెక్క వేసినా ఒక లక్షా 74 వేల రూపాయలకు మించలేదు. కాగా, మనలో ప్రతి ఒక్క కుటుంబం నుంచీ, ధరల పెరుగుదలతో, పన్నులతో, యూజర్ ఛార్జీలతో, సర్వీస్ ఛార్జీలతో దండుకున్న రొక్కం తక్కువలో తక్కువ లెక్కవేసినా రెండు లక్షల 67 వేల రూపాయల కన్నా ఎక్కువే. అంటే ఒక్క ఛాన్స్ ఇచ్చినందువల్ల ఈ ఐదేళ్ళల్లో మనలో ప్రతి కుటుంబమూ సగటున లక్ష రూపాయల చొప్పున ఈ బందిపోట్లకు కోల్పోయింది. అంటే రాష్ట్రంలోని కోటిన్నర కుటుంబాల నుంచి కోటిన్నర లక్షల రూపాయల సంపద ఈ బందిపోట్ల పరమైంది. ఈ నయవంచనకు జవాబు చెప్పవలసిన అవసరం, చెప్పే బాధ్యత మనదే. మళ్ళీ ఎన్నికలలో మరొక ఛాన్స్ అడగడానికి వస్తున్న మోసకారిని నిలదీయాలి. ఒక్క ఛాన్స్‌కే ఇంత ఘోరంగా మోసపోయిన మనం మరొక ఛాన్స్ ఇవ్వగూడదు.

• కొణతాల రామకృష్ణ
అనకాపల్లి మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి





గప్‌చుప్.. వాట్సాప్

సచివాలయాల వాట్సాప్ గ్రూపుల్లో వైసీపీ ప్రచారం



- ప్రతి గ్రూపులోనూ 'సజ్జల ఆఫీసు వాట్సాప్' పేరుతో అడ్మిన్
- వీరంతా వైసీపీ సోషల్ మీడియాకు చెందినవారే..
- ప్రభుత్వ పథకాల ప్రచారం, ఊకదంపుడు ప్రసంగాలు
- ప్రతిపక్షాలపై నిందారోపణలు, మార్ఫింగ్ న్యూస్
- ప్రతి గ్రామం, డివిజన్‌లో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన

ప్రభుత్వ అనుకూల పోస్టులు పెడుతున్న వలంటీర్లు



టీడీపీ అధినేత చంద్రబాబును విమర్శిస్తూ పోస్టు

విపక్షాలపై దుష్ప్రచారం

ఈ వాట్సాప్ గ్రూపుల ద్వారా పెద్ద ఎత్తున ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు సబంధించిన వీడియోలు, ఫొటోలు, పోస్టర్లు, ఆడియో మెసేజ్‌లు ఇలా ప్రతిదాన్నీ పోస్టు చేస్తున్నారు. ప్రభుత్వ నవరత్నాల పథకాలను ఊదరగొడుతున్నారు. ముఖ్యమంత్రి ఫొటోలను తరచూ పోస్ట్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి డైలాగులను, లైవ్ వీడియో లింక్‌లను పోస్టు చేస్తున్నారు. వైసీపీ అనుకూల నకిలీ సర్వేలను పెడుతున్నారు. అలాగే టీడీపీని కించపరిచే పోస్టింగులు కూడా చేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును కించపరిచేలా, లోకేశ్ వ్యాఖ్యలు మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా చూపిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇలాంటివి ప్రచారం చేయరాదు. అయినా.. వలంటీర్లతో పాటు వైసీపీ సోషల్ మీడియా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇలా దుష్ప్రచారం చేస్తోంది.

వైసీపీ అనుకూల ప్రచారం

ఆయా గ్రామాలు, డివిజన్లలోని కుటుంబాల లెక్క ప్రకారం 10 నుంచి 25 మంది వరకూ వలంటీర్లు ఉంటారు. ఈ వలంటీర్లంతా మొదట్లో తమ పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ పథకాల సమాచారాన్ని చేరవేయటం, దరఖాస్తులను స్వీకరించటం, ఇతర సమాచారాన్ని అందించడం కోసం వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఏడాదికి వైసీపీ సోషల్ మీడియా విభాగం వలంటీర్ల వాట్సాప్ గ్రూపులపై దృష్టిపెట్టింది. గ్రామస్థాయిలో ఊరు పేరుతో సచివాలయం అనే వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయించింది. స్మార్ట్‌ఫోన్లు కలిగి ఉన్న వారందరినీ ఇందులో యాడ్ చేశారు. వలంటీర్లు, వైసీపీ సోషల్ మీడియాకు చెందినవారు ఇందులో అడ్మిన్లు. ప్రతి గ్రామ సచివాలయ గ్రూపులో కూడా సజ్జల ఆఫీసు వాట్సాప్ పేరుతో ఒక అడ్మిన్ ఉంటాడు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్ని మండలాలు ఉంటే అన్ని మండలాలకు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ గ్రూపును ఏర్పాటు చేశాక గ్రూపులోని సభ్యులందరికీ కమ్యూనిటీ మెసేజ్‌లు కూడా రావడం మొదలయ్యాయి. ఏ గ్రామంలో ఉన్నవారైనా మరో గ్రామంలోని గ్రూపులో జాయినై సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవచ్చు. పోస్టింగ్‌లు చేయవచ్చు. ఇలా విస్తృత స్థాయిలో వైసీపీ సోషల్ మీడియా విభాగ వాట్సాప్ గ్రూపులు పనిచేస్తున్నాయి.

వాట్సాప్ వేదికగా గ్రామ, వార్డు వలంటీర్లు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా కనుసన్నల్లోని సచివాలయ, కమ్యూనిటీ గ్రూప్ అడ్మిన్లు అధికార పార్టీకి అనుకూలంగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అధికార వైసీపీ పథకాలపై ప్రచారం చేయటం, పెయిడ్ న్యూస్‌తో పాటు విపక్షాలపై విషప్రచారం, సమాజంలోని వివిధ వర్గాలను రెచ్చగొట్టేలా కథనాలు ప్రచురించడం, మార్ఫింగ్ న్యూస్ వంటి వాటికి అడ్డగోలుగా పాల్పడుతున్నారు. ఈ వాట్సాప్ గ్రూపులపై మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) దృష్టి సారించకపోతే ఎన్నికల స్ఫూర్తి దెబ్బతినే అవకాశముంది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







భజనచంద్ర

అధికార పార్టీకి విధేయుడిగా జిల్లా పంచాయతీ అధికారి

ఆయనో జిల్లా అధికారి. పార్టీలకతీతంగా పనిచేయాల్సిన ఆయన అధికార పార్టీకి వీర విధేయత చూపిస్తుంటారు. వైసీపీ కండువా కప్పుకొని ఆ పార్టీ కార్యకర్తగా పనిచేస్తుంటారు. జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న టీఎస్ జయచంద్ర గాంధీ స్వామిభక్తి ఇదంతా. జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఆయన బంధువు పుల్లారెడ్డికి వీర విధేయత చూపిస్తూ, వైసీపీకి, సీఎం జగన్‌కు వాట్సాప్ గ్రూపుల్లో భజన చేస్తూ విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

ఎమ్మెల్యే ఉదయభాను వల్లే తనకు పోస్టింగ్ అంటూ వ్యాఖ్యలు


డీపీవో టీఎస్ జయచంద్ర గాంధీ

- ఆ రెండు పత్రికలంటూ వైసీపీ ఏజెంట్‌లా మీడియాపై అక్కసు
- జగ్గయ్యపేట ఎన్నికల అధికారిగా వచ్చేందుకు ప్రయత్నాలు
- టీడీపీ నేతల అభ్యంతరాలతో నిలిచిన నియామకం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా పంచాయతీల్లోను, సచివాలయాల్లోను వైసీపీ అధినేత జగన్ బొమ్మలు, ఆ పార్టీ రంగులు అలాగే ఉండిపోయాయి. పంచాయతీల్లో వాటర్ ట్యాంకులకు వేసిన వైసీపీ రంగుల విషయంలోనూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం జిల్లా పంచాయతీ అధికారి టీఎస్ జయచంద్ర గాంధీ అనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయాలను వెలుగులోకి తెస్తున్న పత్రికలపైన ఆయన తన అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఈ మేరకు బుధవారం ఈవోపీఆర్డీల వాట్సాప్ గ్రూపుల్లో ఈయన పెట్టిన మెసేజ్‌లు వివాదాస్పదమయ్యాయి. వైసీపీ అధినేత జగన్ తరహాలో 'ఆ రెండు పత్రికలు' అని సంబోధిస్తూ ఆయన పెట్టిన మెసేజ్‌పై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సిన అధికారి పత్రికల్లో వచ్చే కథనాల్లో నిజాలను నిగ్గు తేల్చాలే తప్ప ఇలా అక్కసు వెళ్లగక్కడం ఏమిటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోస్టింగ్ వచ్చిన రోజు నుంచి..

జయచంద్ర మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా విధులు నిర్వహించేవారు. ఈయన ఉద్యోగ జీవితం మొత్తం జగ్గయ్య పేట నియోజకవర్గంలోని మండలాల్లో ఎంపీడీవోగా చేయడ ంతోనే గడిచిపోయింది. దీంతో స్థానిక వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఆయన బంధువైన పుల్లారెడ్డితో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఉదయభాను సాయంతోనే జిల్లా పంచాయతీ అధికారిగా పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఈ విషయాన్ని పోస్టింగ్ వచ్చిన రోజే గ్రూపుల్లో మెసేజ్ పెట్టి స్వామిభక్తిని చాటుకున్నారు. ఆయన పెట్టిన మెసేజ్ సారాంశం.. 'జగన్ ప్రభుత్వం ఒక గిరిజనుడిని ఎన్టీఆర్ జిల్లా డీపీవోగా అవకాశం ఇచ్చింది. నాకు ప్రమోషన్ వచ్చి కేడర్ పెరగడానికి నాకున్న సీనియారిటీ కారణం అయితే, ఎన్టీఆర్ జిల్లా డీపీవోగా పోస్టింగ్ రావడానికి ముఖ్యంగా సర్దార్ సామినేని ఉదయభాను, మా పెద్దాయన పుల్లారెడ్డి ప్రముఖంగా కారణం. వీరు ఇరువురు నన్ను నమ్మి నాకు ఈ బాధ్యత ఇచ్చారు. వీరి నమ్మకాన్ని ఎప్పటికీ చెదరనివ్వను.' ఈ మెసేజ్‌పై అప్పట్లో తీవ్ర దుమారం రేగింది. జిల్లాస్థాయి అధికారై ఉండి ఇలా అధికార పార్టీ రాజకీయ నేతలకు భజన చేయడం ఏమిటని విమర్శలు వెల్లువెత్తాయి. కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకుని జయచంద్రను సున్నితంగా హెచ్చరించారు. అయినా ఆయన తీరు మారలేదు. ఆ తర్వాత కూడా యథావిధిగా అధికార పార్టీ భజన చేస్తూ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టేవారు.



ఆ రెండు పత్రికలంటూ అధికారిక వాట్సాప్ గ్రూపులో డీపీవో పెట్టిన పోస్టు

జగ్గయ్యపేట ఎన్నికల అధికారిగానూ ఆయనే..!

ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో)గా పనిచేస్తున్న టీఎస్ జయచంద్రను వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పట్టుబట్టి జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారిగా నియమించుకున్నారు. దీనిపై నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. సుమారు 14 సంవత్సరాల పాటు జగ్గయ్యపేట నియోజకవర్గంలో పనిచేసిన వ్యక్తిని ఎలా ఎన్నికల అధికారిగా నియమిస్తారంటూ కలెక్టర్‌కు లేఖ రాశారు. ఎన్నికల నియామవళి ప్రకారం ఎవరైనా అధికారికి ఒక నియోజకవర్గంలో ఓటుహక్కు ఉంటే, ఆ నియోజకవర్గానికి ఎన్నికల అధికారిగా పనిచేయడానికి వీల్లేదు. జగ్గయ్యపేట నియోజకవర్గం చిల్లకల్లు గ్రామ పంచాయతీ బూత్ నెంబర్ 77లో సీరియల్ నెంబరు 251, ఎపిక్ నెంబరు డబ్ల్యూసీ0452706తో జయచంద్రకు ఓటు ఉంది. ఆయన ఆధార్‌కార్డు కూడా జగ్గయ్యపేట నియోజకవర్గంలోనే ఉంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ తాతయ్య లేఖ రాయడంతో ఆయన నియామకం ఆగిపోయింది.



నాట్య నైవేద్యం

బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా కూచిపూడిలోని శ్రీసిద్ధేంద్ర కళావేదికపై బుధవారం ప్రదర్శించిన పలు నాట్యాంశాలు రసజ్ఞులను ఆనందడోలికల్లో ముంచెత్తాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన పలువురు కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. - 6లో..

జోగికి ప్రచారం చేసిన పాపం..!

కంకిపాడు పీఏసీఎస్ కార్యదర్శిపై వేటు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంకిపాడు, మార్చి 20 : అత్యుత్సాహంతో స్వామిభక్తి చూపిస్తున్న ప్రభుత్వ అధికారులపై ఎన్నికల అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. కంకిపాడు వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యదర్శి వల్లభనేని మణికంఠను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెనమలూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్ నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారంటూ ఈ నిర్ణయం తీసుకుంది. పెనమలూరు మండలంలోని యనమలకుదురు గ్రామంలో మంగళవారం అధికార పార్టీ అభ్యర్థి, మంత్రి జోగి రమేశ్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కంకిపాడు పీఏసీఎస్ కార్యదర్శి వల్లభనేని మణికంఠ పాల్గొన్నారు. ఈ విషయం ఫొటోలతో ఆంధ్రజ్యోతి పత్రికలో బుధవారం ప్రచురితమైంది. దీంతో స్పందించిన నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో డి.రాజు... పీఏసీఎస్ కార్యదర్శిని పిలిపించి వివరణ అడిగారు. అంతకు ముందు ఈ వ్యవహారంపై గుడివాడ సహకార శాఖ అధికారి ఫణికుమార్ విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాంబాబును కోరారు. విచారణ అనంతరం మణికంఠ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని నిర్ధారించుకుని, ఆయన్ను సస్పెండ్ చేయాలంటూ కంకిపాడు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ పద్మావతిని ఆదేశించారు. దీంతో బుధవారం సాయంత్రం సొసైటీ పాలకమండలి కార్యవర్గం సమావేశమై సస్పెండ్ చేస్తూ తీర్మానం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-20 (గురు)
సహర్ (ఉదయం) : 4-59 (శుక్ర)

డిక్కీ తెరుస్తున్నారు

» సరిహద్దుల్లో విస్తృతంగా సోదాలు - 6లో..

సెంట్రల్ లెఫ్ట్‌కేనా!



నేడు ఇండియా కూటమి నేతల భేటీ

- » విజయవాడ సెంట్రల్ సీటు కోరుతున్న సీపీఎం
- » వామపక్షాల మధ్య ఇప్పటికీ కుదిరిన ఒప్పందం
- » కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది పోటీ

- 6లో..

పంచాయతీల నిధులు పక్కదారి

సర్‌చార్జి, స్టాంప్ డ్యూటీ రూపంలో పంచాయతీలకు జమ కావాల్సిన నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించింది. పంచాయతీలతోపాటు మండల పరిషత్ లకు రావాల్సిన నిధులను విడుదల చేయకుండా జాప్యం చేస్తోంది. స్థానిక సంస్థలకు స్టాంప్‌డ్యూటీ రూపంలో ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయాలని జిల్లాలోని సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రతినెలా లేదా రెండు నెలలకు ఒకసారి అయినా పంచాయతీలకు క్రమం తప్పకుండా జమ చేయాల్సిన నిధులను రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఏ కారణంతో నిలిపివేశారో స్పష్టత ఇవ్వడంలేదు. ప్రభుత్వం నుంచి వచ్చిన సూచనలతోనే స్టాంప్‌డ్యూటీ నగదు పక్కదారి పట్టిందని సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. ఈ నిధులను ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా విడుదల చేయాలని సర్పంచులు కోరుతున్నారు.

పంచాయతీలు, మండల పరిషత్‌లకు సర్‌చార్జి, స్టాంప్ డ్యూటీ నిధుల విడుదలలో జాప్యం


బందరు మండలం చిన్నాపురం పంచాయతీ

- » 2022 డిసెంబరు నుంచి పెండింగ్‌లోనే..
- » పెద్ద పంచాయతీలకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు బకాయిలు
- » జనరల్ ఫండ్ ఖాతాల్లో జమ చేయకపోవడంతో పంచాయతీల్లో నిధుల కొరత
- » గగ్గోలు పెడుతున్న సర్పంచ్‌లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణాజిల్లాలో 25 మండలాలు 497 పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల పరిధిలో జరిగే భూములు, ఇళ్లస్థలాలు, గృహాలు ఇతరత్రాలు క్రయవిక్రయాల సమయంలో స్టాంప్‌డ్యూటీని రిజిస్ట్రార్ కార్యాయాల్లో వసూలు చేస్తారు. స్టాంప్‌డ్యూటీగా వసూలు చేసిన ఈ మొత్తంలో నుంచి మండల పరిషత్‌లకు 5 శాతం, పంచాయతీలకు 5 శాతం వాటా చొప్పున సర్‌చార్జి స్టాంప్‌డ్యూటీగా విడుదల చేయాల్సి ఉంది. గతంలో నెలకోసారి లేదా రెండు నెలలకు ఒకసారి ఈ నిధులను రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు ట్రెజరీల ద్వారా పంచాయతీలు, మండల పరిషత్‌లకు జమ చేసేవారు. భూముల క్రయవిక్రయాలు జరిగిన సమయంలో సర్‌చార్జి రూపంలో వచ్చిన నిధులు పంచాయతీల జనరల్ ఫండ్ ఖాతాల్లో జమ చేసేవారు. స్టాంప్‌డ్యూటీ నిధులు జిల్లాలో రూ.120 కోట్లకుపైగా విడుదల చేయకుండా తొక్కిపెట్టేశారని సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నారు. ఇంటి పన్నుల రూపంలో వసూలైన నగదుతో పాటు సర్‌చార్జి, స్టాంప్ డ్యూటీ రూపంలో వచ్చిన నిధులు పంచాయతీలకు ఆర్థికంగా కొంతమేర వెన్నుదన్నుగా ఉండేవి.

పెండింగ్‌లోనే...

నిధులను 2020 డిసెంబరు నుంచి ప్రభుత్వం నిలిపివేసింది. రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఈ నిధులను విడుదల చేయకుండా మిన్నకుండిపోయారు. సర్పంచ్‌లు రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి వచ్చిన సూచనల మేరకు నిధులు విడుదల చేయడం లేదని చెప్పి పంపేస్తున్నారు. పంచాయతీలకు ఈ నిధులు అందుబాటులో ఉంటే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా, అత్యవసర పనులు, కనీస మౌలిక వసతుల కోసం చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండేదని సర్పంచ్‌లు అంటున్నారు. వైసీపీ అధికారం చేపట్టాక కేంద్రప్రభుత్వం విడుదల చేసే 14, 15వ ఆర్థికసంఘం నిధులను పంచాయతీ పాలకవర్గాలకు కనీస సమాచారం ఇవ్వకుండానే మళ్లించేశారని, స్టాంప్ డ్యూటీ నిధులను కూడా విడుదల చేయకపోవడం ఎంతవరకు సమంజసమని సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు.

ఈ నెలాఖరుకైనా విడుదల చేస్తారా?

మరో పది రోజుల్లో 2023-2024 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. మరోవైపు ఎన్నికల హడావుడిలో అన్ని విభాగాల అధికారులు నిమగ్నమయ్యారు. ప్రతిఏటా మార్చిలో ట్రెజరీల ద్వారా నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం ఫ్రీజింగ్ విధిస్తుంది. దీంతో పంచాయతీల నుంచి ట్రెజరీలకు వెళ్లిన బిల్లులు పెండింగ్‌లోనే ఉంటాయి. ఎన్నికల సమయం కూడా కావడంతో పంచాయతీలు, మండల పరిషత్‌లకు సంబంధించిన నిధులను విడుదల చేయించేందుకు ప్రభుత్వం ఎంతమేర చొరవ తీసుకుంటుందనే అంశంపై అనేక అనుమానాలు సర్పంచ్‌లు వ్యక్తం చేస్తున్నారు.




వైసీపీ రంగులు పోలి ఉన్న మోపిదేవి, నాగాయితిప్ప రైతు భరోసా కేంద్రాలు


టిడ్కో కాలనీలో తొలగించని జగన్ స్టిక్కర్‌లు

అమలుకు నోచని ఎన్నికల నియమావళి!

మోపిదేవి, మార్చి 20 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు సంబంధించి షెడ్యూలు విడుదలై రోజులు గడుస్తున్నా గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలులో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. మోపిదేవి, వెంకటాపురం, నాగాయితిప్ప, రావివారిపాలెం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో వైసీపీ గుర్తులతో వేసిన రంగులు యధాతథంగా ఉన్నాయి. సీఎం జగన్మోహన్‌రెడ్డి పోటోతో పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. నాలుగు రోజులు గడిచినా ఎన్నికల నియమావళి అమలు చేయటంలో గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు శ్రద్ధ కనబర్చటం లేదని స్థానిక ప్రజలు, పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు.



వైసీపీ నేతల బొమ్మలతో తిరుగుతున్న ఆటో

నిబంధనల ఉల్లంఘన..

- రోడ్లపై ఆటోలు తిరుగుతున్నా పట్టని పోలీసు, రవాణా శాఖ అధికారులు

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 48 గంటలు గడుస్తున్న అధికారులు ఉదాసీన వైఖరిని వీడటం లేదు. కళ్లెదుటే ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో వైసీపీ సానుభూతిపరుల ఆటోల వెనుక భాగంలో జగన్, స్థానిక నేతల పోస్టర్లతో గత మూడు రోజులుగా దర్జాగా.. పోలీస్ చెక్‌పోస్టులను సైతం దాటుకుంటూ తిరుగుతున్నారు. మల్లాయిపాలెంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద మున్సిపల్ అధికారులు నామమాత్రంగా స్టిక్కర్‌లను తొలగించి చేతులు దులుపుకున్నారు. కాలనీలోని ఇళ్లకు జగన్, కొడాలి నాని స్టిక్కర్‌లు ఇంకా అలానే ఉండటంపై స్థానికులు విమర్శిస్తున్నారు.

- గుడివాడ

డిక్కీ తెరుస్తున్నారు

- సరిహద్దుల్లో విస్తృతంగా సోదాలు
- రూ.4.19కోట్లు స్వాధీనం
- 23 లీటర్ల ఎన్‌డీపీఎల్ సీజ్
- రాష్ట్ర సరిహద్దుల్లో 11, జిల్లాల సరిహద్దుల్లో ఐదు చెక్‌పోస్టులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఎన్నికల కోడ్ కూయగానే నోట్ల కట్టలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటివరకు రహస్య ప్రదేశాల్లో ఉంచిన లక్ష్మీదేవిని బయటకు తీసుకొస్తున్నారు. ఒకేసారి భారీగా నగదును తరలిస్తే మొత్తానికే ముప్పు వస్తుందని భావించిన నేతలు భాగాలుగా తరలిస్తున్నారు. కోడ్ అమలులోకి రాగానే అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇక్కడ జరుగుతున్న తనిఖీలను బట్టి నేతల ఎన్నికల డబ్బుల తరలింపు ప్రారంభమైందని తెలుస్తోంది. ఇప్పటి వరకు ఈ చెక్‌పోస్టుల వద్ద పోలీసులు మొత్తం రూ.4.19కోట్లను వివిధ వాహనదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు నగదుకు సంబంధిత ఎలాంటి బిల్లులను చూపించలేదు.

జిల్లా చుట్టుపక్కల 16 చెక్‌పోస్టులు

ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే నగదు, మద్యానికి అడ్డుకట్ట వేయడానికి పోలీసులు మొత్తం 16 చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. ఎన్టీఆర్ జిల్లాకు తూర్పు వైపున ఏలూరు, కృష్ణా జిల్లా సరిహద్దులు ఉన్నాయి. పశ్చిమ వైపున తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ఉంది. జిల్లాలో అంతర్ జిల్లా సరిహద్దుల వద్ద ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో 11 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మొత్తం 16 చెక్‌పోస్టుల వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బందిని నియమించారు. చెక్‌పోస్టుల మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను వీరు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా ఇతర జిల్లాల నుంచి చాలా మంది లక్షలాది రూపాయలను వాహనాల్లో తీసుకొస్తున్నారు. సీజ్ చేసిన సమయంలో వ్యాపారం నిమిత్తం ఈ నగదును తీసుకొస్తున్నట్టు సమాధానం చెబుతున్నారు. వాటిని సీఐఎస్ఎఫ్, పోలీసులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దానికి సంబంధించిన ఆధారాలను చూపించాలని అడిగితే మౌనం వహిస్తున్నారు. ఇప్పటి వరకు పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.4.19కోట్లకు సంబంధించి నగదుకోసం ఎవరూ ముందుకు రావడం లేదు. వివిధ చెక్‌పోస్టుల వద్ద ఈ నగదును దఫదఫాలుగా సీజ్ చేశారు. ఆధారాలు చూపిస్తే సీజ్ చేసిన మొత్తాన్ని ఇచ్చేస్తామని అధికారులు చెప్పినా.. దానికి సంబంధించిన వ్యక్తులు మాత్రం ముందుకు రాకపోవడం గమనార్హం. ఈ నగదు రాజకీయ నేతలు అనుచరుల ద్వారా రప్పిస్తున్నారా, హవాలా రూపంలో చలామణి అవుతుందా అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.


ఎన్నికల నియమావళిలో భాగంగా నగరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

సీసాలు తీసుకుని వాహనాలు ఇచ్చేయండి

రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద పోలీసులకు విచిత్ర పరిస్థితులు ఎదురవుతున్నాయి. తెలంగాణ సరిహద్దుల నుంచి వాహనాల్లో ఎన్‌డీపీ లిక్కర్‌ను తీసుకొస్తున్నారు. సరిహద్దుల వద్ద ఉన్న చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేసినప్పుడు అక్కడే పోలీసులు మద్యం సీసాలతోపాటు వాహనాలను సీజ్ చేస్తున్నారు. సరిహద్దుల నుంచి తప్పించుకున్నా జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద దొరికిపోతున్నారు. ఎన్‌డీపీఎల్ కేసుల్లో వాహనంలో ఉన్న మద్యం సీసాలను, వాహనాలను సీజ్ చేయడంతో పాటు వాటిని తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తారు. మద్యాన్ని తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినా స్టేషన్ బెయిల్ ఇచ్చేస్తారు. వాహనాల విలువ లక్షల్లో ఉండటంతో నిందితులు వాటిని వదిలిపెట్టాలని పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. తమపై కేసు నమోదు చేసి, సరుకు మొత్తం తీసుకున్నా పర్వాలేదు, కారును మాత్రం సీజ్ చేయకండి అని వెంటపడుతున్నారు. లేనిపక్షంలో రాజకీయ నేతలతో సిఫార్సులు చేయిస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిరంతరం కత్తి వేలాడుతున్నందున పోలీసులు సీజ్ చేసిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టుకు పంపేస్తున్నారు. ఇప్పటి వరకు పోలీసులు 23 లీటర్ల ఎన్‌డీపీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.


మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నేతలు

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తాం

- కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, మార్చి 20 : మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం మచిలీపట్నం నగర కార్పొరేషన్ నిర్వహిస్తున్న ఫిష్ మార్కెట్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి బుధవారం సందర్శించారు. మత్స్యకారుల సమస్యలపై చర్చించారు. ఈ మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ మరకాని సమతా కీర్తి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎన్నారై బొబ్బా గోవర్ధన్‌కు మత్స్యకారుల మద్దతు



నాగాయలంక, మార్చి 20 : అవనిగడ్డ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న సదరన్ స్పైసిస్ అధినేత, ప్రవాస భారతీయులు బొబ్బా గోవర్ధన్‌కు నాగాయలంక మండలం మత్స్యకారులు మద్దతు తెలియజేశారు. టీడీపీ, జనసేన పొత్తుల్లో భాగంగా అవనిగడ్డ సీటును మత్స్యకారులకు అన్నివేళలా అండగా ఉండే గోవర్ధన్‌కు ఇస్తే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని బుధవారం నాగాయలంకలో మత్స్యకార నేతలు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలియజేశారు. అవనిగడ్డ పాత ఎడ్లంక గ్రామానికి చెందిన బొబ్బా గోవర్ధన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసి.. అమెరికాలో సదరన్ స్పైసిస్ పేరుతో వ్యాపారం ప్రారంభించి విస్తరించారు. హైదరాబాద్‌లో బొబ్బా గ్రూప్స్ ఆధ్వర్యంలో స్పైస్ తయారీ కర్మాగారాలను నెలకొల్పి అటు అమెరికాలోనూ, ఇటు భారత్‌లోనూ విజయవంతమైన వ్యాపారిగా పేరుతెచ్చుకున్నారు. రాజకీయాల పట్ల ఆసక్తితో ఇప్పటికే జనసేన పార్టీనేతలతో మంతనాలు ప్రారంభించారు. ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల్లో మద్దతు ఉన్న తనకు జనసేన పార్టీ తరపున పోటీచేసే అవకాశం ఇస్తే గెలిచి తీరుతానని ఈ సందర్భంగా బొబ్బా గోవర్ధన్ తెలిపారు.


ట్రాన్స్‌పోర్టు కార్మికులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెనిగండ్ల

వైసీపీ పాలనలో రవాణా రంగం నిర్వీర్యం : వెనిగండ్ల

గుడివాడ, మార్చి 20 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రవాణ రంగం పూర్తిగా నిర్వీర్యమైందని, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. చంద్రబాబుపై నమ్మకంతో బుధవారం స్థానిక ప్రజా వేదికలో టీడీపీలో చేరిన యూనియన్ నాయకులకు వెనిగండ్ల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిలకలూరిపేట ప్రజాగళం సభలో ప్రభుత్వ భద్రతా వైఫల్యంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక సోదరులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వెనగండ్ల హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


బచ్చుల అర్జునుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ, కొట్టె వెంకట్రావు తదితరులు

బచ్చుల రాజకీయ జీవితం యువతకు ఆదర్శం

- టీడీపీ నేతల నివాళి



మచిలీపట్నం టౌన్, మార్చి 20 : బచ్చుల అర్జునుడు రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శమని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ, జనసేన నేత బండి రామకృష్ణలు అన్నారు. బుధవారం దివంగత ఎమ్మెల్సీ అర్జునుడు ఇంటి వద్ద సంతాప సభ జరిగింది. సభలో టీడీపీ నేతలు బచ్చుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, క్రమశిక్షణ గల నాయకుడిగా అర్జునుడు అందరి హృదయాలలో చోటు సంపాదించుకున్నారన్నారు. వివిధ పదవుల్లో ఆయన సేవలందించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యార్లగడ్డ వెంకట్రావు, మరకాని సమతాకీర్తి, దేవరపల్లి అనిత, చిత్తజల్లు నాగరాము, గుమ్మడి విద్యాసాగర్, జనసేన నాయకులు గడ్డం రాజు, కొట్టె వెంకట్రావు అర్జునుడు కుమారుడు బోసు, కృష్ణామిల్క్ డైరీ యూనియర్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, కొనకళ్ల బుల్లయ్య, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలకు నిరసనగా ఉద్యమించాలి

- ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్

చల్లపల్లి, మార్చి 20 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా రైతాంగం ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. చల్లపల్లిలోని చండ్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 23న భగత్ సింగ్ వర్థంతి సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించి, నిరసనలు తెలియజేయాలని ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో కూడా రైతులు యువజన విద్యార్థి సంఘాలతో కలిసి భగత్ సింగ్‌కు నివాళులర్పించి, కాగడాల ప్రదర్శన ద్వారా కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల పట్ల నిరసన వ్యక్తం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం ఆర్బీకే సెంటర్లకు తరలించి 62 రోజులైనప్పటికీ నేటి వరకు వారి ఖాతాల్లో నగదు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్రకార్యదర్శి మల్నీడు ఎలమందరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జి, జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, పెనుమత్స ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తల సమావేశంలో వలంటీరు


గిలకలదిండిలో వైసీపీ కార్యకర్తల సమావేశంలో వలంటీరు (సర్కిల్‌లో)

మచిలీపట్నం టౌన్, మార్చి 20 : ఓ వైపు అధికారులు చర్యలు తీసుకుంటున్నా పలువురు వలంటీర్లు తమ వైఖరి మార్చుకోవడం లేదు. వైసీపీ ఎన్నికల సమావేశాల్లో వలంటీర్లు ఇంకా పాల్గొంటూనే వున్నారు. మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలోని గిలకలదిండిలో వున్న పోతురాజు స్వామి దేవస్థానం ఆవరణలో బుధవారం రాత్రి జరిగిన వైసీపీ నాయకుల కార్యకర్తల సమావేశంలో వాలంటీరు లంకే ఏడుకొండలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వలంటీరు లంకే ఏడుకొండలు బాహాటంగా పాల్గొనడం చర్చనీయాంశమైంది. వైసీపీ హయాంలో వివిధ పథకాల ద్వారా ప్రజలకు అందిన లబ్ధిని వలంటీర్లు సమావేశాల్లో వివరిస్తున్నారు.

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గన్నవరం : కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామంలోని ఇద్దరు వలంటీర్లను తొలగించినట్టు ఎంపీడీవో సత్యకుమార్ బుధవారం తెలిపారు. 'వలంటీర్ల వాడకానికి కొత్త డ్రామా' శీర్షికన ఆంధ్రజ్యోతి ఈ నెల 19వ తేదీన కథనాన్ని ప్రకటించింది. ఆ కథనంలో పేర్కొన్న విధంగా.. ఈ నెల 16వ తేదీ సాయంత్రం వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు నాగార్జున, వంశీ కృష్ణలపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపగా వారి ఆదేశాల మేరకు తొలగించటం జరిగిందని తెలిపారు. ప్రచారంలో పాల్గొన్నది వాస్తవం కావడంతో తొలగించినట్టు ఎంపీడీవో చెప్పారు. ఎన్నికల నిబంధనలను ఎవరు అతిక్రమించినా ఉపేక్షించేది లేదని, చర్యలు తప్పవని హెచ్చరించారు.

అలరించిన కూచిపూడి అభినయం



కూచిపూడి, మార్చి 20 : బాలాత్రిపుర సుందరిదేవి సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళావేదికపై బుధవారం తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ప్రేక్షకులను రంజింపచేశాయి. నాట్యాచార్య సప్పా శివకుమార్ శిష్యురాలు హేమలత శివాష్టకం అంశాన్ని రసరమ్యంగా ప్రదర్శించారు. విశాఖకు చెందిన సత్యభామ శిష్య బృందం త్యాగరాజ కీర్తన, థిల్లానా అంశాలు ప్రదర్శించి మెప్పించారు. హైదరాబాద్‌కు చెందిన ఓలేటి శ్రీరేఖ శిష్య బృందం శివపార్వతీ లాస్యతాండవం, అమ్మా నీరాజనం అంశాల్లో చూపిన హావభావాలను మంత్రముగ్ధులను గావించాయి. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్, కావూరి భానుమూర్తి, హనుమంతరావు, దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాలను ప్రారంభించారు. కళాకారులకు నిర్వాహకులు మెమెంటోలు అందించి సత్కరించారు.

- నేడు ఇండియా కూటమి నేతల భేటీ
- విజయవాడ సెంట్రల్ సీటు కోరుతున్న సీపీఎం
- వామపక్షాల మధ్య ఇప్పటికే కుదిరిన అవగాహన
- కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది పోటీ



సెంట్రల్ లెఫ్ట్‌కేనా!

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఇండియా కూటమిలో విజయవాడ సెంట్రల్ స్థానాన్ని కాంగ్రెస్ తీసుకుంటుందా? కూటమిలో భాగస్వామిగా ఉన్న సీపీఎంకు కేటాయిస్తుందా? రెండు పార్టీల కార్యకర్తల నుంచి వినిపిస్తున్న ప్రశ్న ఇది. పొత్తులు ఉన్నపుడు సెంట్రల్ నియోజకవర్గాన్ని సీపీఎం తీసుకుంటుంది. 2019 ఎన్నికల్లో జనసేన వామపక్షాలతో కలిసి పొత్తు పెట్టుకోగా సెంట్రల్ సీటును సీపీఎంకు కేటాయించారు. ఇప్పుడు సీపీఎం ఇండియా కూటమిలో భాగస్వామిగా మారింది. దీనితోపాటు సీపీఐ ఉంది. ఈ రెండు పార్టీల్లో దేనికి సెంట్రల్ సీటును కేటాయిస్తారోనన్న సందిగ్ధత ఉంది. ఉమ్మడి జిల్లాలో పోటీ చేయాల్సిన సీట్లపై కూటమి నేతలు గురువారం ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే సీపీఎం, సీపీఐల మధ్య ఒక అవగాహన కుదిరింది. విజయవాడ పశ్చిమలో సీపీఐ, సెంట్రల్‌లో సీపీఎం పోటీ చేయాలని భావిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో సీపీఐ పశ్చిమ నియోజకవర్గాన్ని, సీపీఎం సెంట్రల్ నియోజకవర్గాన్ని కోరితే కాంగ్రెస్ పార్టీ స్పందన ఎలా ఉంటుందోనన్నది తెలియడం లేదు. ఇప్పటికే సీపీఎం నేత సీహెచ్ బాబూరావు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు.

సీటు ఎవరిని వరిస్తుందో?

సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీకి ఎనిమిది మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు వలిబోయిన గురునాథం కుమారుడు కిరణ్, స్వర ఆసుపత్రి ఎండీ విక్రమ్‌మోహన్, హైకోర్టు న్యాయవాది అనిత దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో వలిబోయిన కిరణ్ తండ్రి గురునాథం 2019 ఎన్నికల్లో సెంట్రల్‌లో పోటీ చేశారు. ఈసారి ఆయన తన కుమారుడిని పోటీలో పెట్టాలని భావిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న ఎనిమిది మంది అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. 2019లో కూటమి అభ్యర్థిగా సీపీఎం తరపున సీహెచ్ బాబూరావు పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో ఇక్కడి నుంచి సీపీఎం ఒంటరిగా పోటీ చేసింది. రెండు వామపక్ష పార్టీలో సీపీఎంకు ఎక్కువ బలం ఈ నియోజకవర్గంలో ఉంది. బాబూరావు ప్రస్తుతం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా ఉన్నారు. సమస్యలపై పోరాటాలు చేసే ఉద్యమ నాయకుడిగా నిరంతరం ప్రజల్లో ఉంటారని ఆయనకు గుర్తింపు ఉంది. సీపీఎం, సీపీఐ మధ్య ఒక అవగాహన కుదరడంతో సీటు సీపీఎంకే దక్కుతుందన్న భావనలో పార్టీ నేతలు ఉన్నారు. విజయవాడ నగరంలో ఉన్న మూడు నియోజకవర్గాల్లో ఒక సీటును వామపక్షాలకు ఇవ్వాలన్న ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నట్టు సమాచారం. ఈ మూడు నియోజకవర్గాల నుంచి పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీకి భారీగా దరఖాస్తులు అందాయి. పార్టీ ఎన్నికల కమిటీ ఈ దరఖాస్తులను పరిశీలిస్తోంది. కూటముల్లో సెంట్రల్ నియోజకవర్గాన్ని సీపీఎంకే కేటాయిస్తున్నందున ఈసారి కచ్చితంగా తమకే దక్కుతుందన్న భావనలో ఆ పార్టీ నేతలు ఉన్నారు. ఉమ్మడి ఏపీలో సెంట్రల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ రెండుసార్లు విజయం సాధించిందని, ఇక్కడ బలాన్ని పెంచుకోవడానికి తామే పోటీ చేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.


విన్నకోటలో వైసీపీ నేత సాయినాథ్ రవికుమార్‌రెడ్డి ఇంటిపై ఉన్న లైటింగ్ బోర్డు

బ్యానర్ల తొలగింపులో వివక్ష!

- టీడీపీ బ్యానరు తొలగించి.. వైసీపీ బ్యానర్ వదిలేశారు
- పంచాయతీ అధికారులను నిలదీసిన నేతలు

గుడ్లవల్లేరు : ఎన్నికల నిబంధనల విషయంలో అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో అధికారులు టీడీపీ లైటింగ్ బోర్డులు, బ్యానర్లను తొలగించారు. వైసీపీ నేతల బోర్డులు అలాగే వదిలేయడంతో టీడీపీ నాయకులు పంచాయతీ అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా కొసరాజు మాట్లాడుతూ, గుడ్లవల్లేరులో టీడీపీకి సంబంధించి సైకిల్ గుర్తును లైటింగ్‌తో పార్టీ అభిమాని తన సొంత భవనంపై ఏర్పాటు చేసుకున్నారన్నాడు. అధికార వైసీపీ నాయకులు పంచాయతీ అధికారులపై ఒత్తిడి తెచ్చి దానిని తొలగించారన్నారు. అయితే సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫోటోతో అధికార పార్టీ నేతలు హోర్డింగులు ఏర్పాటు చేస్తే వాటిని తొలగించకపోవడం శోచనీయమన్నారు. వైసీపీ హోర్డింగులకు అనుమతులున్నాయని పంచాయతీ కార్యదర్శి నరసింహారావు పేర్కొనడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎవరికీ ఎటువంటి అనుమతులు లేవని ఉన్నతాధికారులు చెబుతున్నా స్థానిక అధికారులు పక్షపాత ధోరణితో వైసీపీ ఫ్లెక్సీలను తొలగించకుండా వ్యవహరించడం దారుణమన్నారు. మండలంలోని విన్నకోట గ్రామంలో వైసీపీ మండలాధ్యక్షుడు సాయినాథ్ రవికుమార్‌రెడ్డి ఇంటిపై వైసీపీ లైటింగ్ బోర్డు ఉందని, అధికారులకు ఇది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం వెంటనే తొలగించకుంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని కొసరాజు తెలిపారు.


నిమ్మకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

నిమ్మకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

పామర్రు, మార్చి 20 : ఎన్నికల నియమావళికి ఏ పార్టీకి ఎలాంటి మినహాయింపు ఉండవని, విధుల్లో ఉన్న అధికార సిబ్బందికి రాజకీయ నేతలు సహకరించాలని ఎన్నికల నోడల్ అధికారిణి ఎం.భారతి కోరారు. టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్వగ్రామైన నిమ్మకూరులో ప్రవేటు స్థలంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్ర హానికి కూడా ఎటువంటి మినహాయింపు లేదని స్థల యాజమాని పాలడుగు రామప్రసాద్‌కు బుధవారం ఆమె సూచించారు. ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు తొడిగి, శిలాఫలాకంపై నేతల పేర్లు కనిపించకుండా పంచాయతీ సిబ్బంది పేపర్లను అంటించారు.

వైసీపీకి గొడ్డలి గుర్తు కేటాయించాలి

- నాగుల్‌మీరా ఎద్దేవా

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం వైసీపీకి ఫ్యాన్ గుర్తు రద్దుచేసి గొడ్డలి గుర్తు కేటాయించాలని టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా ఎద్దెవా చేశారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సొంత బాబాయిని గొడ్డలితో చంపిన వాళ్ల నాయకుల్ని వైసీపీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకున్నారన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో మొన్న కర్నూలు జిల్లా చాగలమర్రిలో ఇమామ్ హుస్సేన్‌పై వైసీపీ కార్యకర్తలు గొడ్డలితో దాడి చేసి చంపారని, నిన్న గిద్దలూరులో గిరిజన యువకుడు మునెయ్యను గొడ్డలితో నరికి చంపేశారన్నారు. అందుకే వైసీపీకి ఫ్యాన్ గుర్తును రద్దు చేసి గొడ్డలి గుర్తు కేటాయించాలన్నారు.

తప్పని 'కోడ్' కష్టాలు!

- వివాహాలకు ఆటంకంగా ఎన్నికల ప్రక్రియ

పామర్రు, మార్చి 20 : ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందంటే ఇదేనేమో.. రాష్ట్రంలో సాధారణ ఎన్నికల ప్రక్రియ శుభకార్యాలు జరుపుకునే వారికి కష్టాలను తెచ్చి పెడుతోంది. కోడ్ అమలుతో పెళ్లిపనులు చేసుకునేవారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మార్చి నెలాఖరు నుంచి ఏప్రిల్‌మాసంలో ఎక్కువగా ముహూర్తాలు ఉండటంతో శుభకార్యాలకు ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పాడ్డాయి. నగదు లావాదేవీలు చేయలేక సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో షామియానాలు, వంటసామాగ్రి దొరికే పరిస్థితి లేక సతమతమవుతున్నారు. నగదు రవాణాపై ఆంక్షలు ఉండడంతో టెన్షన్ పడుతున్నారు.

27న 'ఆక్వా వ్యవస్థాపకత, సాధికారత'పై సెమినార్

మొగల్రాజపురం, మార్చి 20 : ఈ నెల 27న మహాత్మాగాంధీ రోడ్డు హోటల్ వివాంతలో 'ఆక్వాపరిశ్రమలో వ్యవస్థాపకత, సాధికారత' అంశం మీద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఆంధ్ర చాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ రీజియన్ ఛైర్మన్ మలినేని రాజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునే వారు 9840 77227 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

బాలికను మోసగించిన యువకుడిపై పోక్సో కేసు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 20 : ప్రేమ పేరుతో బాలికను మోసగించి అత్యాచారం చేసిన ఓ యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం కేదారేశ్వరరావుపేట ప్రాంతానికి చెందిన బాలిక(15) స్థానిక రైతుబజార్‌లో కూరగాయలు కొనేందుకు వెళ్తుండేది. పి. నైనవరం గ్రామానికి చెందిన ఆకుకూరల వ్యాపారి సూర్యప్రకాష్(22) పరిచయమయ్యాడు. ప్రేమ పేరుతో బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక పెళ్లి చేసుకోమని అడగడంతో నిరాకరించాడు. దీంతో బాలిక గత రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాలిక బంధువులకు విషయాన్ని తెలపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాట్లపై దృష్టి

సమన్వయ శాఖల అధికారులతో పర్యటించిన ఆర్డీవో భవానీశంకర్

కృష్ణలంక, మార్చి 20 : విజయవాడ ఆర్డీవో, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్‌ఓ) బీహెచ్ భవానీ శంకర్ బుధవారం నియోజకవర్గానికి సంబంధించి సజావుగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఇందులో భాగంగా వివిధ శాఖల అధికారులతో కలిసి ఎస్ఎస్ఎం స్కూల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్, నిమ్రా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ రిసెప్షన్ సెంటర్‌లకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ప్రణాళిక ప్రకారం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పటిష్ఠ సమన్వయంతో, అప్రమత్తతతో వ్యవహరించి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో నిబద్ధతతో భాగస్వాములు కావాలని ఆర్డీవో భవానీ శంకర్ సూచించారు. సందర్శనలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్లు ఎ.మహేష్, కేవీ సత్యవతి, ఏసీపీ భాస్కరరావు, రత్నరాజు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న తూర్పు రిటర్నింగ్ ఆఫీసర్ బీహెచ్ భవానీశంకర్

ప్రజాధనాన్ని దోచుకుంటున్న జగన్ ప్రభుత్వం

జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

భారతీనగర్, మార్చి 20: జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై భారాలు వేసి ప్రజల ధనాన్ని దోచుకుంటూ, మరోవైపు కల్తీ మద్యాన్ని విక్రయించి మందుబాబుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోందని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ విమర్శించారు. తూర్పు పరిధిలోని 3, 4 డివిజన్ల పరిధిలో గద్దె అనురాధ బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా కార్మికులతో సమావేశమయ్యారు. టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మద్యం నిషేధం చేస్తానని అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్నందున ఈ ఎన్నికల్లో సరైన బుద్ధి చెబుతామని మహిళలు తమకు తెలియజేస్తున్నారన్నారు.

కార్పొరేటర్ దేవినేని అపర్ణ, తాడి బాబూరావు, పేరేపి ఈశ్వర్, గుండమల రాజశేఖర్, కొత్తపల్లి హరీష్, పీ.హెచ్.బాలాజీ, పి.నవీన్, దాడి సుబ్బారావు, కడియాల భవాని, లక్ష్మీ, శివలక్ష్మీ, సుష్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గద్దె అనురాధ, అపర్ణ, తదితరులు

గుణదల: స్థానిక 6వ డివిజన్ పరిధిలోని నిమ్మతోట ఏరియాలో బుధవారం సాయంత్రం గద్దె అనురాధ ఎన్నికల ప్రచారం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను గెలిపించాలని కోరారు. పడాల గంగాధర్, పునుగుపాటి మోహనరావు, పడ్డేపల్లి కేశవ్, అబ్బూరి శ్రీనివాస్, అమిర్నేని కరుణకుమారి, జనసేన నాయకులు పలిశెట్టి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

● తూర్పు నుంచి టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను గెలిపించాలని కోరుతూ గద్దె రాజేష్, క్రాంతికుమార్‌లు బుధవారం సాయంత్రం మాచవరంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. దాసరి గాబ్రియేలు, కృష్ణప్రసాద్, సుధాకర్, కె.కృష్ణ, శ్రీహరి పాల్గొన్నారు.

పటమట: 10వ డివిజన్ విజయనగర్‌కాలనీలో డివిజన్ కార్పొరేటర్ దేవినేని అపర్ణతో కలిసి గద్దె రామ్మోహన్ తనయులు గద్దె రాజేష్, క్రాంతిలు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా దేవినేని అపర్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గద్దె రాజేష్, క్రాంతిలు మాట్లాడుతూ టీడీపీ ప్రచారానికి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. గద్దె రామ్మోహన్‌ను గెలిపించా లన్నారు. జి.లోకేశ్వరరావు, బి. శ్రీధర్, ఏ. వేణుగోపాల్, వి. వెంకటేశ్వరావు, బొర్రా రవీంద్రబాబు పాల్గొన్నారు.

పశ్చిమ సీటు పోతినకు కేటాయించాలి

●సర్వమత ప్రార్థనలు చేసిన నగరాల సామాజిక వర్గం నాయకులు ● పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకాలు

చిట్టినగర్, మార్చి 20: రానున్న ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ సీటును జనసేన నగర అధ్యక్షుడు పోతిన మహేశ్‌కు కేటాయించాలని కోరుతూ పలువురు నగరాల సామాజిక వర్గ నాయకులు బుధవారం సర్వమత ప్రార్థనలు చేశారు. తొలుత చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భవానీపుం గాలిబ్ షాహిద్ దర్గాలో, జోజినగర్ బాలయేసు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం

విద్యాధరపురం: పశ్చిమలో జనసేన తరఫున పోటీ చేసేందుకు పోతిన మహేశ్‌కు టికెట్ ఇచ్చి ప్రోత్సహించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను 42వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష వేడుకొన్నారు. డివిజన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. డివిజన్ కమిటీ సభ్యులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.


మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేసి కొబ్బరికాయలు కొడుతున్న నగరాల నాయకులు

భవానీపురం: 45వ డివిజన్ జనసేన పార్టీ కార్యాలయం వద్ద పోతిన మహేశ్‌కు టిక్కెట్ ఇవ్వాలని కోరుతూ డివిజన్ అధ్యక్షులు బొమ్ము గోవిందలక్ష్మి, రాంబాబుల ఆధ్వర్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. డివిజన్ ఉపాధ్యక్షులు దుర్గా కిషోర్, శంకర్, దుర్గారావులు పాల్గొన్నారు.

పోతిన మహేశ్‌కు వెల్లువెత్తుతున్న మద్దతు

వన్‌టౌన్: జగ్గయ్యపేట, తిరువూరు, నందిగామ, మైలవరం నియోజకవర్గాలకు చెందిన జనసేన నాయకులు బుధవారం మహేశ్‌ను విజయవాడలోని ఆయన పార్టీ కార్యాలయంలో కలిసి మద్దతు పలికారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సత్యనారాయణపురం, మార్చి 20: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో గొలుసు లాక్కొని పరారయ్యారు.ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం గాంధీనగర్ రామకోటి వెనకాల రోడ్డులో ఉంటున్న వావిశెట్టి సుకన్య (38) మంగళవారం రాత్రి 10.30కు నూరి హాస్పటల్ రోడ్డులో పాల ప్యాకెట్‌కు వెళుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులలో ఒకరు అడ్రస్ అడుగుతూ ఆమె మెడలో నానుతాడు తెంచుకొని పారిపోయాడు. ఆమె తేరుకుని అరిచేలోగా ఉడాయించారు. జరిగిన సంఘటనపై సుకన్య సత్యనారాయణపురం పోలీసులకు సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆమె వద్ద వివరాలు తీసుకున్నారు. ఆ వీధిలోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. 14 గ్రాముల నానుతాడు పోయిందని బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజీవ్‌గాంధీ పార్క్ వద్ద అన్న క్యాంటీన్

వన్‌టౌన్, మార్చి 20: టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ బుధవారం 37వ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ పార్క్ వద్ద అన్న క్యాంటీన్‌ను నిర్వహించారు. ఆర్.మాధవ, పశ్చిమ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు హనుమంతరావు, ధనేకుల హరికృష్ణ, ఇల్లిపిల్ల రఘు, కుంచం బాలరాజు, మణికంఠ, రాజేష్, సాయి, రాము తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణవీధి వెంకటేశ్వరస్వామి ఆదాయం రూ. 7.47 లక్షలు

వన్‌టౌన్, మార్చి 20: బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీలలోని కానుకలను లెక్కించారు. 361 రోజులకు రూ 7,47,457 కానుకలు వచ్చాయని ఈవో ఘంటసాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పాత శివాలయం ఈవో కే.సురేష్ పర్యవేక్షించారు. ఆలయ అర్చక సిబ్బంది, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

58వ డివిజన్‌లో మార్పు కోసం సీపీఎం



అజిత్‌సింగ్‌నగర్, మార్చి 20 : స్థానిక 58వ డివిజన్‌లో మార్పు కోసం సీపీఎం కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రమణారావు, కె. దుర్గారావు, విజయ, దేవికుమారి పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ



విద్యాధరపురం, మార్చి 20: భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం వెస్ట్‌జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల వద్ద ఎలక్ట్రానిక్ గడియారాలు, సెల్‌ఫోన్‌లు, ఇతరత్రా డిజిటల్ మెటీరియల్ ఏవైనా ఉన్నాయా అని తనిఖీ చేశారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. భవానీపురం సీఐ కృష్ణ, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

గుంటుపల్లి నాగేశ్వరరావుకు ఘన నివాళి


నాగేశ్వరరావుకు నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

విద్యాధరపురం, మార్చి 20: నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ జాతీయ క్రమశిక్షణా సంఘం సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు ఆకస్మిక మృతి పట్ల టీడీపీ నాయకులు ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పార్టీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి, సుబ్రహ్మణ్యం, మరక శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు, మణికంఠ, పామర్తి కిషోర్, బత్తుల దుర్గారావు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

లిటిల్ బ్రెయిన్స్‌లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే



మొగల్రాజపురం, మార్చి 20: సిద్ధార్థ నగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో బుధవారం ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల్లో ఉత్సాహం నింపడానికి ఆటపాటలు, నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డైరెక్టర్ ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ముక్తేవి ఫణి ప్రసాద్, ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ ముక్తేవి మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ


ఉపకార వేతనాలను అందిస్తున్న గురుగోవింద్ సింగ్ ఫౌండేషన్ నిర్వాహకులు

వన్‌టౌన్, మార్చి 20: గురు గోవిండ్ సింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేబీఎన్ కాలేజీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం ఉపకార వేతనాలను అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ఫౌండేషన్ ప్రతి ఏటా తమ కళాశాలలో ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు అండగా ఉంటోందని కొనియాడారు. ఫౌండేషన్ చైర్మన్ సర్దార్ కులదీప్‌కౌర్ మాట్లాడుతూ తోటి వారికి సహాయాన్ని అందించే గుణాన్ని విద్యార్థులు అలవరచుకోవాలన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు హర్వేందర్ సింగ్, పరమజిత్‌సింగ్, హర్జిత్‌కౌర్, రమణిక్‌కౌర్, కరంబీర్‌కౌర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ కే.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి బ్యాగ్ అప్పగింత

వన్‌టౌన్, మార్చి 20: ఆటోలో బ్యాగ్ పోగొట్టుకున్న బాధితుడికి గవర్నరుపేట పోలీసులు అందజేశారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలానికి చెందిన పల్లా కోటేశ్వరరావు ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన గుడివద్ద ఆటో ఎక్కి గవర్నర్‌పేటలోని మోడరన్ సూపర్‌మార్కెట్ వద్ద బ్యాగ్ వదిలేసి హడావిడిగా దిగిపోయాడు. అనంతరం అతను బ్యాగ్ విషయమై గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గవర్నరుపేట ఎస్ఐ నారాయణమ్మ తన సిబ్బందితో కోటేశ్వరరావు ఎక్కిన ఆటోను గుర్తించి, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధితుడికి బ్యాగ్‌ను అందజేశారు.

ముగ్గురిపై దాడి

వన్‌టౌన్, మార్చి 20: రాజీవ్‌గాంధీ పార్కు ఎదురుగా ఘాట్ వద్ద ముగ్గురిపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన బుధవారం కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వాణిజ్య పన్నుల విభాగంలో పనిచేస్తున్న ప్రత్తిపాటి రాజు అతని స్నేహితుడు గోపాలకృష్ణ, మరొకరు రాత్రి రాజీవ్‌గాంధీ పార్కు ఎదురుగా ఉన్న ఘాట్ వద్ద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. గుర్తు తెలియని ఇద్దరు యువకులు ఆ ముగ్గురితో గొడవపడి దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో ప్రత్తిపాటి రాజుకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సీఐ ఆకుల మురళీకృష్ణ సిబ్బందిని అక్కడకు పంపించి వివరాలు తెలుసుకుని బాధితుడిని ఆసుపత్రికి పంపించారు. పోలీసులు దాడికి పాల్పడిన వారి గురించి ఆరా తీస్తున్నారు. దాడికి పాల్పడిన వారు మద్యం మత్తులో ఉన్న గంజాయి బ్యాచ్ సభ్యులని స్థానికులు చెబుతున్నారు. ఇంకా ప్రత్తిపాటి రాజు, అతని స్నేహితుల వివరాలు తెలియాల్సి ఉన్నది.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 21 మార్చి 2024
cinema@andhrajyothy.com



ఉత్తరాంధ్ర నేపథ్యంలో రామ్‌చరణ్, జాన్వీ కపూర్ భారీ చిత్రం

మెగాస్టార్ చిరంజీవి, శ్రీదేవి జంటగా దాదాపు 35 ఏళ్ల క్రితం వచ్చిన 'జగదేకవీరుడు- అతిలోకసుందరి' చిత్రానికి సీక్వెల్ తీయాలని, అందులో వారిద్దరి నటవారసులు రామ్‌చరణ్, జాన్వీ కపూర్ నటించాలన్నది ఎందరో అభిమానుల కల. అయితే ఆ సినిమాకు సీక్వెల్‌గా కాదుకానీ మరో రూపంలో వారి కోరిక నెరవేరుతోంది. రామ్‌చరణ్, జాన్వీ కపూర్ తొలిసారిగా కలసి నటించే చిత్రం షూటింగ్ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 'ఉప్పెన' చిత్రంతో విజయాన్ని అందుకున్న బుచ్చిబాబు సానా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో వెంకట సతీశ్ కిలారు ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్, జాన్వీపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు బోనీ కపూర్ కెమెరా స్విచ్ఆన్ చేయగా, మెగాస్టార్ చిరంజీవి క్లాప్ ఇచ్చారు. దర్శకుడు శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ చేతుల మీదుగా చిత్ర యూనిట్ స్క్రిప్ట్ అందుకొంది. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ 'సుకుమార్‌గారి దగ్గర 'రంగస్థలం' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. ఆ చిత్రహీరో రామ్‌చరణ్‌గారు నా మీద నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చారు. నా రెండో సినిమాకే రెహమాన్‌గారు సంగీతం అందించడం ఆనందంగా ఉంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో జరిగే రూరల్, రా, రస్టిక్ ఎమోషనల్ జర్నీ ఈ సినిమా' అని చెప్పారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'బుచ్చిబాబుకి సినిమా అంటే పిచ్చి. 'రంగస్థలం' నేరేషన్‌ను సుకుమార్‌గారు నాకు నలభై నిముషాలే ఇచ్చారు. అయితే అక్కడి నుంచి ప్రతి రోజూ రెండేసి గంటలు నేరేషన్ ఇచ్చింది మాత్రం బుచ్చిబాబే. సుకుమార్‌గారి దగ్గర ఉన్న టీమ్‌లో ఆయన బెస్ట్. నా కెరీర్‌లో ఇంత త్వరగా రెహమాన్‌గారితో కలసి పని చేస్తానని అనుకోలేదు. కచ్చితంగా అద్భుతమైన చిత్రాన్ని అందిస్తామనే నమ్మకం ఉంది' అన్నారు. తను అభిమానించే, ప్రేమించే ప్రముఖులందరూ ఇక్కడ ఉన్నందుకు జాన్వీ కపూర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ చిత్రానికి పాటలు: చంద్రబోస్, అనంత శ్రీరామ్, బాలాజీ, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, ఫొటోగ్రఫీ: రత్నవేలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై. ప్రవీణ్‌కుమార్.

ఆ నమ్మకం నిజమైంది



'చాలా కొత్త అంశంతో, ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో 'ఓం భీమ్ బుష్' చిత్రం రూపొందించా. చాలా సార్లు కొత్త పాయింట్ దొరికినప్పుడు ఒకటే జానర్‌కి ఫిక్స్ అవుతాం. అలా కాకుండా డిఫరెంట్‌గా ప్రజెంట్ చేస్తూ కంప్లీట్ ఎంటర్‌టైనింగ్‌గా చిత్రం ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపూ ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు' అన్నారు హీరో శ్రీవిష్ణు. ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణతో కలసి ఆయన నటించిన 'ఓం భీమ్ బుష్' చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- ఈ సినిమాకు రెండు, మూడు టైటిల్స్ అనుకున్నాం. అయితే నేను మొదటి నుంచి 'ఓం భీమ్ బుష్' చిత్రానికి ఓటు వేశాను. చాలా క్యాచీ టైటిల్ ఇది. నిర్మాత వంశీగారు ఫస్ట్ కట్ చూసి ఈ టైటిల్‌కే ఫిక్స్ అవుదాం.. అన్నారు. ఆ టైటిల్‌కు మంచి రెస్పాన్స్ రావడం ఆనందంగా ఉంది. సినిమాలో మిస్టరీ, థ్రిల్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ ఉన్నాయి. నేను, ప్రియదర్శి, రాహుల్ మంచి స్నేహితులం. రెగ్యులర్‌గా కలుస్తుంటాం. అందుకే ఆడుతూ పాడుతూ సినిమా పూర్తి చేశాం.
- ప్రేక్షకులు కూడా ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మరో అంశం కూడా బాగుందని అంటారు. అదేంటో సినిమా చూశాక తెలుస్తుంది.
- నిర్మాత పెట్టిన పెట్టుబడి తిరిగి రావాలన్నదే ఎప్పుడూ నా ఆలోచన. ఈ సినిమా మీద పెట్టిన పెట్టుబడికి మూడు, నాలుగు రెట్లు లాభం రావడం చాలా తృప్తినిచ్చింది. 'సామజవరగమన' చిత్ర విజయం, ఈ సినిమా టీజర్, ట్రైలర్, యూవీ బేనర్ ఈ సినిమాకు బాగా హెల్ప్ అయ్యాయి. మంచి బేనర్‌లో సినిమాలు చేయడం వల్ల అన్ని విషయాల్లో వారే కేర్ తీసుకుంటారు కనుక నా ఒత్తిడి తగ్గింది.
- దర్శకుడు శ్రీహర్ష చెప్పిన కథకు కొంచెం కలర్‌ఫుల్‌గా వెళితే బావుంటుందనిపించింది. డీవోపీ రాజ్ తోటతో ఆరు సినిమాలు చేశాను. వాళ్లిద్దరికీ మంచి సింక్ ఉంది. అలాగే సన్నీ సంగీతం అంటే నాకు ఇష్టం. ఒక అద్భుతమైన ప్రొడక్షన్ హౌస్‌కి మంచి టీమ్ కుదిరితే సినిమా టెక్నికల్‌గా బాగుంటుదనే నమ్మకం ఈ సినిమా విషయంలో మరోసారి నిజమైంది.

యాగంటిలో శ్రీవల్లి





నటి రష్మికా మందన్నా ప్రస్తుతం పుష్ప-2లో నటిస్తోంది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాగంటిలో జరుగుతోంది. బుధవారం ఈ చిత్రం షూటింగ్ గురించి రష్మికా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో తెలిపారు. "ఈ గుడి ఎంతో పురాతనమైనది. ఈ రోజు షూటింగ్ అద్భుతంగా సాగింది. ఈ ప్రదేశం..ఇక్కడి ప్రజలు..వారి ఆదరాభిమానాలు మరిచిపోలేని విధంగా ఉన్నాయి. ఈ గుడిలో సమయం గడపటం ఎంతో ప్రశాంతతను, సంతోషాన్ని ఇచ్చింది" అని పోస్ట్ చేశారు. మరోవైపు ఈ చిత్రం షూటింగ్ నుంచి లీకైన రష్మికా ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కొత్తగా...

మంచి సబ్జెక్ట్‌తో...



అరుణ్ ఆదిత్య, అప్సర రాణి హీరోహీరోయిన్లుగా ఓ నూతన చిత్రం తెరకెక్కుతోంది. కృష్ణబాబు దర్శకత్వం వహిస్తున్నారు. సీనియర్ నటి లక్ష్మీ , బేబీ వినూత, ఉదయ్ భాను కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వినూత్న సెల్యూలాయిడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై నల్లా శ్రీదేవి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. డైరెక్టర్ వి. సముద్ర తొలిషాట్‌కు గౌరవ దర్శకత్వం వహించగా, ప్రముఖ రైటర్ పరుచూరి గోపాలకృష్ణ హీరోయిన్‌పై క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కృష్ణబాబు మాట్లాడుతూ "మంచి సబ్జెక్ట్‌తో తెరకెకుతున్న ఈ చిత్రం షూటింగ్‌ను త్వరలోనే పూర్తి చేసి మీ ముందుకు తెస్తాం. ఈ చిత్రం మీ అందరినీ తప్పక అలరిస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ చిత్రానికి డిఓపి: ఆర్ భాస్కర్, సంగీతం: యం.యం శ్రీలేఖ, సహ నిర్మాత: చైతన్య కిరణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: వెంకటేష్, ఖుషి

క్రిస్పీ సస్పెన్స్ థ్రిల్లర్‌గా...



యస్వంత్, సాయితేజ, అరుషి, నిఖిల హీరోహీరోయిన్లుగా ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఊర శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కారుణ్య శ్రేయాన్స్ ఫిల్మ్స్ బ్యానర్‌పై పోతురాజు నర్సింహారావు, కందిమల్ల సాయితేజ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. కంది రామచంద్రారెడ్డి గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్ కొట్టారు, రచయిత బిక్కి కృష్ణ స్విచ్ ఆన్ చేశారు. నిర్మాత పోతురాజు నర్సింహారావు మాట్లాడుతూ "కొత్త తరం నటులను ప్రోత్సహించండి" అని కోరారు. డైరెక్టర్ ఊర శ్రీనివాస్ మాట్లాడుతూ "క్రిస్పీ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం" అని అన్నారు. హీరోహీరోయిన్లు మాట్లాడుతూ "ఇది యువతరాన్ని విశేషంగా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

తారల కథలు తెరపైకి

చిత్రసీమలో ఇప్పుడు బయోపిక్‌ల ట్రెండ్ నడుస్తోంది. అసామాన్య విజయాలు సాధించిన సామాన్యుల గాథల నుంచి క్రీడా, రాజకీయ దురంధరుల బయోపిక్‌లు తెరకెక్కించడం ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. ఇవన్నీ ఒకెత్తయితే సినీ రంగానికే చెందిన పలువురు ప్రముఖుల జీవితాలను వెండితెరపైకి తేవడం కొంతకాలంగా జరుగుతోంది. తెలుగులో నటి సావిత్రి జీవితం ఆధారంగా వచ్చిన 'మహానటి' ఏ స్థాయి విజయాన్ని అందుకొందో చూశాం. ఆ కోవలోనే ఇప్పుడు పలువురు సినీ తారల జీవితాలు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి.















ట్రాజెడీ క్వీన్ బయోపిక్

తనదైన అందం, అభినయంతో కథానాయికగా ఒక తరం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు మీనాకుమారి. కథానాయికగానే కాదు, తన సుమధుర గానంతోనూ మెప్పించారు. కవయిత్రిగానూ రాణించారు. ఆమెను బాలీవుడ్ ట్రాజెడీ క్వీన్‌గా విశ్లేషకులు వర్ణిస్తారు. బాలనటిగా పరిశ్రమలోకి అడుగుపెట్టి దాదాపు 90కు పైగా సినిమాల్లో ఆమె నటించారు. 'పాకీజా, సాహిబ్ బీబీ ఔర్ గులాం, మేరే అప్నే' లాంటి ఎన్నో చిత్రాలు క్లాసిక్స్‌గా విగిలాయి. 1972లో ఆమె చనిపోయారు. ఇప్పుడు బాలీవుడ్‌లో ఆమె బయోపిక్ తెరకెక్కుతోంది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. స్క్రిప్ట్ దశలో ఆయన చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మీనాకుమారి కుటుంబ సభ్యులను కలసి ఆమె జీవిత విశేషాలను సేకరించారు. అయితే ఈ చిత్రంలో నటించే కథానాయిక ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. కృతీసనన్ టైటిల్ రోల్ పోషిస్తున్నట్లు కొన్నాళ్లుగా బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. కృతీ కూడా మీనాకుమారి పాత్రను పోషించేందుకు ఆసక్తిగా ఉన్నారనీ, ఇప్పటికే తను ఆ పాత్ర కోసం సన్నద్ధమవుతున్నారని తెలుస్తోంది. అయితే అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మధుబాలగా మెప్పించేదెవరు?

ఆ కాలంలో భారతీయ సినీ చరిత్రలోనే అత్యధిక పారితోషికం అందుకొన్న కథానాయికగా ఖ్యాతి గడించారు మధుబాల. రెండు దశాబ్దాల కెరీర్‌లో 1969లో తను కన్నుమూసేనాటికి 60కు పైగా చిత్రాల్లో నటించారు. 'నీల్‌కమల్, అమర్, మహల్, బర్సాత్ కీ రాత్' ఆమె నటించిన చిత్రాల్లో కొన్ని. చారిత్రక నేపథ్యంలో తెరకెక్కిన 'మొఘల్ ఈ ఆజమ్' చిత్రంలో అనార్కలి పాత్ర ఆమె నటనలో కలికితురాయిగా నిలిచిపోయింది. త్వరలోనే ఆమె జీవితకథ వెండితెరపైకి వస్తోంది. 'డార్లింగ్స్' చిత్రానికి దర్శకత్వం వహించిన జస్మీత్ కే రీన్ మెగాఫోన్ చేపట్టనున్నట్లు స్వయంగా ప్రకటించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మిస్తోంది. మీనాకుమారి పాత్ర ఎవర్ని వరించనుంది అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. అలియాభట్, మాధురీ దీక్షిత్, కంగనా రనౌత్‌లో ఒకరికి దక్కే అవకాశముందని బాలీవుడ్ వర్గాల సమాచారం.

ఇద్దరు నాయికలతో

ప్రముఖ బాలీవుడ్ నృత్య దర్శకులు దివంగత సరోజ్‌ఖాన్ బయోపిక్‌కు గతేడాది చివరలో సన్నాహాలు మొదలయ్యాయి. పలు బాలీవుడ్ హిట్ చిత్రాలకు ఆమె కొరియోగ్రాఫర్‌గా పనిచేశారు. ఎంతోమంది నృత్యదర్శకులను బాలీవుడ్‌కు అందించారు. టీ సిరీస్ భూషణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ బయోపిక్‌కు హన్సల్ మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రసుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఇద్దరు నాయికలు నటిస్తారు' అని హన్సల్ మెహతా చెప్పారు. మాధురీ దీక్షిత్ సరోజ్‌ఖాన్ పాత్రను పోషించనున్నట్లు తెలిసింది. మాధురీ నటించిన పలు హిట్ గీతాలకు సరోజ్‌ఖాన్ నృత్యరీతులు సమకూర్చారు.

మరోసారి తెరపైకి

టాలీవుడ్‌లోనూ కొందరు సినీ ప్రముఖల జీవితం ఆధారంగా సినిమాలు తెరకెక్కుతున్నాయి. సిల్క్ స్మిత జీవితం ఆధారంగా 2011లో బాలీవుడ్‌లో వచ్చిన 'డర్టీ పిక్చర్' ఘన విజయం అందుకొంది. విద్యాబాలన్ టైటిల్ రోల్ పోషించిన ఈ చిత్రం దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకొంది. ఇప్పుడు మరోసారి ఆమె జీవిత కథ వెండితెరపైకి వస్తోంది. 80, 90 దశకాల్లో ప్రత్యేక గీతాల్లో ప్రేక్షకులను అలరించారు స్మిత. ప్రతి సినిమాలోనూ ఆమె ప్రత్యేకగీతం ఉండి తీరాలనే పరిస్థితి అప్పట్లో ఉండేది. తెలుగుతో పాటు పలు భాషల్లో 400 వరకూ చిత్రాల్లో నటించారు. 1996లో ఆమె ఆత్మహత్య చేసుకొన్నారు. సిల్క్ మరణం ఇప్పటికీ మిస్టరీనే. 'సిల్క్ స్మిత - ది అన్‌టోల్డ్ స్టోరీ' పేరుతో రూపొందనున్న ఈ చిత్రానికి జయరాం శంకరన్ దర్శకత్వం వహిస్తున్నారు. సిల్క్ స్మిత గురించి ఎవరూ చెప్పని విషయాలను ఈ సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపారు. ధనంజయన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో చంద్రిక రవి టైటిల్ రోల్ పోషిస్తున్నారు.

కథానాయికగా తెలుగుదనం ఉట్టిపడే పాత్రలతో సౌందర్య ఇంటిల్లిపాదికి గుర్తుండిపోయారు. ప్రతిభావంతురాలైన నటిగా పేరు తెచ్చుకున్నారు. ఎక్స్‌పోజింగ్‌కు దూరంగా ఉండేవారు. 'అమ్మోరు, రాజా, జయం మనదేరా, అంతఃపురం' లాంటి సినిమాల్లో ఆమె నటనకు మంచి పేరొచ్చింది. 2004లో బెంగళూరులో జరిగిన విమాన ప్రమాదంలో సౌందర్య మరణించారు. ఆమె బయోపిక్‌ను తెరకెక్కిస్తున్నట్లు మూడేళ్ల క్రితం పరిశ్రమలో వార్తలు వచ్చాయి. అయితే అవేవీ నిజం కాలేదు. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో కథానాయిక రష్మిక మందన్న మాట్లాడుతూ "నువ్వు సౌందర్య గారిలా ఉన్నావు' అని చాలా మంది అన్నారు. ఆమె నటన, వ్యక్తిత్వం నాకు చాలా ఇష్టం. ఎవరైనా ఆమె బయోపిక్‌ను తెరకెక్కిస్తే సౌందర్య పాత్రను పోషించాల్సి ఉంది' అని మనసులో మాట బయటపెట్టారు. స్టార్ హీరోయిన్ కోరిక కాబట్టి రష్మిక డేట్స్ ఇస్తే సౌందర్య బయోపిక్‌ను నిర్మించడానికి ఏ నిర్మాతైనా ముందుకు రాకపోతాడా వేచి చూడాలి.

రెమ్యూనరేషన్ రెట్టింపు?

'డాన్ 3' చిత్రంలో రణ్‌వీర్‌సింగ్ సరసన కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు బాలీవుడ్‌లో బాగా డిమాండ్ ఉన్న కథానాయికల్లో ఆమె ఒకరు. ఈ సినిమా కోసం కియారా ఏకంగా రూ. 13 కోట్లు పారితోషికంగా తీసుకుంటున్నట్లు బీ టౌన్ టాక్. ఇప్పటివరకూ కియారా అందుకున్న అత్యధిక పారితోషికం కూడా ఇదేనట. అంతేకాదు హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటిస్తున్న మల్టీ స్టారర్ చిత్రంలోనూ ఆమె కథానాయికగా నటిస్తున్నారు. అయితే ఆ సినిమాకు మాత్రం ఆమె రూ. 6 కోట్లు తీసుకుంటున్నారట. ఆ చొప్పున 'డాన్ 3' కు ఆమె రెట్టింపు పారితోషికం అందుకుంటున్నట్లే లెక్క. ఈ చిత్రంలో ఇప్పటి వరకూ కనిపించని కొత్త తరహా పాత్రలో కనిపించబోతున్నట్లు కియారా గతంలో చెప్పారు.



కన్నప్ప కామిక్ బుక్



విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' రెండో షెడ్యూల్ ఇటీవల పూర్తయింది. త్వరలో మరో షెడ్యూల్ ప్రారంభించనున్నారు. ఈ చిత్ర నిర్మాత, విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా ఇటీవల 'కన్నప్ప కామిక్ బుక్‌ను విడుదల చేశారు. భక్త కన్నప్ప పురాణ కథను కామిక్ రూపంలో వివరించే పుస్తకమిది. 'నేను చదివిన అత్యంత ఉత్తేజకరమైన కథను ప్రపంచానికి తెలియజేయాలన్నది నా కల. యువత ఈ కథను, చరిత్రను తెలుసుకోవాలి. అందుకే .ఈ పుస్తకం' అన్నారు. మంగళవారం జరిగిన మోహన్‌బాబు పుట్టినరోజు వేడుకలకు మలయాళ నటుడు మోహన్‌లాల్, ముఖేశ్ రిషి హాజరయ్యారు.

ఇళయరాజా భక్తుడిని



'ఇసైజ్ఞాని' ఇళయరాజాకు తను పరమభక్తుడనని తమిళ హీరో ధనుష్ అన్నారు. ఇళయరాజా జీవిత చరిత్ర ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రంలో ఆయన హీరో. అరుణ్ మాదేశ్వరన్ దర్శకుడు. ఈ చిత్రం షూటింగ్ బుధవారం చెన్నైలో మొదలైంది. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రూపుదిద్దుకోనుంది. ఈ కార్యక్రమంలో విశ్వనటుడు కమల్‌హాసన్ పాల్గొని మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రం కేవలం ఐదు భాషల్లోనే కాకుండా, భారతదేశంలోని భాషలన్నింటిలో విడుదలకావాలి. ఇది ఇళయరాజా స్టోరీ కాదు.. 'భారతరత్న' జీవిత కథ'. ఈ పాత్రకు ధనుష్ న్యాయం చేస్తారని భావిస్తున్నా' అని పేర్కొన్నారు. చిత్ర కథానాయకుడు ధనుష్ మాట్లాడుతూ 'చిత్రపరిశ్రమలో సూపర్‌స్టార్ రజినీకాంత్, ఇళయరాజా అంటే నాకు అమితమైన అభిమానం. వాళ్లిద్దరి బయోపిక్స్‌లో నటించాలన్నది నా లక్ష్యం. వాటిల్లో ఒకటి నెరవేరింది. ఇళయరాజాకు నేనొక భక్తుడిని. నటనలో ఆయన సంగీతమే నాకు గురువు.' అన్నారు. ఈ సినిమాను కనెక్ట్ మీడియా, పీకే ప్రైమ్ ప్రొడక్షన్, మెర్క్యూరి మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. - చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఇన్‌ప్రోగ్రెస్

'నీ దారే నీ కథ'



వంశీ జొన్నలగడ్డ స్వీయ దర్శకత్వంలో నూతన నటీనటులతో నిర్మిస్తున్న చిత్రం 'నీ దారే నీ కథ. మ్యూజికల్ బ్యాక్ డ్రాప్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మసోల, వేద్, అంజన బాలాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సురేశ్, అజయ్, కల్యాణీ నటరాజన్ ముఖ్య పాత్రలు పోషించారు. వంశీ జొన్నలగడ్డ, తేజేష్ వీర, శైలజ జొన్నలగడ్డ నిర్మించారు. బుధవారం ఈ చిత్రం టీజర్‌ను సీనియర్ జర్నలిస్టులు ప్రభు, లక్ష్మీనారాయణ, సురేశ్‌లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వంశీ జొన్నలగడ్డ మాట్లాడుతూ "ఎంతోమంది సింక్ సౌండ్ రిస్క్. అంటున్నా.. సింక్ సౌండ్ పద్ధతితోనే హాలీవుడ్ స్టాండర్డ్స్‌కి ఏ మాత్రం తగ్గకుండా చిత్రీకరించాం. ఇందులో కథతో పాటూ సాగే మ్యూజిక్ ఒక మంచి సినిమాటిక్ ఫీల్‌ను అందిస్తుంది. అనుకున్నది సాధించడం కోసం నలుగురు యువకులు చేసే ప్రయత్నాల్ని అందర్నీ ఆకట్టుకునేలా, ఎంతో ఆసక్తికరంగా మలిచాం" అని చెప్పారు. నిర్మాత తేజేష్ మాట్లాడుతూ "ఇది మా మొదటి సినిమా అయినా ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా చాలా కొత్తగా మీ ముందుకు తీసుకొస్తున్నాం" అని అన్నారు. నిర్మాత శైలజ జొన్నలగడ్డ మాట్లాడుతూ "సినిమా మీద ఉన్న ప్యాషన్‌తో ఈ చిత్రాన్ని నిర్మించాం. మంచి టెక్నికల్ వాల్యూస్‌తో మ్యూజిక్ బ్యాక్ డ్రాప్‌తో యువతను ఆకట్టుకునే విధంగా ఈ సినిమా ఉంటుంది. బుడాపెస్ట్ లో చేసిన మ్యూజిక్ ఆర్కెస్ట్రా థీమ్ సినిమాకి హైలైట్‌గా నిలుస్తుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: విపిన్ సామ్యూల్, సంగీతం: ఆల్బర్టో గురియోలి.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 21 మార్చి 2024

కౌన్సెలింగ్

నాటు మందుతో కాలేయం గుల్ల

Q A

డాక్టర్! కామెర్లు సోకినప్పుడు పత్యం చేస్తూ, పసరు మందు తీసుకుంటే సరిపోతుంది అంటారు. ఈ మందుతో ఎంతవరకూ ప్రయోజనం ఉంటుంది?

ఓ సోదరి, హైదరాబాద్.



కాలేయం జబ్బు పడిందనడానికి కామెర్లు ఒక సంకేతం అనే విషయం అందరికీ తెలుసు. అయితే కామెర్లకు కారణమైన కాలేయ జబ్బుకు అసలు కారణాన్ని వైద్య సహాయంతో కనిపెట్టి, అందుకు తగిన చికిత్స తీసుకోవడం ఎంతో కీలకం అనే విషయం ఎవరికీ తెలియదు. మూలికా వైద్యాలు, ఇతరత్రా నాటు మందుల వల్ల కాలేయానికి మేలు కంటే హాని ఎక్కువ కలుగుతుంది. కొన్ని సందర్భాల్లో తీవ్రమైన లివర్ ఫెయిల్యూర్‌కూ దారి తీయవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కాలేయ మార్పిడి అవసరం అవుతుంది. కాబట్టి కామెర్లు కనిపించినప్పుడు కాలేయ వ్యాధి మరింత ముదిరిపోకుండా ఉండడం కోసం వైద్యుల సలహాలను తీసుకోవాలి. ఆకలి మందగించడం, పొట్ట నిండుగా ఉన్నట్టు అనిపించడం, మత్తుగా ఉండడం, బరువు కోల్పోవడం, కాళ్ల వాపు లాంటి లక్షణాలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి. ఆలస్యం చేయడం వల్ల కాలేయ సిర్రోసిస్ లేదా కాలేయ కేన్సర్‌లకు గురి కాక తప్పదు. ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలిని అనుసరిస్తూ, మద్యపానం మానుకుని, మధుమేహాన్ని అదుపులో ఉంచుకుంటూ హెపటైటిస్ పరీక్షలు క్రమం తప్పక చేయించుకుంటూ అవసరాన్ని బట్టి వైద్య సహాయం తీసుకోగలిగితే కాలేయ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.

డాక్టర్ నవీన్ పోలవరపు
చీఫ్ లివర్ స్పెషలిస్ట్,
అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్.

స్ఫూర్తి

'ఎలాగైనా సివిల్స్ కొట్టాలి'. యువత ఆశించే లక్ష్యమిది. కానీ ఎక్కువ మంది రెండు, మూడు అపజయాలు ఎదురవగానే, కెరీర్ బ్రేక్ భయంతో, తోచిన ఉద్యోగంతో రాజీ పడిపోతూ ఉంటారు. కానీ పొన్నూరుకు చెందిన భవ్య వట్టికూటి ఇందుకు పూర్తి భిన్నం. ఎంచుకున్న లక్ష్యాన్ని అందుకోవడం కోసం ఏకంగా ఆరేళ్ల పాటు కృషి చేసి, అంతిమంగా ఏడాది వ్యవధిలోనే మూడు ప్రభుత్వోద్యోగాలకు ఎంపికై అరుదైన విజయాన్ని సొంతం చేసుకోగలిగింది. ప్రస్తుతం పూణెలో రెండేళ్ల ఐఆర్ఎమ్ఎస్ ట్రైనింగ్‌లో కొనసాగుతున్న భవ్య 'నవ్య'తో తన అనుభవాన్ని ఇలా పంచుకుంది.





ఒకే ఏడాదిలో...
మూడు ప్రభుత్వోద్యోగాలు

చిన్నప్పటి నుంచే సివిల్స్ మీద ఆసక్తి ఏర్పడింది. మరీ ముఖ్యంగా స్మితా సబర్వాల్, రాజ కుమారి లాంటి మహిళా ఐఎఎస్ అధికారుల గురించి తెలిసిన తర్వాత కచ్చితంగా నేను కూడా అలాంటి ఉన్నతాధికారిగా ఎదిగి తీరాలనే కోరిక బలపడింది. కానీ అందు కోసం ఏ దారిని ఎంచుకోవాలో తెలియలేదు. ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్ తీసుకుందామనుకున్నాను. కానీ డిగ్రీ చదివితే, మూడేళ్లకే పూర్తి చేసి, త్వరగా సివిల్స్‌కు ప్రిపేర్ అయిపోవచ్చు అనిపించింది. ఒకవేళ సివిల్స్‌లో నెగ్గలేకపోతే, ప్లాన్ బిలో భాగంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకోవచ్చనే ఆలోచనతో బిటెక్‌ను ఎంచుకోక తప్పలేదు. అలా 2016లో బిటెక్ పూర్తి చేసిన వెంటనే సివిల్స్ కోచింగ్ కోసం ఢిల్లీ వెళ్లిపోయాను. ఆ తర్వాత మొదటిసారి రాసిన సివిల్స్ పరీక్షలో నెగ్గలేకపోయినా, రెండోసారి ఇంటర్వ్యూ వరకూ వెళ్లగలిగాను. కానీ ఆ ఇంటర్వ్యూలో ఆరు మార్కుల తేడాతో నేను ఎంపిక కాలేకపోయాను. ఆ తర్వాత మూడోసారి, నాలుగోసారి, ఐదోసారి కూడా సివిల్స్ రాశాను. కానీ అన్నిసార్లూ విఫలమయ్యాను. చివరి ప్రయత్నంగా ఆరోసారి రాసిన సివిల్స్‌లో నాకు అదృష్టం వరించింది. అంతిమంగా అనుకున్న లక్ష్యాన్ని అందుకోగలిగాను.

కుంగుబాట్లను అధిగమించి...

సాధారణంగా ఎవరైనా ఒకట్రెండు సార్లు ఫెయిలైతే ప్రయత్నించడం మానేస్తారు. కానీ నేను ఎక్కడ పొరపాటు జరిగిందో కనిపెట్టి, దాన్ని అధిగమించి, సివిల్స్‌లో నెగ్గాలనే పట్టుదలను పెంచుకున్నాను. రెండోసారి ఇంటర్వ్యూ వరకూ వెళ్లగలిగినా, 3, 4, 5.. ఈ మూడు ప్రయత్నాల్లో మెయిన్స్‌లో విఫలమవుతూ వచ్చాను. దాంతో ఒత్తిడికీ, కుంగుబాటుకూ లోనయ్యాను. అయినా పట్టుదలను మాత్రం వదల్లేదు. మొదటిసారి రాస్తున్నప్పుడు మినహా తర్వాత ఎప్పుడూ నేను ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. సొంతగానే ప్రిపేర్ అయ్యాను. అలాగని రోజంతా చదివేదాన్ని కాదు. రోజులో ఏడు గంటలు చదువు కోసం కేటాయించేదాన్ని. పరీక్షలు దగ్గర పడుతున్నప్పుడు అంతకంటే ఎక్కువ సమయాన్ని వెచ్చించేదాన్ని. ఏం చదవాలో, ఎంత పోర్షన్ పూర్తి చేయాలో లక్ష్యంగా పెట్టుకుని, అందుకు తగ్గట్టు ప్రిపేర్ అయ్యేదాన్ని.

అందరూ చేసే పొరపాటు అదే...

కెరీర్ బ్రేక్ వస్తుందనే భయంతో సివిల్స్ నుంచి పక్కకు తప్పుకునే వాళ్లను నేను చూశాను. ఏ ప్రభుత్వ పరీక్షను ఎంచుకున్నా, దీర్ఘకాలం కష్టపడితే తప్ప విజయం సాధించలేని పరిస్థితి. అలాంటప్పుడు అంత సమయం వెచ్చించగలం అనుకున్నప్పుడే ఆ పరీక్షలకు సిద్ధపడాలి. అందు కోసం మన ఆర్థిక పరిస్థితులను కూడా బేరీజు వేసుకోవాలి. సంపాదన లేకుండా అన్నేళ్ల పాటు పరీక్షలకు సిద్ధపడగలగాలి. అంతిమంగా విజయం సాధించేవరకూ లక్ష్యం నుంచి తప్పుకోకూడదు. అలా కాకుండా కొంతమంది ఒకట్రెండేళ్లు ప్రయత్నించి వదిలేసి, ప్రయత్నాన్ని కొనసాగించాలా లేక చేతికందిన ఉద్యోగంతో సరిపెట్టుకుందామా అనే సందిగ్ధంలో పడిపోతూ ఉంటారు. ఒకవేళ సివిల్స్ ప్రయత్నాలు మానుకుని వేరే వృత్తిని ఎంచుకున్నా, దాన్లో మనసును నిమగ్నం చేయలేకపోతే రెండు విధాలా నష్టపోయిన వాళ్లం అవుతాం. కాబట్టి సివిల్స్‌కు పక్కా ప్లానింగ్ అవసరం. నిజానికి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న సమయంలో మంచి ప్యాకేజీలతో నాకు కూడా మంచి ఉద్యోగావకాశాలు వచ్చాయి. అయినా రాజీ పడకుండా, లక్ష్యానికే కట్టుబడి ఉండిపోయాను. ఆరుసార్లు ప్రయత్నించే వీలున్నప్పుడు, అన్నిసార్లూ ప్రయత్నించి విఫలమైతే, అప్పుడు మనసు మార్చుకోవచ్చనేది నా ఉద్దేశం. సివిల్ సర్వీసెస్‌లో ఐఎఎస్‌గా ఎంపికవ్వాలి అనేది నా లక్ష్యం. కానీ ర్యాంక్‌ను బట్టి నేను ఐఆర్ఎమ్ఎస్ (ఇండియన్ రైల్వే మ్యానేజ్‌మెంట్ సర్వీసెస్)కు ఎంపికయ్యాను. ఇంతకు ముందు రైల్వే ట్రాఫిక్, రైల్వే పోలీస్.. ఈ రెండు మాత్రమే సివిల్ సర్వీసెస్‌లో ఉండేవి. ట్రాఫిక్‌తో పాటు ఏకంగా ఏడు రైల్వే సర్వీసులన్నిటినీ కలిపి యుపిఎసిలో ఐఆర్ఎమ్ఎస్ అనే ఒక ప్రధాన సర్వీసుకు 2020లో రూపకల్పన జరిగింది. ఈ సర్వీసుకు సంబంధించిన తొలి బ్యాచ్‌కు నేను ఎంపికయ్యాను. రెండేళ్ల పాటు కొనసాగే ఈ ట్రైనింగ్‌లో భాగంగా నేను రైల్వేస్‌కు సంబంధించిన ఏడు విభాగాల్లో శిక్షణ పొందబోతున్నాను.

> **మాది గుంటూరు జిల్లా పొన్నూరు. ఇంటర్ పొన్నూరులో, బిటెక్ గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్శిటీలో పూర్తి చేశాను. బిటెక్‌లో గోల్డ్ మెడల్ కూడా సాధించాను. నా విజయం వెనక కుటుంబ తోడ్పాటు, మరీ ముఖ్యంగా అమ్మ పద్మజ కృషి ఎంతో ఉంది. నేను అపజయం పొందిన ప్రతిసారీ నా కుటుంబం నన్ను భుజం తట్టి పోత్రహించిందే తప్ప, కెరీర్‌లో రాజీ పడిపోయేలా నన్ను ఒత్తిడి చేయలేదు. ఒకవేళ అదే జరిగి ఉంటే, నేను ఏదో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతో సరిపెట్టుకునేదాన్నేనేమో! నాన్న లీలా ప్రసాద్ లాయర్. చెల్లి లీగల్ ఆఫీసర్.**

ఒక్క దెబ్బకు మూడు పిట్టలు

2020లో రాసిన సివిల్ సర్వీసెస్ ఫలితం 2023 నవంబర్‌లో వచ్చింది. ఆరో ప్రయత్నంలో భాగంగా రాసిన ఈ చివరి పరీక్షలో నేను ఐఆర్ఎమ్ఎస్‌కు ఎంపికయ్యాను. కానీ ఈ ఫలితం వచ్చేలోగానే నన్ను ప్రభుత్వోద్యోగాలు వరించాయి. మొదట 2022లో ఎమ్‌పిడిఒ అవకాశం వచ్చింది. అదే ఏడాది నవంబరులో ఎమ్‌పిడిఒ శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టాను. ఆ సమయంలోనే, 2023 ఆగష్టులో స్పోర్ట్స్ అథారిటీలో అసిస్టెంట్ డైరెక్టర్ ఉద్యోగాన్ని సాధించేశాను. దాంతో ఎమ్‌పిడిఒ శిక్షణ ముగిసిన వెంటనే, అక్టోబర్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ ఉద్యోగంలో చేరిపోయి, 2024 జనవరి వరకూ విధుల్లో కొనసాగాను. గత ఏడాది నవంబరు సివిల్స్ ఫలితాల్లో ఐఆర్ఎమ్ఎస్‌కు ఎంపికవడంతో, ఆ ట్రైనింగ్ కోసం పిలుపు వచ్చే వరకూ స్పోర్ట్స్ అథారిటీలో కొనసాగి, చివరకు రాజీనామా చేశాను. ఇలా ఏడాది వ్యవధిలోనే మూడు ప్రభుత్వోద్యోగాలకు ఎంపిక కాగలిగాను.

స్వీయ నియంత్రణ అవసరం

మన లక్ష్యానికి దూరం చేసే అంశాలు మన చుట్టూరా లెక్కలేనన్ని ఉంటాయి. మరీ ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ లాంటి వాటితో చాలా సమయం వృథా అయిపోతూ ఉంటుంది. వీటి విషయంలో స్వీయ నియంత్రణను మించిన ఉత్తమమైన సాధనం ఇంకొకటి ఉండదని నా అభిప్రాయం. నా వరకు నేను పరీక్షలు దగ్గర పడే సమయంలో వీటిని అన్ ఇన్‌స్టాల్ చేసేసేదాన్ని. అలాగని సోషల్ మీడియా నిరుపయోగమైనది అని కూడా అనడానికి లేదు. దీన్లో కూడా జ్ఞానాన్ని పెంచుకునే అవకాశాలుంటాయి. అయితే దాన్ని మనం మన లక్ష్యానికి తగ్గట్టు ఎంత వరకూ ఎంత సమయం మేరకు సద్వినియోగం చేసుకుంటున్నాం అనేది ఎవరికి వారు ఆలోచించుకోవాలి. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే సమయంలో రిలాక్సేషన్ కోసం కూడా నేను సమయాన్ని కేటాయించుకునేదాన్ని. ఆ సమయంలో సోషల్ మీడియాలో జ్ఞానాన్ని పెంచే అంశాలకే ప్రాధాన్యం ఇచ్చేదాన్ని. అలాగే నేను తెలుగు నవలలు ఎక్కువగా చదువుతూ ఉంటాను. రూబిక్ క్యూబ్స్ పరిష్కరించడం ఇష్టం. అలాగే సినిమాలు కూడా చూస్తూ ఉంటాను. ఒత్తిడి మరీ ఎక్కువగా ఉంటే ధ్యానం చేస్తాను. సివిల్స్‌కు సిద్ధపడాలంటే మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన ఆహారం... ఈ రెండూ అవసరం అని నా అభిప్రాయం.

నా ముద్ర కచ్చితంగా ఉంటుంది

ఉద్యోగం ఎంత చిన్నదైనా, పెద్దదైనా మనదైన ముద్ర వేయగలిగే అవకాశం కచ్చితంగా ఉంటుంది. గతంలో నేను ఎమ్‌పిడిఒగా ఉన్నప్పుడు, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత మెరుగ్గా అందించగలిగే చిన్న చిన్న కార్యక్రమాలకు నేను పూనుకోగలిగాను. ఆరేళ్ల పాటు సివిల్స్‌కు కష్టపడ్డాను కాబట్టి ఈ క్రమంలో నేను పెంపొందించుకున్న జ్ఞానాన్నీ నేను అందుకోబోయే వృత్తిలో ఉపయోగించి, నాదైన ముద్రతో మార్పు తీసుకురావాలని నేను ఆశిస్తున్నాను.

• గోగుమళ్ల కవిత

ఇతరులకు సేవ చేయాలంటే మనసుండాలి. ముఖ్యంగా సమాజం పట్ల ప్రేమ ఉండాలి. పనిమీద అంకితభావం ఉండాలి. మూడు పదుల వయసులోనే సమాజం పట్ల పెద్ద మనసు చేసుకున్న అరుదైన వ్యక్తి ఈ రామ తులసి. 'వివేకానంద సేవాశ్రమం'లో అభాగ్యులకు అండగా నిలుస్తోందీమె. అంతేనా వివేకానంద ఫౌండేషన్ తరపున సామాజిక సేవకోసం నేను సైతం... అంటూ పాటుపడుతున్న రామ తులసిని 'నవ్య' పలకరించింది.

నా జీవితం సేవకే అంకితం

"వివేకానంద సేవాశ్రమం స్థాపించి నాలుగేళ్లయ్యింది. ఈ ఆశ్రమం కడప జిల్లాలోని కాశినాయన మండలంలోని ఓబుళాపురం గ్రామంలో ఉంది. అది కూడా సగిలేరు ఒడ్డున ఉంది. ప్రకృతి మధ్య ఉండే అందమైన ప్రదేశమిది. దిక్కు మొక్కూలేని వారిని ఆదరించి.. అన్నంపెట్టి.. వారికి జీవితం పట్ల ప్రేమ కలిగించటమే మా ఉద్దేశ్యం. ఇక్కడ ఉండేవాళ్లు వృద్ధులూ కాదు.. అనాథలూ కాదు.. కేవలం సాటి మనుషులుగా చూస్తాం. వేళకు తిండి పెడతాం.. ప్రేమగా చూసుకుంటాం. ఆశ్రమంలో ఉండే పదిహేడు మందిలో ఒక్కదాన్నై కలసిపోతా. ఎందుకో తెలీదు.. వారి పట్ల దయ కంటే.. ప్రేమ ఉంటుంది నాకు!

అలా నా వంతు..

2010 సంవత్సరం నుంచి మా ఆయన పాపిజెన్ని రామకృష్ణారెడ్డి 'వివేకానంద ఫౌండేషన్' నడిపిస్తున్నారు. తన భావాలంటే ఇష్టం. అందుకే ఆ సమయంలోనే వలంటీర్‌గా చేరా. తన గురించి తెలిసే పెళ్లికి అంగీకరించా. 2014లో మా పెళ్లి జరిగింది. ఫౌండేషన్‌ను మరింత దగ్గరగా చూశాక.. ఇంత కష్టపడాలా? మనవల్ల అవుతుందా? అనుకున్నా. పుట్టింటోళ్లు 'మా పిల్ల ఈ పనులు చేయలేదమ్మా' అన్నట్లు మాట్లాడారు. అంత త్వరగా సేవ చేయటానికి మనసు రాలేదు. మా వారి ఆశయాలు, ఆయన చేసే సేవతో పాటు మీడియాలో మానవీయ కథనాలను చూసినపుడు చలించిపోయేదాన్ని. నా వంతూ సమాజానికి ఏదోటి చేయాలని అనిపించిందలా. మెల్లమెల్లగా వివేకానంద ఫౌండేషన్‌కు పూర్తి స్థాయిలో పని చేయటం ప్రారంభించా. దిక్కులేని వారికి ఓ షెల్టర్ కడితే బావుంటుందని మా ఆయనకు చెప్పా. 'కట్టిద్దాం' అన్నారు. ఆయనది రైల్వే ఉద్యోగం. చాలీచాలని జీతం. దీంతో డబ్బుల్లేవని ఊరుకున్నారు. ఆ సమయంలో దాతలెవరూ ముందుకు రాలేదు. ఏ మాత్రం ఆలోచించకుండా.. పది తులాల బంగారు ఆభరణాలను బ్యాంకులో పెట్టమని మా ఆయనకిచ్చా. రెండున్నర లక్షల రూపాయలొచ్చాయి. అలా ఆశ్రమానికి నా వంతు పునాదిరాయి వేశా. ఆ తర్వాత దాతలు ముందుకు వచ్చారు.




అంత్యక్రియలు చేయవద్దన్నారు..

నాకిద్దరు కొడుకులు. మేమంతా ఆశ్రమంలోనే ఉంటాం. అనారోగ్యంతో బాధపడేవారికి సేవలు చేస్తాం. మేం ఎవరి పెళ్లిళ్లకూ పోము. ఎందుకంటే ఆశ్రమం చూసుకోవటం కష్టం కదా! అందరిలా బంగారు ఆభరణాలు ధరించాలనే ఆశ నాకేమీ లేదు. ఉన్నంతలో పదిమందికి సేవ చేయాలనే ఆలోచన తప్ప. మా ఆయన జీతాన్నంతా ఆశ్రమం కోసమే కేటాయిస్తారు. దీంతో నాకు నిస్వార్థ గుణం వచ్చింది. నా ఇద్దరు పిల్లలూ అంతే. ఒక రోజు నా కంటి ఆరోగ్యం బాలేదు. మా ఆయనకు కాలు బెణికింది. మేం ఇద్దరం ఆస్పత్రికి వెళ్లాం. ఆ రోజు మా ఇద్దరు పిల్లలే ఆశ్రమాన్ని చూసుకున్నారు. వారిలో సేవాగుణం ఉన్నందుకు సంతోషపడ్డాం. చిన్నప్పటి నుంచీ నాకో భయం ఉండేది. ఎవరైనా చనిపోతే కనీసం చూడటానికి కాదు కదా..! వాళ్ల ఇంటి వైపు వెళ్లాలన్నా భయమే. అలాంటి నేను ఆశ్రమంలోని వాళ్లు అనారోగ్యంతో చనిపోతే శవాలనూ మోశాను. కరోనా సమయం నుంచి ఇప్పటికి నలభై మూడు మంది చనిపోతే వారి అంత్యక్రియలు దగ్గరుండి చేశాం. 'ఆడపిల్లవై ఉండి.. ఇలాంటివి నీకెందుకూ? అవసరమా?' అన్నారు కొందరు. అంతవరకూ ఆశ్రమంలో అవ్వ, తాతలతో కలిసిమెలిసి ఉండే నేను.. వారి కడచూపు దాకా ఉండకుంటే ఎలా? అందుకే అంత్యక్రియలకూ ముందుంటాను.

ఆ ఆనందం వెలకట్టలేనిది..

వృద్ధాశ్రమం, అనాథాశ్రమం పేర్లతో మా ఆశ్రమాన్ని పిలవకూడదంటాం. ఎందుకంటే ఇదో సేవాశ్రమం. ఎవరైనా పిల్లలు పట్టించుకోకపోతే కొందరు మా దగ్గరకు వస్తారు. వెంటనే వాళ్ల పిల్లల దగ్గరకు వెళ్లి మాట్లాడి కౌన్సెలింగ్ ఇస్తాం. పేరెంట్స్‌ను చూసుకోవటం బాధ్యత అని చెబుతాం. కొందరు పిల్లలను దత్తత తీసుకుని చదివించాం. వాళ్లు ఇపుడు మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడేవారినీ, మతిస్థిమితం లేని వాళ్లు ఎక్కడున్నా ఆశ్రమానికి తీసుకొచ్చి సేవలందిస్తాం. ఓ మాజీ ఎమ్మెల్యే కూతురు ఆశ్రమానికి వచ్చింది. ఆమె తండ్రి చనిపోయారు. ఆమె కొడుకూ చనిపోవటంతో.. మా ఆశ్రమం గురించి తెలుసుకుని వచ్చింది. ఫాతిమా అనే ఒకామె రోడ్డుమీద మాకు కనపడింది. కళ్లు కనపడవు. ఆశ్రమానికి తీసుకొచ్చి... కంటి శుక్లాల ఆపరేషన్ చేయించాం. కళ్లు తెరుస్తూనే నన్ను, మా కుటుంబాన్ని చూసింది. 'నిండు నూరేళ్లు బతకాలమ్మా' అంటూ దీవించింది. ఆమె కళ్లలోనే ఆనందాన్ని చూశాక.. ఈ జీవితానికి ఇదే కదా కావాల్సింది అనిపించింది. ఆ ఆనందం వెలకట్టలేనిది. మాటల్లో చెప్పలేను. ఇలాంటి ఆత్మానందాలు ఎన్నో పొందాను!





కడప జిల్లాలోని కలసపాడు మండలంలోని తెల్లపాడు మా గ్రామం. ఇంటర్ చదివేపుడు మా ఊరిలో సారా కాసేవాళ్లు. ఆ సారా తాగిన వాళ్లు చనిపోయేవాళ్లు. స్నేహితులతో కలసి ఆ సారా బట్టీలను పగలగొట్టా. ఆ తర్వాత తాగేవాళ్లు, సారా కాచేవాళ్లు మా మీద దాడిచేశారు. అయినా సారాపై ఉద్యమం ఆపలేదు. మా ఊరిలోనే ఆపలేకపోతే.. మనం ఉండి ఉపయోగమేలేదని అనుకున్నాం. ఎంతో కష్టపడి సంపూర్ణ మద్యపాన నిషేదం చేశాం మా ఊళ్లో. కాలేజీ రోజుల్లోనే స్వామి వివేకానంద గురించి తెలుసుకున్నాక.. సమాజానికి సేవ చేయాలన్న ఆలోచన పుట్టింది. వివేకానంద ఫౌండేషన్‌లో ఇప్పటి వరకూ 3500 మంది విద్యార్థులకు బడి కిట్లు అందించాం. సుమారు 7000 మందికి కెరీర్ గైడెన్స్‌తో పాటు మోటివేషన్ క్లాసులు నిర్వహించాం. పిల్లలకు పెద్దబాలశిక్షలా బేసిక్స్ నేర్పించేందుకు 'విజ్ఞానదీపిక' పుస్తకాన్ని అచ్చువేశాం. కలామ్ జీవితం, సందేశాలను చెబుతూ 'కలామ్ సలామ్'.. వీటితో పాటు 'సేవాంజలి', 'కెరీర్ గైడెన్స్' పుస్తకాలు ప్రచురించాం. చలికాలంలో దుప్పట్లు, అన్నదానం, రక్తదానం.. ఇలా అనేక సహాయ కార్యక్రమాలు ప్రతి ఏడాది చేస్తాం. సేవను గుర్తించి డెబ్బయ్ అవార్డులు వచ్చాయి. అవార్డులకంటే సాటి మనిషికి సాయపడినప్పుడు.. వారిలో కలిగే ఆనందమే.. మాకు అసలైన అవార్డ్!


- పాపిజెన్ని రామకృష్ణా రెడ్డి
వివేకానంద సేవాశ్రమం, కడప జిల్లా

ఒకే కుటుంబంలా ఉంటాం..

ఆశ్రమంలో దాదాపు అన్ని సదుపాయాలూ ఉన్నాయి. శరీరం సహకరించని వారికి కూడా ఇక్కడ వసతులు ఉన్నాయి. ఎవరికైనా ఉచితంగా సేవ చేస్తాం. ఒక్క రూపాయి కూడా తీసుకోం. ముఖ్యంగా ఇక్కడ ఉండేవారిలో సంతోషం చూడాలన్నదే మా కోరిక. ఆశ్రమంలోని వారంతా ఒకే కుటుంబంలా ఉంటాం. కష్టాలైనా, నష్టాలైనా వీళ్లతోనే. ఒంటరిగా ఉన్నామనే ఫీలింగ్ ఎప్పుడూ కలగదు. నాకెలాంటి ఆశల్లేవు. నా భర్త అనుభవాలు గొప్పవి. చిన్నవయసులోనే సామాజిక సేవలోకి వచ్చారాయన. ఆయనే నా బలం. మా వారి అడుగుజాడల్లో నడుస్తున్నానంతే. మనిషిగా పుట్టి.. సాటి మనిషికి సాయపడకుంటే.. ఈ జీవితానికే అర్థం లేదంటాన్నేను. బడిలో మా సేవలు పొందిన కొందరు పిల్లలు ఫౌండేషన్‌లో వలంటీర్లుగా పని చేస్తున్నారు. ఎంతో మంది ఫౌండేషన్‌కు సహకారం అందిస్తున్నారు. విదేశాలనుంచీ ఆర్థిక సాయం అందుతోంది. నా జీవితం సామాజిక సేవకే అంకితం!"

• రాళ్లపల్లి రాజావలి

రాణీ ముఖర్జీ.. క్లాస్ యాక్టింగ్‌కు పెట్టింది పేరు. 'కుచ్ కుచ్ హోతా హై' నుంచి ఆమె నటనకు ప్రశంసలెన్నో. అత్యధిక పారితోషికం తీసుకునే నటి.. అంతేనా బాలీవుడ్‌లో ఇప్పటికీ ఆమె ఇమేజ్ తగ్గలేదు. ఇటీవలే 'బిజినెస్ వరల్డ్' మ్యాగజైన్ 'మోస్ట్ ఇన్‌ఫ్లూయన్స్ ఉమెన్' పేరుతో ఓ సంచిక తెచ్చింది. ఇందులో రాణీ ముఖర్జీ కూడా ఉంది. ఈ సందర్భంగా బాలీవుడ్ రాణి గురించి కొన్ని విశేషాలు..



పవర్‌ఫుల్ రాణి

రాణీముఖర్జీ పేరు వినగానే 'కుచ్ కుచ్ హోతా హై', 'సాథియా', 'చల్తే చల్తే', 'హమ్ తుమ్' లాంటి చిత్రాలతో పాటు 'బ్లాక్', 'మర్దానీ', 'హిచ్కీ', 'మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే' లాంటి పవర్‌ఫుల్ పాత్రలూ గుర్తొస్తాయి. ఏకంగా ఎనిమిది ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్న నటి. ఇక మహిళా దర్శకుల విషయానికొస్తే.. మీరా నాయర్, జోయా అక్తర్.. లాంటి వారిని అభిమానిస్తుంది. ఎందుకంటే 'ఆ డైరక్టర్లలో మహిళను చూపించే విధానం నచ్చుతుంది' అంటుంది రాణీ ముఖర్జీ.

తను నన్ను అర్థం చేసుకుంటుంది...

రాణీ ముఖర్జీ వ్యక్తిగత జీవితాన్ని పబ్లిక్‌గా మాట్లాడదు. సోషల్ మీడియాలో ఉండదు. 'నా కూతురు ఫొటో, వ్యక్తిగత విషయాలు షేర్ చేయటానికి ఇష్టమే ఉండదు' అంటుంది. దీంతో ఆమె విషయాలు తెల్సుకోవటానికి ఆసక్తి చూపిస్తుంటారు అభిమానులు. కొందరు వీరాభిమానులు ఫేక్ అకౌంట్స్‌తో ఆమె విశేషాలు సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. ఇకపోతే.. దర్శకుడు, నిర్మాత.. ఆదిత్య చోప్రాతో పెళ్లి.. ఆ తర్వాత కూతురు పుట్టడం వల్ల.. తక్కువగా సినిమాల్లో నటిస్తోంది. రాశి కంటే వాసికే ప్రాధాన్యత ఇస్తోంది.. 'నా కూతురు పరిణతితో ఆలోచిస్తుంది. నటిగా బిజీగా ఉన్నప్పుడు అర్థం చేసుకుంటుంది. ఆలస్యంగా వచ్చినా ఇబ్బంది పెట్టదు. తను క్యూట్ గాళ్' అంటుంది రాణీ. 'నా పేరెంట్స్‌తో పాటు బంధువులూ సినిమా నేపథ్యముంది. అయితే ఏనాడూ ఎవరిమీదా ఆధారపడలేదు. నా బ్లడ్‌లోనే భయం లేదు. కెరీర్, పెళ్లి.. ఇలా అనుకున్నట్లే జరిగాయి' అంటుందామె.



అందుకే మహిళా ప్రాధాన్యత...

'కథలు వింటుంటే.. ఆ పాత్ర పూర్తి చిత్రాన్నే నడిపిస్తుంది అనుకున్నప్పుడు ఇక ఏమాత్రమూ ఆలోచించను. ఒక్కమాటలో కథలే మనల్ని ఎంచుకుంటాయి అనిపిస్తుంది. కథే మాట్లాడాలి.. మనం కాదు. ఏదేమైనా సినిమా ప్రభావం సమాజం మీద ఉంటుంది. అందుకే పవర్‌ఫుల్ పాత్రల్లో నటించటానికి ఇష్టపడతా. కొందరు స్ఫూర్తిగా తీసుకుంటారు. ప్రేక్షకుల మైండ్ సెట్ మారుతుంది. ఈ కారణం వల్లనే మహిళా ప్రాధాన్యత చిత్రాల్లో నటిస్తా'నంటోందీమె. 'కథకూ.. పాత్రకూ సంబంధం ఉండాలి. లేకుంటే కష్టం. నేను నటించిన ఉమెన్ సెంట్రిక్ పాత్రలను ఆడియన్స్ యాక్సెప్ట్ చేశారు. నేను నటించిన చిత్రాల్లో 'మర్దానీ'లో పోలీస్ పాత్ర అంటే చాలా ఇష్టం. బేసిక్‌గా పురుషభావజాలం ఉండే సమాజమిది. నిజజీవితంలోని ఓ పోలీస్ ఆఫీసర్ కథ ఇది. మహిళగా ఆమె బలం, కెరీర్‌తో పాటు జీవితాన్ని బ్యాలెన్స్ చేసే విధానం, పట్టుదల.. విన్నాక ఆ పాత్ర చేయాలనిపించింది. కథ విన్నప్పుడే నటించేప్పుడు పాత్రను ఎంజాయ్ చేస్తూ నటించాను' అంటుంది రాణీ ముఖర్జీ. రాణీ ముఖర్జీ తనకు తాను సెల్ఫ్ మోటివేట్ పర్సన్ అని చెబుతుంది. 'ప్రశంసలు బావుంటాయి. అయితే పాజిటివ్ థింకింగ్, దేన్నీ పట్టించుకోని తత్వం, ధైర్యమే నన్ను నడిపిస్తున్నాయి' అంటుందామె. అందుకే రాణీ పవర్‌ఫుల్ మాత్రమే కాదు.. స్ఫూర్తిమంత్ర కూడా!

రూ.5,000 కోట్లతో
గుజరాత్‌లో రెండో యూనిట్
వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 3 లక్షల యూనిట్లకు పెంపు.. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా

ముంబై: రూ.5,000 కోట్ల పెట్టుబడితో వాహన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోనున్నట్లు జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా బుధవారం ప్రకటించింది. అలాగే, ఈ సెప్టెంబరు నుంచి ప్రతి 3-6 నెలలకు ఒక కొత్త మోడల్ కారును మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. చైనాకు చెందిన అతి పెద్ద వాహన తయారీ సంస్థ ఎస్‌ఏఐసీ, భారత వ్యాపార దిగ్గజాల్లో ఒకటైన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఉమ్మడి భాగస్వామ్యంలో (జేవీ) కొత్తగా ఏర్పాటైన కంపెనీయే జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా. సంప్రదాయ ఇంధన కార్ల విభాగంలో మారుతి తరహాలోనే ఈవీల విభాగంలో ఈ జేవీని అగ్రగామిగా తీర్చిదిద్దాలని అనుకుంటున్నట్లు జేవీ ప్రారంభంతోపాటు కొత్త లోగో ఆవిష్కరణ సభలో మాట్లాడుతూ జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ తెలిపారు.

గత ఏడాది నవంబరులో ఎస్‌ఏఐసీ, జేఎస్‌డబ్ల్యూ మధ్య కుదిరిన ఒప్పందం మేరకు కొత్తగా ఏర్పాటైన జేవీలో జేఎస్‌డబ్ల్యూ 35 శాతం, ఇండియన్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఐఎఫ్ఐ) 8 శాతం వాటాలు కలిగి ఉంటే, ఎంజీ మోటార్ డీలర్లు 3 శాతం, ఉద్యోగులు 5 శాతం వాటా కలిగి ఉంటారు. మిగతా 49 శాతం వాటా ఎస్‌ఏఐసీ చేతుల్లో ఉండనుంది. తద్వారా కంపెనీలో మెజారిటీ వాటా భారత సంస్థలు, వ్యక్తుల చేతుల్లోనే ఉంటుంది. బ్రిటిష్ కార్ల బ్రాండ్ ఎంజీ మోటార్‌ను ఎస్‌ఏఐసీ గతంలో కొనుగోలు చేసింది. 2019లో భారత్‌లోకి ప్రవేశించిన ఎంజీ మోటార్ ఇండియా.. దేశంలో కార్ల తయారీ ప్లాంట్ ఏర్పాటు కోసం రూ.7,000 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఇప్పటివరకు దాదాపు 2 లక్షల కార్లను విక్రయించింది.

2030 నాటికి 10 లక్షల ఈవీల విక్రయ లక్ష్యం

2030 నాటికి ప్యాసింజర్ ఎలక్ట్రిక్ వాహనాల వార్షిక విక్రయాలను 10 లక్షల యూనిట్లకు పెంచుకోవాలని ఈ జేవీ లక్ష్యంగా పెట్టుకుంది. అప్పటికల్లా దేశంలో ఈవీల వార్షిక విక్రయాలు కోటి యూనిట్లకు చేరుకోవచ్చని అంచనా. ఉత్పత్తి విస్తరణ కోసం గుజరాత్‌లోని హలోల్ వద్దనున్న ప్రస్తుత ప్లాంట్‌కు సమీపంలోనే రెండో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎంజీ మోటార్ ఇండియా గౌరవ్ చైర్మన్ రాజీవ్ చాబా తెలిపారు. తద్వారా కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం లక్షకు పైగా యూనిట్ల నుంచి 3 లక్షలకు పైకి చేరుకోనుందన్నారు. ఉత్పత్తి పెంపుతోపాటు కొత్త మోడళ్లను అందుబాటులోకి తెచ్చేందుకు వాటాదారులందరూ కలిసి రూ.5,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. కొత్త మోడల్ కార్లను అభివృద్ధి చెందిన దేశాలకూ ఎగుమతి చేయనున్నట్లు సజ్జన్ జిందాల్ తెలిపారు.

ఒడిశాలో జేఎస్‌డబ్ల్యూ వాణిజ్య ఈవీ, బ్యాటరీల తయారీ ప్లాంట్

రూ.40,000 కోట్ల పెట్టుబడులతో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్ వెహికిల్ అండ్ ఈవీ బ్యాటరీ మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసేందుకు గతనెల జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఒడిశా ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. అయితే, ఒడిశాలో ఏర్పాటు చేయబోయే ప్రాజెక్ట్‌కు ఈ జేవీతో సంబంధం లేదని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ స్పష్టం చేసింది. ఒడిశాలో వాణిజ్య ఈవీల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఒకవేళ అవసరమైతే, భవిష్యత్‌లో ఈ జేవీ ఉత్పత్తి అవసరాలను కూడా తీర్చనుందన్నారు. అయినప్పటికీ, ఈ జేవీకి అవసరమైన బ్యాటరీ ప్యాక్‌లను మాత్రం ఈ ప్లాంట్ నుంచే సరఫరా చేయనున్నట్లు జిందాల్ తెలిపారు.

లిథియం మైనింగ్‌లోకి జేఎస్‌డబ్ల్యూ

క్లిష్టమైన ఖనిజాలు, ముఖ్యంగా ఈవీ బ్యాటరీల తయారీకి అత్యంత కీలకమైన లిథియం మైనింగ్‌లోకి ప్రవేశించాలని జేఎస్‌డబ్ల్యూ చూస్తోంది. లిథియం గనుల వేలంలో తామూ పాల్గొంటామని సజ్జన్ జిందాల్ తెలిపారు.



ఎంజీ సైబర్‌స్టర్ ఆవిష్కరణ

పూర్తి ఎలక్ట్రిక్ కన్వర్టబుల్ రోడ్‌స్టర్ మోడల్ కారు ఎంజీ సైబర్‌స్టర్‌ను కంపెనీ ఆవిష్కరించింది. ఈ కారు కేవలం 3.2 సెకండ్లలో సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదని, సింగిల్ చార్జింగ్‌లో 580 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ వెల్లడించింది. ఈ ఏడాది ద్వితీయార్థానికల్లా అంతర్జాతీయ మార్కెట్లో విడుదల చేసే అవకాశం ఉంది. ధర రూ.53 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. అలాగే, ఎంజీ 4 ఈవీ హ్యాచ్‌బ్యాక్, ఎంజీ 5 మోడళ్లను సైతం కంపెనీ ప్రదర్శించింది.

ఈ ఏడాది 3 సార్లు వడ్డీ కోత
» అమెరికన్ ఫెడరల్ సంకేతం

వాషింగ్టన్: ఊహించిన విధంగానే అమెరికన్ ఫెడరల్ వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగించింది. దీంతో వడ్డీరేటు 5.25-5.5 శాతం వద్ద స్థిరంగా ఉంటుంది. ఫెడ్ చీఫ్ జెరోం పోవెల్ అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగిన సమావేశం ఈ మేరకు తీర్మానించింది. అయితే ఈ సంవత్సరం డిసెంబరులోపు మూడు సార్లు పావు శాతం చొప్పున వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉందని సూచనప్రాయంగా తెలిపింది. అదే జరిగితే 2020 మార్చి తర్వాత వడ్డీరేట్లు తగ్గించడం ఇదే మొదటిసారి అవుతుంది. గత ఏడాది జూలై నుంచి ఫెడ్ రిజర్వు వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగిస్తోంది. డిసెంబరు లోపు మూడు సార్లు ముప్పావు శాతం వడ్డీరేట్లు తగ్గిస్తామన్న ఫెడ్ రిజర్వు పరోక్ష సూచన ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లకు పెద్ద సానుకూల అంశం అవుతుందని భావిస్తున్నారు.

'బయోలాజికల్-ఇ'కి ఓసీవీ-ఎస్ టెక్నాలజీ బదిలీ

హైదరాబాద్: బయోలాజికల్-ఇ కంపెనీకి సింప్లిఫైడ్ ఓరల్ కలరా వ్యాక్సిన్ (ఓసీవీ-ఎస్) టెక్నాలజీ బదిలీని ప్రారంభించినట్టు ఇంటర్నేషనల్ వ్యాక్సిన్ ఇన్‌స్టిట్యూట్ (ఐవీఐ) ప్రకటించింది. టెక్నాలజీ బదిలీకి సంబంధించి ఎంఓయూపై ఉభయ సంస్థల మధ్య గత నవంబరులో సంతకాలు జరిగాయి. ఇందులో భాగంగా బీఈ ప్లాంట్లలో ఓసీవీ-ఎస్ తయారీ పరిజ్ఞానాన్ని ఐవీఐ అందిస్తుంది. అలాగే క్లినికల్ డెవలప్‌మెంట్, రెగ్యులేటరీ అనుమతులకు కూడా సహాయపడుతుంది. ఓసీవీ-ఎస్ వ్యాక్సిన్‌ను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల కోసం బీఈ ఉత్పత్తి చేస్తుంది. 2025 నాటికి టెక్నాలజీ బదిలీ పూర్తవుతుంది.

అంతర్జాతీయ సవాళ్లకు దేశీయ పరిష్కారాలు
» స్టార్టప్‌లకు ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఈ అవకాశాన్ని జారవిడుచుకోవద్దని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లను కోరారు. ఏఐ టెక్నాలజీకి సంబంధించిన నాయకత్వం భారతీయుల చేతుల్లోనే ఉండాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఏఐ సాయంతో మనవైన దేశీయ పరిష్కారాలు వెతకాలని ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లను ప్రధాని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న 'స్టార్టప్ మహాకుంభ్' సదస్సులో ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం ప్రారంభించిన ఇండియా ఏఐ మిషన్, సెమీకండక్టర్ విషన్, క్వాంటమ్ మిషన్లు యువకులకు ఉద్యోగ అవకాశాలతో పాటు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు పెట్టుబడి అవకాశాలు కల్పిస్తాయని అన్నారు.

సెన్సెక్స్ 90 పాయింట్లు అప్

ముంబై: మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీసీ, ఎస్‌బీఐ వంటి ప్రముఖ షేర్లలో కొనుగోళ్లతో బుధవారం సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 390 పాయింట్ల మేర ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 89.64 పాయింట్ల లాభంతో 72,101.69 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 21.65 పాయింట్ల పెరుగుదలతో 21,839.10 వద్ద క్లోజైంది. గ్లోబల్ మార్కెట్ల సానుకూల సంకేతాలతోపాటు ప్రత్యక్ష పన్నుల ఆదాయ గణాంకాలు ఆశాజనకంగా ఉండటం మార్కెట్ రికవరీకి దోహదపడగా.. రూపాయి క్షీణత, చిన్న షేర్లలో అమ్మకాల ఒత్తిడి లాభాలను పరిమితం చేశాయి.

2 నెలల కనిష్ఠానికి రూపాయి

భారత కరెన్సీ విలువ రెండు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 16 పైసలు తగ్గి రూ.83.19 వద్ద ముగిసింది.

ఆర్థిక మంత్రితో ఆర్‌బీఐ, సెబీ చీఫ్‌ల భేటీ



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ బుధవారం విడివిడిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. శక్తికాంత దాస్ అధ్యక్షతన ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) వచ్చే నెల 3-5 తేదీల్లో సమావేశమవుతోంది. కనీసం ఈ భేటీలో అయినా రెపో రేటు ప్రస్తుత 6.5 శాతం నుంచి అర శాతమైనా తగ్గించాలని పారిశ్రామిక వర్గాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ కేంద్ర ఆర్థిక మంత్రితో సమావేశం కావడం విశేషం. మార్చి 7న ఆల్ టైమ్ హైకి చేరిన సెన్సెక్స్, నిఫ్టీ గత కొద్ది రోజులుగా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతున్నాయి. సెబీ హెచ్చరికతో స్మాల్ అండ్ మిడ్ క్యాప్ షేర్లూ తీవ్ర ఆటుపోట్లకు లోనవుతున్నాయి. ఈ నేపథ్యంలో సెబీ చీఫ్ నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు.

ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌పై చర్యలు వద్దు: ఎన్‌సీఎల్ఏటీ

న్యూఢిల్లీ: పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీ, దాని అనుబంధ సంస్థలకు ఎన్‌సీఎల్ఏటీలో పెద్ద ఊరట లభించింది. తదుపరి విచారణ జరిగే మే 14 వరకు ఈ సంస్థలపైనా, వాటి డైరెక్టర్లపైనా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఎన్‌సీఎల్ఏటీ ప్రభుత్వ రంగంలోని 11 బ్యాంకులు, ఆర్థిక సంస్థలను ఆదేశించింది. ఎన్‌సీఎల్ఏటీ చైర్‌పర్సన్ జస్టిస్ అశోక్ భూషణ్ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల బెంచ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ లోపు ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ బకాయిలపై సమాధానం ఇవ్వాలని ఆర్‌బీఐ, ఆర్థిక సంస్థలు, బ్యాంకులను ఆదేశించింది. కొత్తగా ఏర్పడిన ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ బోర్డు దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌ను విచారించిన ఎన్‌సీఎల్ఏటీ బెంచ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

మిడ్ ప్రీమియం సెగ్మెంట్‌లో శామ్‌సంగ్ వాటా 18 శాతం



హైదరాబాద్: కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్ దిగ్గజం శామ్‌సంగ్ బుధవారం మిడ్ ప్రీమియం సెగ్మెంట్‌లో 5 జీ స్మార్ట్ ఫోన్లు గెలాక్సీ ఎ55, గెలాక్సీ ఎ35లను హైదరాబాద్ మార్కెట్లో విడుదల చేసింది. ఈ సందర్భంగా శామ్‌సంగ్ ఇండియా సీనియర్ డైరెక్టర్ గుఫ్రాన్ ఆలం మాట్లాడుతూ రూ.30,000 నుంచి రూ.50,000 సెగ్మెంట్లో తాము 18 శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నామని తెలిపారు. ఈ కొత్త స్మార్ట్‌ఫోన్లతో ఆ విభాగంలో తమ స్థానం మరింత పటిష్ఠం అవుతుందన్నారు. 2023 సంవత్సరంలో స్మార్ట్‌ఫోన్ విభాగంలో ప్రధాన బ్రాండ్‌గా శామ్‌సంగ్ నిలిచిందని ఆయన చెప్పారు. అనేక కొత్త ఫీచర్లతో మార్కెట్లోకి వచ్చిన గెలాక్సీ ఎ55 ప్రారంభ ధర రూ.36,999 కాగా గెలాక్సీ ఎ 35 ప్రారంభ ధర రూ.27,999 అని ఆయన తెలిపారు. వీటి కొనుగోలుకు శామ్‌సంగ్ ఫైనాన్స్, ఇతర ఎన్‌బీఎఫ్‌సీ భాగస్వాముల ద్వారా రూ.1723 ఈఎంఐకే రుణ సదుపాయం కూడా కల్పిస్తున్నామని వెల్లడించారు.



సిటీ యూనియన్ బ్యాంక్ 800వ శాఖ

హైదరాబాద్: ప్రైవేటు రంగంలోని సిటీ యూనియన్ బ్యాంక్ 800 శాఖల మైలురాయిని చేరింది. అయోధ్యలో బుధవారం 800వ శాఖను ప్రారంభించింది. బ్యాంక్ ప్రారంభమై 120 సంవత్సరాల వేడుకలు నిర్వహించుకుంటున్న సమయంలోనే ఈ మైలురాయిని చేరడం విశేషమని బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. బ్యాంక్ చైర్మన్ ఎం.నారాయణన్ ఈ శాఖను ప్రారంభించగా పారిశ్రామికవేత్త వినయ్ మనూచా ఏటీఎంను ప్రారంభించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,340 ▲	60,810 ▲	80,000 ▼
ముంబై	65,690 ▲	60,170 ▲	73,890 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ		విజయవాడ	425
హైదరాబాద్	415	విశాఖపట్నం	435
21వ తేదీ		వరంగల్	417
చిత్తూరు	478	డజను గుడ్లు రూ.72	
గోదావరి	425		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	106	గోదావరి	106
వరంగల్	106	విజయవాడ	106
కరీంనగర్	106	గుంటూరు	107
మహబూబ్‌నగర్	106	ఒంగోలు	107
కర్నూలు	106	చిత్తూరు	92
విశాఖపట్నం	100		

స్పోర్ట్స్



హార్దిక్ పాండ్యా

ముంబై కొత్త కొత్తగా!

ఐపీఎల్ రేపటి నుంచే

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అంతకుముందు వరుసగా రెండు ఐపీఎల్ సీజన్లలో ప్లేఆఫ్స్‌కు చేరలేకపోయిన ముంబై ఇండియన్స్ నిరుడు ఆరంభంలోనూ అదే ప్రదర్శనను కొనసాగించింది. కానీ సరైన సమయంలో పుంజుకుని టాప్-4లో నిలిచింది. అయితే ఆరోసారి ట్రోఫీ దక్కించుకొని చరిత్ర సృష్టించాలని భావిస్తున్న ముంబై ఈమారు సంచలన నిర్ణయం తీసుకుంది. తన పదేళ్ల సారథ్యంలో జట్టుకు ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మను ఏకంగా నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించింది. హిట్‌మ్యాన్ ఫ్యాన్స్ నుంచి ఎన్ని విమర్శలు ఎదురైనా ఖాతరు చేయకుండా గుజరాత్ నుంచి భారీ మొత్తంతో 'కొని' తెచ్చుకున్న జట్టు పాత కాపు హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ అప్పగించింది. కొత్త సారథిని నియమించడంతోపాటు వేలంలో కొయిట్జీ, మధుశంక, మహ్మద్ నబీ వంటి నాణ్యమైన ఆటగాళ్లపై పెద్ద మొత్తం వెచ్చించింది. చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు మాదిరే ఆరో ఐపీఎల్ ట్రోఫీతో చరిత్ర సృష్టించాలని పట్టుదలగా ఉంది. మరి.. ఈ 'కొత్త మార్పు'తో ముంబై మరోసారి విజేతగా నిలుస్తుందేమో చూడాలి. ఇకనుంచి జట్టులో ఆటగాడిగానే పరిమితమవనున్న రోహిత్.. కొత్తపాత్రలో ఎలా ఇమిడిపోతాడోనన్నది కూడా ఈసారి లీగ్‌లో ఆసక్తికరం కానుంది.



రోహిత్

బలాలు

ముంబై ఇండియన్స్ బలం నిస్సందేహంగా వారి బ్యాటింగ్ విభాగమే. రోహిత్, ఇషాన్, సూర్యకుమార్, తిలక్‌వర్మ, టిమ్ డేవిడ్, నేహల్ వధేరా..అందరూ మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్ గమనాన్ని మార్చివేయగలరు. గత ఏడాది ఆ జట్టు నాలుగుసార్లు 200లకుపైగా రన్స్‌ను విజయవంతంగా చేజింగ్ చేయడం విశేషం. హార్దిక్ రాకతో బ్యాటింగ్ మరింత దుర్భేద్యంగా మారింది. ఇక బుమ్రా యార్కర్లకు, కొయిట్జీ 'పేస్' తోడైతే ముంబైకు తిరుగుండబోదు.

బలహీనతలు

నాణ్యమైన స్పిన్నర్లు లేకపోవడం ముంబైకి పెద్ద సమస్య. ఏళ్లుగా జట్టును ఈ సమస్య వేధిస్తోంది. నిరుడు ముంబై తరఫున అత్యధిక వికెట్లు తీసిన వెటరన్ స్పిన్నర్ పియూష్ చావ్లాకు అండగా నిలిచేందుకు లెగ్గీ శ్రేయాస్ గోపాల్‌ను వేలంలో దక్కించుకుంది. వీరిద్దరికితోడు యువ స్పిన్నర్లు కుమార్ కార్తికేయ, షామ్స్ ములాని సత్తా చాటితే ముంబై ఇండియన్స్ మరోసారి ట్రోఫీ సాధించడం సులువే.

జట్టు

హార్దిక్ (కెప్టెన్), రోహిత్, సూర్యకుమార్, ఇషాన్ కిషన్, తిలక్‌వర్మ, బ్రేవిస్, డేవిడ్, విష్ణు వినోద్, బుమ్రా, మధుశంక, పియూష్ చావ్లా, మహ్మద్ నబీ, కార్తికేయ, ములానీ, నేహల్ వధేర, అర్జున్ టెండూల్కర్, బెహ్రెన్‌డార్ఫ్, ఆకాశ్ మధ్వల్, షెపర్డ్, కొయిట్జీ, శ్రేయాస్ గోపాల్, నువాన్ తుషారా, నమన్ ధిర్, అన్షుల్ కాంబోజ్, శివాలిక్ శర్మ.



కమిన్స్

ఆ'రేంజ్'లో ఆడేనా?

గతకొన్ని సీజన్లుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రదర్శన దిగజారుతూ వస్తోంది. 2023 సీజన్‌లో తానాడిన 14 మ్యాచ్‌ల్లో ఏకంగా 10 ఓడిన సన్‌రైజర్స్.. పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. 2016లో కప్పును ముద్దాడిన ఈ జట్టు.. ఈసారి మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా జట్టులో మార్పులు చేసింది. ఆస్ట్రేలియా వరల్డ్‌కప్ విన్నింగ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను వేలంలో పోటీపడి మరీ భారీ ధరకు కొనుగోలు చేసింది. మార్‌క్రమ్ స్థానంలో అతడికి జట్టు పగ్గాలు అప్పగించింది. పవర్ హిట్టర్ ట్రావిస్ హెడ్‌ను కూడా దక్కించుకొంది. కోచ్, సహాయ సిబ్బందిని కూడా ప్రక్షాళన చేసింది. మరి, ఇన్ని మార్పులతో కళకళలాడుతున్న ఆరెంజ్ ఆర్మీ.. ఆరెంజ్‌లో ఆడి రెండోసారి కప్పు కొడుతుందా?

బలాలు: సన్‌రైజర్స్ బ్యాటింగ్ లైనప్ అనుభవజ్ఞులు, కొత్త రక్తంతో సమతుల్యంగా కనిపిస్తోంది. మార్‌క్రమ్, మయాంక్ అగర్వాల్, గ్లెన్ ఫిలిప్స్, హెడ్‌లతో టాపార్డర్ బలంగా ఉంటే.. మిడిలార్డర్‌లో హెన్రిచ్ క్లాసెన్, అభిషేక్ శర్మ, అబ్దుల్ సమద్ లాంటి హిట్టర్లున్నారు. ఇక, పేస్ బౌలింగ్, బ్యాటింగ్‌తో ఆకట్టుకునే కమిన్స్‌లాంటి కెప్టెన్ ఉండడం జట్టుకు మరింత లాభించే అంశం. బౌలింగ్‌లో భువనేశ్వర్‌కు తోడు ఉమ్రాన్, నటరాజన్, ఉనాద్కట్ సత్తా చాటితే జట్టుకు తిరుగుండదు.

బలహీనతలు: గత సీజన్‌లో హైదరాబాద్ జట్టులో నిలకడలేమి కనిపించింది. జట్టుగా ఆడడంలో పూర్తిగా విఫలం కావడం.. విజయాలపై ప్రభావం చూపింది. క్లాసెన్ ఒంటరి పోరాటం చేస్తే.. బౌలింగ్‌లో భువనేశ్వర్ మాత్రమే ఆశించిన స్థాయిలో రాణించాడు. అయితే, ఈ సీజన్‌లో మాత్రం ఎవరి పాత్రను వారు పోషిస్తూనే.. కలసికట్టుగా ఉత్తమ ప్రదర్శన చేయాల్సిన అవసరముంది.

జట్టు

కమిన్స్ (కెప్టెన్), మార్‌క్రమ్, త్రిపాఠి, సమద్, ఫిలిప్స్, హెడ్, మయాంక్ అగర్వాల్, క్లాసెన్, అన్‌మోల్‌ప్రీత్, ఉపేంద్ర, నితీశ్ రెడ్డి, అభిషేక్, మార్కో జాన్సెన్, వాషింగ్టన్, హసరంగ, భువనేశ్వర్, నటరాజన్, ఉమ్రాన్ మాలిక్, మార్కండే, ఉనాద్కట్, షాబాజ్, ఆకాశ్, సుబ్రమణ్యన్, ఫరూఖీ.

నన్ను అలా పిలవొద్దు
ఫ్యాన్స్‌కు కోహ్లీ అభ్యర్థన



బెంగళూరు: తనను 'కింగ్' అని సంబోధించడాన్ని ఆపాలంటూ విరాట్ కోహ్లీ.. అభిమానులతో పాటు జట్టు సహచరులను అభ్యర్థించాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు నూతన జెర్సీ ఆవిష్కరణ సందర్భంగా వ్యాఖ్యాత అడిగిన ఓ ప్రశ్నకు.. కోహ్లీ ఇలా స్పందించాడు. 'మళ్లీ ఇక్కడకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. మీరందరూ నన్ను 'కింగ్' అని పిలవడాన్ని ఆపేయాలి. అలా అంటే ఎంతో అసౌకర్యంగా ఉంటుంది. కెప్టెన్ డుప్లెసికి కూడా అదే చెప్పా. నన్ను విరాట్ అని మాత్రమే పిలవండి' అని కోహ్లీ కోరాడు.

అక్షయ్ ఆట.. రెహ్మాన్ పాట
అదరనున్న ఐపీఎల్ ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ: ఈ ఐపీఎల్ ప్రారంభోత్సవం ఉర్రూతలూగించేలా బీసీసీఐ ఏర్పాట్లు చేస్తోంది. బాలీవుడ్ హీరోలు, గాయకులు తమ ఆట పాటలతో అలరించేలా కార్యక్రమాలు నిర్వహించనుంది. యాక్షన్ స్టార్లు అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, గాయకుడు సోను నిగమ్, దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ శుక్రవారం సాయంత్రం జరిగే వేడుకల్లో సందడి చేయనున్నారు. ఇక..డిఫెండింగ్ చాంప్ చెన్నై, బెంగళూరు జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ఐపీఎల్‌కు తెరలేవనుంది.

టీమిండియా కోచింగ్‌పై లాంగర్ ఇలా..



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ జస్టిన్ లాంగర్ ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. బుధవారం విలేకరులతో మాట్లాడిన సందర్భంగా అతడికి అనూహ్యమైన ప్రశ్న ఎదురైంది. భవిష్యత్‌లో భారత జట్టు కోచింగ్ చేపట్టే అవకాశం ఉందా అన్న ఆ ప్రశ్నకు బదులిస్తూ.. 'పాంటింగ్‌తో మాట్లాడుతూనే ఉన్నా.. భారత యువ క్రికెటర్లలో ఇంత ప్రతిభ ఉందని అనుకోలేదు. అంతమంది ప్రతిభావంతులతో పని చేస్తున్నందుకు ద్రవిడ్‌కు ఎంతో గర్వంగా ఉండి ఉంటుంది' అని లాంగర్ తెలివిగా సమాధానమిచ్చాడు.

రాజకీయాలతో ముడిపెట్టొద్దు
» సీఏకు అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు లేఖ

కాబూల్: అఫ్ఘానిస్థాన్‌తో టీ20 ద్వైపాక్షిక సిరీస్‌ను ఆస్ట్రేలియా వాయిదా వేయడంపై అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గొద్దని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ)ను కోరింది. అఫ్ఘాన్‌లో మహిళలు, ఆడపిల్లపై జరుగుతున్న అణచివేత ధోరణులను కారణంగా చెబుతూ.. ఆగస్టులో స్వదేశంలో జరగాల్సిన టీ20 సిరీస్‌ను ఆసీస్ వాయిదా వేసింది. అయితే, క్రీడలను రాజకీయాలకు దూరంగా ఉంచాలని సీఏకు రాసిన లేఖలో ఏసీబీ కోరింది.

లాంగ్‌జంప్‌లో షైలీకి నయన షాక్

బెంగళూరు: ఇండియన్ ఓపెన్ జంప్స్ పోటీల్లో ఫేవరెట్ షైలీసింగ్‌కు చుక్కెదురైంది. బుధవారం జరిగిన లాంగ్‌జంప్‌లో షైలీ (యూపీ)కి షాకిస్తూ కేరళకు చెందిన నయన జేమ్స్ స్వర్ణం గెలిచింది. నయన 6.67మీటర్లు లంఘించి విజేతగా నిలవగా, షైలీ 6.40 మీటర్లతో రజతానికి పరిమితమైంది.

శ్రీకాంత్, సింధు శుభారంభం



లక్ష్యసేన్

బాసెల్: స్విస్ బ్యాడ్మింటన్ ఓపెన్ సూపర్ 300 సిరీస్‌లో స్టార్ షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు, లక్ష్యసేన్ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-17, 21-18తో వాంగ్ ట్జు వీ (చైనీస్ తైపీ)పై, లక్ష్యసేన్ 21-19, 15-21, 21-11తో లియాంగ్ జున్ హావ్ (మలేసియా)పై గెలిచారు. సింధు 21-12, 21-13తో పోర్న్‌పిచా చోయికివాంగ్ (థాయ్‌లాండ్)పై సునాయాసంగా నెగ్గింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట 21-18, 12-21, 21-19తో మెయిలీసా-రాచెల్ (ఇండోనేసియా) ద్వయంపై, గాయత్రి-ట్రీసా జోడీ 21-15, 21-12తో అన్నె జు-కెర్రీ జు (అమెరికా)పై నెగ్గాయి.

మహీకి ఆటే సర్వస్వం కాదు
జహీర్ ఖాన్

చెన్నై: క్రికెట్ తన జీవితంలో అంతర్భాగమేకానీ..అదే సర్వస్వం కాదని ధోనీ ఎప్పుడో అర్థం చేసుకున్నాడని టీమిండియా మాజీ ఆటగాడు జహీర్‌ఖాన్ వెల్లడించాడు. కెప్టెన్‌గా చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన 42 ఏళ్ల మహీ తన సారథ్యంలో మరోసారి జట్టును నడిపించేందుకు సిద్ధమవుతున్నాడు. 'క్రికెట్ అంటే ధోనీకి చచ్చేంత ఇష్టం. అది తన జీవితంలో ఓ భాగమనీ మహీకి తెలుసు. కానీ అదే తన సర్వస్వం కాదని కూడా ధోనీ చాలాకాలం కిందటే తెలుసుకున్నాడు' అని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ జహీర్ పేర్కొన్నాడు.

ఒలింపిక్స్ ఆరంభ వేడుకల్లో రష్యా, బెలారస్ అథ్లెట్లకు నో చాన్స్
స్పష్టం చేసిన ఐవోసీ



జెనీవా: పారిస్ ఒలింపిక్స్ ఆరంభోత్సవంలో పాల్గొనకుండా రష్యా, బెలారస్ అథ్లెట్లపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) నిషేధం విధించింది. జూలై 26న జరిగే ఈ ప్రారంభ వేడుకల్లో అథ్లెట్ల పరేడ్‌ను గతానికి భిన్నంగా స్టేడియంలో కాకుండా సీన్ నదిలో నిర్వహించనున్నారు. వేలాది మంది అథ్లెట్లు ఐఫిల్ టవర్ దిశగా పడవలపై వెళ్తూ పరేడ్ చేయనున్నారు. అయితే, విశ్వక్రీడల్లో తటస్థ అథ్లెట్లుగా పాల్గొంటున్న రష్యా, బెలారస్ ప్లేయర్లను వీక్షకులుగా మాత్రమే అనుమతిస్తామని ఐవోసీ స్పష్టం చేసింది. వేడుకల్లో ఆ రెండు దేశాల క్రీడాకారులను భాగస్వాములం చేయబోమని వెల్లడించింది. ఉక్రెయిన్‌పై యుద్ధం కారణంగా ఈ రెండు దేశాలపై ఐవోసీ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఇక.. సస్పెండ్ చేసిన అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ)తో ఆయా దేశాల జాతీయ సమాఖ్యలు సంబంధాలు తెంచుకోవాలని ఐవోసీ సూచించింది. కొత్త వరల్డ్ బాడీని ఏర్పాటు చేసుకోవాలని.. లేకపోతే 2028 లాస్ ఏంజిల్స్ క్రీడల నుంచి బాక్సింగ్‌ను తప్పిస్తామని కూడా హెచ్చరించింది.

శ్రేయాంక ఆనందం రెట్టింపు

బెంగళూరు: ఆరాధ్య ఆటగాడు విరాట్ కోహ్లీని కలుసుకోవడం తన జీవితంలో ఎంతో అమూల్యమైన సందర్భమని మహిళా ప్లేయర్ శ్రేయాంక్ పాటిల్ పట్టరాని సంతోషాన్ని వ్యక్తం చేసింది. కోహ్లీతో ఉన్న ఫొటోను ఎక్స్‌లో షేర్ చేసింది. 'అతడి కోసమే క్రికెట్‌ను చూడడం ఆరంభించా. అతడిలా ఎదగాలని కలలు కన్నా. ఎట్టకేలకు ఆ అపురూప సమయం వచ్చింది. హాయ్ శ్రేయాంక.. అద్భుతంగా బౌలింగ్ చేశావని నన్ను పేరుతో పిలిచాడని శ్రేయాంక పోస్ట్ చేసింది. గతవారం డబ్ల్యూపీఎల్‌లో బెంగళూరు టైటిల్ విజేతగా నిలవడంలో శ్రేయాంక కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

వారాహిని సిద్ధం చేయండి!

- నేతలకు పవన్ కల్యాణ్ ఆదేశం.. ఎన్నికల ప్రచారానికి సేనాని సిద్ధం
- వచ్చే వారం పిఠాపురం నుంచే జనసేన ప్రచారానికి శ్రీకారం



అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారానికి జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో 'వారాహి' వాహనాన్ని సిద్ధం చేయాలని ఆయన పార్టీ నాయకులను ఆదేశించారు. టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం నుంచి, వైసీపీ అధినేత జగన్ 27 నుంచి ప్రచారానికి సిద్ధం అవుతున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ కూడా జిల్లాల పర్యటనకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. వచ్చే వారం పిఠాపురం నుంచే ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. పవన్ దాదాపు 20 రోజులపాటు ప్రజాక్షేత్రంలో ఉండనున్నారు. జనసేన పోటీ చేసే 21 స్థానాల్లో రెండు సార్లు పర్యటించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కాగా, జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు గురువారం తిరుపతి జనసేన నేతలతో సమావేశం కానున్నారు. వారితో చర్చించిన తర్వాత తిరుపతి అభ్యర్థిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

రాజోలులో జెండా ఎగరాలి: పవన్

రాజోలులో జనసేన జెండా మరోసారి ఎగరాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. మంగళగిరిలో బుధవారం రాజోలు నియోజకవర్గం పార్టీ నాయకులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్‌తో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. రాజోలు నియోజకవర్గ పరిస్థితిపై చర్చించారు. "నియోజకవర్గ ప్రజలు మన మీద ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుందాం. మరోసారి ఇక్కడ మనం గెలిచేలా ముందుకుసాగుదాం" అని దిశానిర్దేశం చేశారు.

పవన్ పోటీ చేస్తే.. భారీ మెజార్టీతో గెలిపిస్తాం

- పవన్ కాకుంటే.. టీడీపీ తరపున నేనే పోటీ చేస్తా: వర్మ

గొల్లప్రోలు, మార్చి 20: పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తే టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా భారీ మెజార్టీతో గెలిపిస్తామని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రకటించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్ కాకుండా వేరేవారు పిఠాపురం నుంచి పోటీ చేస్తే పిఠాపురం నియోజకవర్గ ప్రజలు పల్లకీ మోసేందుకు సిద్ధంగా లేరని తేల్చి చెప్పారు. పవన్ ఎంపీగా పోటీ చేస్తే తానే టీడీపీ తరపున పిఠాపురం నుంచి పోటీలో ఉంటానని, ఇదే విషయాన్ని చంద్రబాబు తనకు తెలియజేశారని చెప్పారు. ఎంపీగా పోటీ చేయమని అమిత్‌షా అడిగితే ఆలోచిస్తానని, అప్పుడు కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ శ్రీనివాస్ పిఠాపురం నుంచి పోటీ చేస్తారని పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో వర్మ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.


ధర్మవరం టికెట్ జనసేనకే ఇవ్వాలంటూ ర్యాలీ



ధర్మవరంలో ర్యాలీ చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

ధర్మవరం, మార్చి 20: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం టికెట్‌ను జనసేన పార్టీకే కేటాయించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఆధ్వర్యంలో ధర్మవరంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ధర్మవరంలో వైసీపీ నాయకులు అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని, ప్రశ్నించినవారిని అక్రమ కేసులతో ఇబ్బందులు పెట్టారని అన్నారు. వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చానని, దానిని నెరవేర్చాలంటే టికెట్‌ను జనసేన పార్టీకి కేటాయించాలని కోరారు.

జనం నమ్మకం కోల్పోయిన జగన్



- వైసీపీ అక్రమాలపై పోరులో భాగం కండి: బాబు

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): 'తన ఐదేళ్ల పాలనపై సీఎం జగన్‌కు నమ్మకం లేక ఎన్నికల్లో అక్రమాలను చివరి అస్త్రంగా ఎంచుకున్నారు. పూర్తిస్థాయిలో జనం నమ్మకం, మద్దతు కోల్పోయిన జగన్ అక్రమాలనే నమ్ముకున్నారు' అని టీడీపీ అధినేత చంద్రబాబు ఒక ప్రకటనలో ఆరోపించారు. 'రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వైసీపీని ఇంటికి పంపేందుకు ఇప్పుడు రాష్ట్ర పౌరులు బాధ్యత తీసుకుని ముందడుగు వేయాలి. ఎన్నికల నిబంధనలు సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి. డబ్బు పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టడం, ప్రభుత్వ ఉద్యోగులతో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయించడం, ప్రత్యర్థి పార్టీలపై తప్పుడు ప్రచారం చేయడం వంటి వివిధ కోడ్ ఉల్లంఘనలపై 'సీ విజిల్' యాప్ ద్వారా ప్రజలే నేరుగా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలి. పౌరులు నేరుగా సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఈసీ వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. అధికారపార్టీ అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి తాము చేస్తున్న పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

23న టీడీపీ అభ్యర్థులకు వర్క్‌షాప్

టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఈ నెల 23నయి విజయవాడలో టీడీపీ వర్క్‌షాప్ నిర్వహించ నున్నది. ఎన్నికలకు సన్నద్ధత, ప్రణాళిక, తదితర అంశాలపై వర్క్‌షాప్‌లో చర్చించనున్నారు. చంద్రబాబు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు.

కుప్పం పర్యటనకు బాబు

చంద్రబాబు ఈ నెల 24, 25 తేదీల్లో కుప్పంలో నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కుప్పంలో లాంఛనంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారు.

ఒక్క చాన్స్ ఇస్తే అథఃపాతాళానికి తొక్కేశాడు

- జగన్ దెబ్బకు పరిశ్రమలు పరార్
- 'బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్' కార్యక్రమంలో టీడీపీ నేత నారా లోకేశ్ పిలుపు



మంగళగిరిలోని కుంచనపల్లిలో స్థానికులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న లోకేశ్

మంగళగిరి, మార్చి 20: "ఒక్క చాన్స్.. ఒక్క చాన్స్.. అన్న జగన్ మాయలో పడి వైసీపీని గెలిపించినందుకు 5 కోట్ల మంది ప్రజానీకం పెనుమూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఒక్క చాన్స్ ఇచ్చినందుకు రాష్ట్రాన్ని అథఃపాతాళానికి తొక్కేశాడు" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సీఎం జగన్‌పై నిప్పులు చెరిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఆయన మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని కుంచనపల్లి అపర్ణ అపార్టుమెంట్స్ వాసులతో కలిసి 'బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. నారా లోకేశ్ మాట్లాడుతూ.. జగన్ అరాచకపాలనతో ఏపీ బ్రాండ్ నాశనమైందని ఆందోళన వ్యక్తం చేశారు. "జే ట్యాక్స్, కక్షపూరిత విధానాల కారణంగా రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చే అమర్‌రాజా వంటి ఎన్నో పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయి. జగన్ దెబ్బకు ఏపీలో తప్ప వెనుకబడిన రాష్ట్రాలకైనా వెళతామనే పరిస్థితికి పారిశ్రామికవేత్తలు వచ్చారు. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. దేశంలో వాక్సిన్‌ల తయారీలో అగ్రగామిగా ఉన్న భారత్ బయోటెక్ సంస్థ ఏపీని కాదని ఒడిశాలో యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంది. రాష్ట్ర ఖజానాకు పన్నుల రూపంలో అత్యధిక ఆదాయాన్ని అందించే అమర్‌రాజాను వేధించడంతో ఆ కంపెనీ యాజమాన్యం తెలంగాణకు వెళ్లిపోయింది. వీటివల్ల అంతిమంగా నష్టపోయింది నిరుద్యోగ యువతే. రాష్ట్ర ప్రజలు వీటన్నింటినీ గమనంలో ఉంచుకుని అరాచక విధానాలకు చెక్ పెట్టేలా ఆలోచించి ఓటెయ్యాలి" అని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు ప్రగతి ఇదీ

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చారని నారా లోకేశ్ తెలిపారు. ఒక్కొక్క జిల్లానూ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశారన్నారు. అనంతపురంలో ఆటోమొబైల్, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, కర్నూలులో సోలార్ ఎనర్జీ, విశాఖలో ఐటీ, గోదావరి జిల్లాల్లో ఆక్వా, పామాయిల్ రంగాలను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఫలితంగా చంద్రబాబు హయాంలో 40 వేల పరిశ్రమలు, 6 లక్షల ఉద్యోగాలు వచ్చాయని జగన్ ప్రభుత్వమే చెప్పిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వాన్ని ముందుకు నడిపించాలన్నది టీడీపీ ధ్యేయంగా పెట్టుకుందని తెలిపారు. "అభివృద్ధి చేయకుండా ఎడాపెడా అప్పులు చేస్తూ పోతే ఆ భారమంతా అంతిమంగా రాష్ట్ర ప్రజలే మోయాలి. ఇప్పుడు ఏపీలో జరుగుతున్న తంతు ఇదే. సంక్షోభాలను సవాల్‌గా స్వీకరించి అభివృద్ధికి బాటలు వేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య." అని లోకేశ్ చెప్పారు.

లోకేశ్ కాన్వాయ్ తనిఖీ



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కాన్వాయ్‌ను పోలీసులు తనిఖీ చేశారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి లోకేశ్ బుధవారం ఉదయం ఎన్నికల ప్రచారానికి బయలుదేరుతూ కరకట్ట రోడ్డు ఎక్కగానే పోలీసులు ఆయన కాన్వాయ్‌ను నిలిపివేశారు. కోడ్ నేపథ్యంలో తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. దీంతో ఆయన కాన్వాయ్‌ని ఆపించి అన్ని వాహనాలను చెక్ చేసుకోవచ్చునంటూ సహకరించారు.

మాఫియా లేకుంటే పెద్దిరెడ్డికి ఓటమే: అచ్చెన్నాయుడు

అమరావతి: 'మాఫియాతో పొత్తు లేకుండా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిలబడలేరు. స్వేచ్ఛగా పోలింగ్ జరిగితే పుంగనూరులో ఓడిపోతారు. అలాంటి పెద్దిరెడ్డి, చంద్రబాబుపై అహంకారపూరితంగా నోరు పారేసుకుంటారా?' అంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో మండిపడ్డారు. చంద్రబాబు రాజకీయ వికలాంగుడంటూ పెద్దిరెడ్డి చేసిన విమర్శలపై ఆయన ఘాటుగా స్పందించారు. 'పెద్దిరెడ్డి ఎన్నో హత్యలు చేయించారు. వారి కుటుంబాల చేతిలో పెద్దిరెడ్డి ఏదో ఒక రోజు వికలాంగుడౌతారు. అతని అంతరాత్మ అదే చెపుతున్నట్లుంది. అందుకే పెద్దిరెడ్డి తన స్థితిని చంద్రబాబుకు అంటకట్టి నోరు పారేసుకుంటున్నారు.' అని అచ్చెన్న ఆగ్రహించారు.



కాంగ్రెస్‌లో చేరిన కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణకు కండువా కప్పుతున్న పీసీసీ చీఫ్ షర్మిల

కడప నుంచే షర్మిల పోటీ!

- నేడు జిల్లా కాంగ్రెస్ సీనియర్లతో భేటీ
- అనంతరం నిర్ణయం వెల్లడి?

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి కడప లోక్‌సభ స్థానం నుంచే బరిలోకి దిగడం దాదాపు ఖాయమైనట్లు తెలుస్తోంది. తన నిర్ణయాన్ని ఆమె గురువారం వెల్లడిస్తారని తెలుస్తోంది. గతంలో ఆమె ఎన్నికల్లో ప్రచారం చేయడం తప్ప ప్రత్యక్ష ఎన్నికల్లో పాలుపంచుకోలేదు. అయితే పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టాక రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు, నేతల్లో నూతనోత్సాహం నెలకొందని.. ఎన్నికల్లో ఆమె పోటీ చేస్తే పార్టీ పునరుజ్జీవానికి దోహదపడుతుందని సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయాన్ని ఏఐసీసీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ముంబైలో 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' సందర్భంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ.. కడప నుంచి లోక్‌సభకు పోటీచేయాలని షర్మిలకు సూచించారు. నాటి నుంచి దీనిపై ఆమె కసరత్తు చేస్తున్నారని పీసీసీ వర్గాలు చెబుతున్నాయి. గురువారం విజయవాడలో పీసీసీ కార్యాలయమైన ఆంధ్రరత్న భవన్‌లో ఉమ్మడి కడప జిల్లా కాంగ్రెస్ నేతలతో షర్మిల సమావేశమవుతున్నారు. మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి సహా పలువురు నాయకులను ఈ భేటీకి ఆహ్వానించారు. వీరందరితో చర్చించాక.. గురువారమే ఆమె తన నిర్ణయాన్ని వెల్లడిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా.. కడప నుంచి షర్మిల బరిలోకి దిగితే.. రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కుతాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మిగిలిన రాజకీయ పార్టీల పరిస్థితి ఎలా ఉన్నా.. ఆమె అన్న సీఎం జగన్‌కు ఇబ్బందులు తప్పవని అంటున్నాయి. ప్రతి రోజూ జగన్ పాలనను తూర్పారబట్టడంతోపాటు.. చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యను ప్రస్తావిస్తుంటే దాని ప్రభావం ప్రజలపై తీవ్రంగానే ఉంటుందన్న ఆందోళన ప్రభుత్వ పెద్దల్లో కనిపిస్తోందని పేర్కొంటున్నారు.

కాంగ్రెస్‌లోకి కోడుమూరు మాజీ ఎమ్మెల్యే

కర్నూలు జిల్లా కోడుమూరు (ఎస్సీ) మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ తిరిగి కాంగ్రెస్ గూటికి వచ్చారు. బుధవారం హైదరాబాద్ లోటస్‌పాండ్ నివాసంలో ఆయన షర్మిలతో సమావేవమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మురళీకృష్ణకు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

పైసా వసూల్!

(మొదటి పేజీ తరవాయి)

ఆగలేదు. 16వ తేదీ నుంచి బుధవారం వరకు ఐదురోజుల్లో రూ.584 కోట్లు చెల్లింపులు చేశారు. ఇదంతా ఖజానాలో అందుబాటులో ఉన్న డబ్బులనుకుంటే పొరపడినట్లే! రిజర్వ్ బ్యాంక్ నుంచి అప్పు తెచ్చి మరీ ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారు. వేజ్ అండ్ మీన్స్ ద్వారా 3200 కోట్లు, ఓవర్ డ్రాఫ్ట్‌తో రూ.1500 కోట్లు తెచ్చి... పంచేశారు. అంటే... ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ ఆర్బీఐ నుంచి అప్పు తెచ్చి మరీ రూ.4700 కోట్లు అధికార పార్టీకి కావాల్సిన వారికి చెల్లించారు. ఈ మొత్తాన్ని మార్చి 31లోగా ఆర్‌బీఐకి తిరిగి కట్టేయాలి. లేదంటే ఏప్రిల్ 1న ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో ఏపీ రాష్ట్ర ఖాతా మైనస్ బ్యాలెన్స్‌లో ఉంటుంది! నిబంధనల ప్రకారం అలా ఉండకూడదు! మార్చి 31 నాటికి జీఎస్టీ, ఐజీఎస్టీ, కేంద్రం నుంచి వచ్చే నిధులు, సొంత ఆదాయం రూపంలో ఖజానాకు రూ.10,000 కోట్లు చేరే అవకాశం ఉంది. వీటిని కూడా వైసీపీకి కావాల్సిన వ్యక్తులకు బిల్లుల రూపంలో చెల్లించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

అస్మదీయుల కోసమే...

ప్రస్తుతం సీఎఫ్ఎంఎస్ (కాంప్రహెన్సివ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)లో సుమారు ఎనిమిది లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి ప్రభుత్వం రూ.55వేల కోట్ల దాకా చెల్లించాలి. ఇవన్నీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి చెందినవి మాత్రమే. నాలుగేళ్లుగా ఆర్థిక శాఖ క్యాన్సల్ చేసిన బిల్లులు రూ.2 లక్షల కోట్ల వరకు ఉన్నాయి. ఇలా క్యాన్సల్ చేసిన బిల్లులను తిరిగి కొత్త ఆర్థిక సంవత్సరంలో సీఎఫ్ఎంఎస్‌లో చేర్చాలి. కానీ... అలా చేయడంలేదు. పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం కోర్టులో దాఖలైన కేసుల సంఖ్య 4 లక్షలు. వీటన్నింటినీ పక్కనపెట్టేస్తున్నారు. కేవలం అస్మదీయ కాంట్రాక్టర్ల బిల్లులు మాత్రమే... 'క్విడ్ ప్రో కో' తరహాలో చెల్లిస్తున్నారు.

భయంలేకుండా బరితెగింపు...

2018-19లో 'ఫిఫో'ను ప్రవేశపెట్టారు. అంటే... సీఎఫ్ఎంఎస్‌లోకి 'మొదట వచ్చిన బిల్లును మొదట' పద్ధతిలో చెల్లించాలి. అప్పట్లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా ఉన్న ఎం.రవిచంద్ర ఎప్పుడూ ఈ పద్ధతిని ఉల్లంఘించలేదు. 2019లో ఎన్నికల కోడ్ వచ్చాక, ఆ అధికారి సెలవుపై వెళ్లిపోవడంతో, బిల్లుల చెల్లింపు బాధ్యతను అప్పటికే ఆర్థిక శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న కేవీవీ సత్యనారాయణకు అప్పగించారు. ఆ క్షణం నుంచి సత్యనారాయణ యథేచ్ఛగా ఫిఫో ఉల్లంఘిస్తూనే ఉన్నారు. ఏ బిల్లు డబ్బులు ఎప్పుడొస్తాయో ఎవ్వరికీ తెలీదు. వైసీపీకి కావాల్సిన వాళ్ల బిల్లులు యథేచ్ఛగా చెల్లిస్తూ... ఇతర కాంట్రాక్టర్ల బిల్లులకు మాత్రం 'ఫిఫో' అని ఆపేస్తారు. ఇంతగా ఎందుకు బరితెగిస్తున్నారు? నిబంధనలు మీరితే సర్వీసులో ఇబ్బందులు తప్పవనే భయం లేదా? అంటే... నిజంగానే ఆయనకు ఈ భయం లేదు. సత్యనారాయణ రాష్ట్ర కేడర్ అధికారి కాదు. ఆయన ఇండియన్ రైల్వే అకౌంట్స్ అధికారి (ఐఆర్ఏఎస్)! రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఏదో ఒకరోజు సొంత సర్వీసుకు వెళ్లిపోతారు. ఈ ధైర్యంతోనే ఐదేళ్ల నుంచి రాష్ట్రంలో ఇంత పెద్ద ఆర్థిక అక్రమాలు స్వయంగా చేస్తున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. నిజానికి.. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ రాష్ట్ర కేడర్ సీనియర్ ఐఏఎస్ అధికారి. ఆర్థిక శాఖకు ఆయనే పెద్ద దిక్కు. అయినా, ఇప్పుడు ఆయన నిస్సహాయుడిగా మారారు. కనీసం ఆయనకు సంబంధించిన బిల్లు కూడా ఆయన చెల్లించుకోలేని పరిస్థితి!

కమీషన్ల 'కానుక'!

- విద్యాకానుక కాంట్రాక్టు పాత కాంట్రాక్టర్లకే..
- 37 లక్షల కిట్లు కొనుగోలుకు నిర్ణయం
- వాటి విలువ రూ.650 కోట్లు
- టెండర్లు పిలవకుండా ఇచ్చేసిన ప్రభుత్వం

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం భారీ కాంట్రాక్టును అడ్డగోలుగా కట్టబెట్టింది. రూ.650కోట్ల విలువైన విద్యాకానుక కొనుగోళ్ల కాంట్రాక్టును ఎలాంటి టెండర్లు లేకుండా పాత కాంట్రాక్టర్లకు అప్పగించింది. టెండర్లు పిలవకుండా కాంట్రాక్టర్లతో చర్చించి, అప్పగించాలని ప్రభుత్వమే నేరుగా జీవో.2 జారీచేసింది. అందుకు అనుగుణంగా కాంట్రాక్టర్లతో బేరసారాలు చేసిన సమగ్రశిక్ష అధికారులు, పాత రేట్లతోనే కిట్లు సరఫరా చేసేలా ఒప్పందాలు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం సకాలంలో బిల్లులు ఇవ్వట్లేదని, పాత బకాయిలు చెల్లిస్తేనే వచ్చే ఏడాదికి కిట్లు సరఫరా చేస్తామని బెట్టు చేసిన కాంట్రాక్టర్లనే ప్రభుత్వం ఎంపిక చేసింది. 2023-24 విద్యా సంవత్సరానికి కిట్లు సరఫరా చేసిన 19 మంది కాంట్రాక్టర్లకు మళ్లీ కాంట్రాక్టులు దక్కాయి. ఇదంతా గమనిస్తే, అధికార పార్టీ నేతలు, కాంట్రాక్టర్ల మధ్య ఒప్పందం ప్రకారమే ఈ చర్చల వ్యవహారం సాగిందని స్పష్టమవుతోంది. నిజంగా ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించట్లేదనే ఆందోళన ఉంటే, కొంతమందైనా కాంట్రాక్టు నుంచి తప్పుకొనేవారు. కానీ టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో అప్పనంగా వచ్చిన కాంట్రాక్టు కావడంతో... నిధుల విషయంలో అనధికారిక ఒప్పందాలతో మళ్లీ తీసుకున్నారు. అయితే, మొత్తం వ్యవహారం వెనుక అధికార పార్టీ నేతలు, సీనియర్ మంత్రి ఉన్నట్లు తెలిసింది. ఎన్నికలు కావడంతో కమీషన్ల కోసమే ఇంత పెద్ద కాంట్రాక్టును కావాల్సిన వారికి కట్టబెట్టినట్లు అర్థమవుతోంది.

పారదర్శకత ఆనవాళ్లేవీ?

ప్రతిసారీ పారదర్శకత అని మాటలు చెప్పే సీఎం, మంత్రులు, ప్రభుత్వ పెద్దలు....రూ.650 కోట్ల కాంట్రాక్టును అప్పనంగా ఎందుకు కట్టబెట్టారనే దానిపై వివరణ ఇవ్వట్లేదు. ఎప్పటిలాగే సమగ్రశిక్ష కార్యాలయం గతేడాది సెప్టెంబరులో విద్యా కానుక టెండర్లకు అనుమతి ఇవ్వాలని ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపింది. నాలుగు నెలలపాటు దానిపై మౌనంగా ఉన్న ప్రభుత్వం చివరికి జనవరిలో స్పందించింది. టెండర్లు అక్కర్లేదని, పాత కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి ఇచ్చేయాలని జీవో ఇచ్చింది. అయితే అలా ఎందుకు చేయాల్సి వచ్చిందనేది వివరించలేదు. ఏదో రొటీన్ ఫైలు తరహాలో రూ.వందల కోట్ల కాంట్రాక్టుపై అడ్డగోలుగా ఉత్తర్వులు జారీచేసింది.

న్యాయ సమీక్షకు వెళ్తే కష్టం

జడ్జీల నేతృత్వంలో ఏర్పాటైన న్యాయ కమిషన్‌ను తప్పించుకొనేందుకు పాఠశాల విద్యాశాఖ అనేక అడ్డదారులు తొక్కింది. సాంకేతికంగా తప్పించుకునేందుకు ప్యాకేజీలు పెంచింది. మొత్తం 19 మంది కాంట్రాక్టర్లను ఎంపిక చేయడంతో ఏ టెండరూ రూ.వంద కోట్లు దాటలేదు. దీంతో న్యాయ సమీక్ష అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. కానీ ఒకే పనికి సంబంధించిన వేర్వేరు కాంపోనెంట్లు అయినా న్యాయ సమీక్షకు పంపుతామని అప్పట్లో సీఎం చెప్పిన మాట గాల్లో కలిసిపోయింది. విద్యా కానుక మొదలుపెట్టిన మొదటి సంవత్సరం టెండర్లను న్యాయ సమీక్షకు పంపడంతో, కమిషన్ పలు సూచనలు చేసింది. ఇవన్నీ తమకు ప్రతికూలంగా మారడంతో ఏకంగా న్యాయ సమీక్షనే తప్పించి, నేరుగా టెండర్లు పిలుస్తున్నారు.

రూ.300 కోట్లు ఇచ్చి మరీ..

ఈ విద్యా సంవత్సరంలో పంపిణీ చేసిన విద్యాకానుక కిట్లను పాఠశాల విద్యాశాఖ గతేడాది టెండర్లు పిలిచి కొనుగోలు చేసింది. 39.9లక్షల కిట్లను అప్పట్లో తీసుకున్నారు. పాఠ్యపుస్తకాలకు విడిగా టెండర్లు పిలిచారు. పాఠ్య పుస్తకాలు మినహా, విద్యా కానుక టెండర్లు రూ.720 కోట్లు అయ్యాయి. వీటిని ప్రాంతాలు, వస్తువుల వారీగా విడగొట్టి 19 మందికి అప్పగించారు. మొత్తం రూ.720 కోట్లకు గాను, రూ.120 కోట్లు చెల్లించారు. మిగిలిన రూ.600 కోట్లలో కనీసం సగం చెల్లిస్తే వచ్చే ఏడాదికి కిట్లు సరఫరా చేస్తామని కాంట్రాక్టర్లు అల్టిమేటం ఇచ్చారు. దీంతో కొద్దిరోజుల కిందట వారికి రూ.300 కోట్ల బకాయిలు చెల్లించి మరీ ప్రభుత్వం మళ్లీ వారికే కాంట్రాక్టు అప్పగించింది. తొలుత...బకాయిల నేపథ్యంలో వారు సరఫరా చేయనన్నారని, అందుకే కొత్తవారితో మాట్లాడుతున్నామని అధికారులు మాటలు చెప్పారు. చివరికి ఒక్కరిని కూడా మార్చకుండా తిరిగి వారికే కాంట్రాక్టు కట్టబెట్టారు. రూ.వందల కోట్ల కాంట్రాక్టుపై ముందుగానే మాట్లాడుకుని బకాయిల డ్రామా ఆడారని, ఈ మధ్యలో టెండర్లు లేకుండా చేశారని ఇతర కాంట్రాక్టర్లు అభిప్రాయపడుతున్నారు.

జిందాల్ X జిందాల్!

(మొదటి పేజీ తరువాయి)

'ఆంధ్రజ్యోతి' అప్పట్లోనే చెప్పింది. టెండర్ నోటిఫికేషన్ ఇచ్చాక అదే విషయాన్ని పునరద్ఘాటించింది. ఇప్పుడు అదే జరిగింది. ఇక్కడే జగన్ మార్క్ కనికట్టు బయటపడింది. ఈ ఐరన్‌వోర్ టెండర్‌కు జిందాల్ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్, జిందాల్ ఎస్ఏడబ్ల్యూ లిమిటెడ్ అనే కంపెనీలు మాత్రమే బిడ్‌లు దాఖలు చేశాయి. ఈ రెండూ జిందాల్ గ్రూప్‌నకు సంబంధించినవే. మూడో కంపెనీ ఏదీ బిడ్ వేయలేదు. జిందాల్ గ్రూప్ 1982లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్ ను ఏర్పాటు చేసింది. 1984లో ఇదే గ్రూప్ జిందాల్ ఎస్ఏ డబ్ల్యూ లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేసింది. జిందాల్ స్టీల్ ఐరన్‌వోర్, స్టీల్‌తయారీలో ముఖ్యమైన కంపెనీ. జిందాల్ ఎస్‌డబ్ల్యూ గృహ నిర్మాణాలకు అవసరమైన స్టీల్ పైపులను తయారు చేస్తోంది. అంటే ఒకే గ్రూప్‌నకు చెందిన రెండు కంపెనీలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి. వీటిలో టెండర్‌ను జిందాల్ ఎస్ఏడబ్ల్యూ లిమిటెడ్‌కు కట్టబెట్టారు. ఒకే గ్రూప్‌నకు చెందిన రెండు కంపెనీలు టెండర్లలో పాల్గొనడం, అందులో ఒక కంపెనీకి టెండర్ రావడం కాకతాళీయంగా జరిగి పోలేదు. ఒక పథకం ప్రకారం... జిందాల్ వర్సెస్ జిందాల్‌గా ఈ బిడ్డింగ్ ప్రక్రియ నడిపారు.

ఎంత దారుణమంటే!

ఈ టెండర్‌ద్వారా ప్రభుత్వానికి తీరని నష్టం చేసి ప్రైవేటుకు మేలు చేయాలన్న సంకల్పాన్ని జగన్ సర్కారు బలంగా అమలు చేసింది. కొణిజేడు-మర్లపాడు ఐరన్‌వోర్ బ్లాక్‌లో ఏపీఎండీసీ-ప్రైవేటు సంస్థ కలిపి మైనింగ్, ప్రాసెసింగ్‌తో పాటు విక్రయాల కోసం జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేయాలనేది అసలు లక్ష్యం. దీనిలో జాయింట్ వెంచర్ భాగస్వామిగా ప్రైవేటు కంపెనీ ఉంటుంది. ఎంఎండీఆర్ చట్టం-1956 ప్రకారం జాయింట్ వెంచర్‌లో గనుల లీజులున్న ఎండీసీకి 75 శాతంపైనే వాటా ఉండాలి. ప్రైవేటుకు మిగిలిన వాటా ఇవ్వాలి. కానీ, ఇక్కడ ఎండీసీకి 11%, ప్రైవేటుకు 89 శాతం వాటాను ఖరారు చేశారు. ఇది కేంద్ర చట్టాలు, నిబంధనలకు పూర్తి విరుద్ధం. జగన్ సర్కారు నిర్ణయంతో ఎండీసీకి వచ్చే లాభాలు, ప్రయోజనాలకు భారీగా కోతబడతాయి. లాభాలు ప్రైవేటుకు వెళ్తాయి. ఇలా జరగాలనే టెండర్ డిజైన్ చేయించినట్లుగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇదీ జగన్మాయ!

- ఐరన్‌వోర్ టెండర్‌కు జిందాల్ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్, జిందాల్ ఎస్ఏడబ్ల్యూ లిమిటెడ్ సంస్థలే టెండర్లు వేయడం.
- మూడో కంపెనీకి అవకాశం లేకుండా చేయడం.
- ముందస్తు స్కెచ్ ప్రకారం 'జిందాల్'కే టెండర్ కట్టబెట్టడం.
- జాయింట్ వెంచర్‌లో ప్రభుత్వ వాటాను 11% నిర్ణయించడం.
- ప్రైవేటు సంస్థ జిందాల్‌కు 89% వాటా కట్టబెట్టి లాభాలు దూసుకునేలా చేయడం.

జిందాల్‌కు లాభాల పంట

తాజా ఒప్పందం ప్రకారం జిందాల్‌కు లాభాల పంట పండనుంది. టెండర్ స్వరూపం చూస్తే ఈ విషయమే స్పష్టమవుతోంది. ప్రస్తుతం ఎండీసీకి నిర్ధారించిన వాటా(11 శాతం) ప్రకారం టన్ను ఐరన్‌వోర్ అమ్మకంపై రూ.100కు రూ.11 మాత్రమే దక్కుతుంది. జిందాల్ మాత్రం రూ.89 తన జేబులో వేసుకోనుంది. ఇక, ప్రస్తుత మార్కెట్‌లో 58-60 నాణ్యత ఉన్న టన్ను ఐరన్‌వోర్‌కు రూ.4,083 ఉంటే, దీనిలో ఎండీసీకి రూ.449.13 దక్కనుండగా, జిందాల్ రూ.3633.87 తన ఖాతాలో వేసుకుని పండగ చేసుకోనుంది.

ఎన్డీఏ కూటమికే మా మద్దతు
కూటమితోనే రాష్ట్రానికి భవిష్యత్తు

- చంద్రబాబు చేసిన అభివృద్ధిని వైసీపీ నిర్వీర్యం చేసింది
- లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ



విజయవాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి తమ మద్దతు ఉంటుందని లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ ప్రకటించారు. విజయవాడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి రాష్ట్రానికి మేలు చేస్తుందని విశ్వసిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి, పరిశ్రమలకు అవకాశం కల్పిస్తారన్న నమ్మకం తమకు ఉందన్నారు. ప్రజలు, మేధావులు, రైతులు ఆలోచించి రాష్ట్రానికి, పిల్లలకు మంచి భవిష్యత్తును చూపించే ఎన్డీఏ కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కమ్మ.. కాపులకు, రెడ్లకు మధ్య పోరాటం జరుగుతుందన్న చర్చ సాగుతోందన్నారు. అప్పులు తెచ్చి సగం జీతభత్యాలకు, మరికొంత కైంకర్యం చేసి, కొంత దుబారా చేసి, మిగిలిన నిధులను సంక్షేమానికి ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. సమాజంలో సంక్షేమం అవసరమేనని, దానికి ఒక పరిమితి ఉండాలని చెప్పారు. ఎల్లకాలం పుచ్చుకోవడం కాకుండా ఎప్పుడూ సంపాదించుకోవడం అలవాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వంలో జరుగుతున్న ఏ తప్పును ఎత్తి చూపినా వెంటనే కులం, మతం, ప్రాంతం తెరపైకి తెస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓట్లు వేసే అవకాశం ఉంటుందా? అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతోందన్నారు. అసమర్థులు, అవినీతిపరులు పాలకులుగా ఉన్నప్పుడు సంస్కరణలు సాధ్యం కావని చెప్పారు. రాష్ట్రంలో వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండి రెవెన్యూ పెంచుకోలేకపోయారని ఆక్షేపించారు. రాష్ట్రంలో పరిశ్రమలు, ఉపాధి లేవన్నారు. 20శాతం ఉండాల్సిన అప్పులు 43శాతానికి పెరిగాయన్నారు. ఉద్యోగుల బకాయిలు కలిపితే 50శాతానికి అప్పులు పెరిగాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు చేసిన అభివృద్ధిని వైసీపీ నిర్వీర్యం చేసిందని, ఈ పరిస్థితుల్లో కూటమి విజయంతో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

జేపీ నిర్ణయంపై చంద్రబాబు, లోకేశ్ హర్షం

ఎన్డీయే కూటమిని బలపర్చాలని లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ తీసుకొన్న నిర్ణయాన్ని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేశ్ స్వాగతించారు. 'ప్రజాస్వామిక పురోగామి ఆంధ్రప్రదేశ్ కోసంటీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు ఇవ్వాలని జయప్రకాశ్ తీసుకొన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. భావ సారూప్యం ఉన్న వ్యక్తులు, సంస్థలు ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి చేతులు కలపాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యం తీవ్రమైన ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ఈ సమైక్యత ఎంతైనా అవసరం' అని బుధవారం చంద్రబాబు ట్వీట్ చేశారు. మేధావి, నిష్ణాతుడైన జేపీ.. ఏపీలో ప్రజాస్వామ్య పరిరక్షణలో తన వంతు పాత్ర పోషిస్తున్నందుకు లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు.

మాకు ఇవ్వాల్సిన భూమినే అడుగుతున్నాం

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై జింపెక్స్ వివరణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి): న్యాయబద్ధంగానే తమకు భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని జింపెక్స్ కంపెనీ తెలిపింది. 'మరో బరితెగింపు..జింపెక్స్‌కు వంద ఎకరాలు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి' వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక ప్రభుత్వపెద్దలు ఆ సంస్థకు హడావుడిగా 100 ఎకరాలు కట్టబెట్టేందుకు సర్వం సిద్ధం చేశారనేది ఆ వార్త సారాంశం. దీనిపై జింపెక్స్ ప్రైవేటు లిమిటెడ్ స్పందించింది. "2008లో మంగంపేటలో బెరైటీస్ బెనిఫికేషన్ ప్లాంటు ఏర్పాటుకోసం మేం ప్రయత్నించగా, స్థానిక ప్రజలు ఆందోళనలు చేశారు. అందుకే అది ముందుకు సాగలేకపోయింది. ప్రజాభిప్రాయ సేకరణకు సహకరించాలని ఆనాటి కడప కలెక్టర్‌ను కోరినా సరైన స్పందన లేదు. స్థానిక ఆందోళనల నేపథ్యంలో మేం ముందడుగు వేయలేకపోయాం. ఆనాడు కలెక్టర్ చొరవ తీసుకోని కారణంగా మేం ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకురాలేకపోయాం. ఆ తర్వాత 2014లో తమకు రెండో విడత గడువు ఇచ్చినా అదే సమస్య ఉత్పన్నమైంది. మాకు 2008లో మంగంపేటలో కేటాయించిన 100 ఎకరాలను 2014లో ఏపీఎండీసీ తీసేసుకుంది. ఆ భూముల్లో ఏపీఎండీసీ...బెరైటీస్‌ను డంప్ చేసింది. దీనిపై మేం హైకోర్టుకు వెళ్లగా స్టేటస్‌కో ఉత్తర్వులు ఇచ్చింది. మాకు ఇచ్చిన భూమిని ఎండీసీ వాడుకుంటున్న కారణంగా, మరో చోట మాకు అంతేమొత్తంలో అంటే 100 ఎకరాల భూమిని కేటాయించాలని గత కొన్నేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం" అని జింపెక్స్ తెలిపింది.



ముద్దనూరులో రామాలయ నిర్మాణ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కోడ్ ఉల్లంఘనులు!

» ఎన్నికల సంఘం ఆదేశాలను లెక్కచేయని వైసీపీ ప్రజాప్రతినిధులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికార వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు ఏమాత్రం లెక్క చేయడం లేదు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తోసిరాజని యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి బుధవారం తన నివాసంలో రహస్యంగా 22మంది బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరులో బుధవారం జరిగిన పురాతన రామాలయం పునర్నిర్మాణ భూమి పూజా కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ముద్దనూరు రెవెన్యూ కార్యాలయంలో గోడౌన్ డీటీగా బాధ్యతలు నిర్వహిస్తున్న సుధీర్‌యాదవ్ దంపతులు పూజలో కూర్చున్నారు. దీనిపై ఎంపీడీవో చంద్రమౌళిని వివరణ కోరగా.. దీనిపై వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఇక పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అనుచరుడు కళ్లం విజయభాస్కరరెడ్డికి చెందిన కేవీఆర్ మార్టులో 1,684 చీరలను బుధవారం అధికారులు సీజ్ చేశారు. చీరల బాక్సులపై సీఎం జగన్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటోలున్నాయి. కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న చీరలను తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. మరోవైపు బాపట్ల జిల్లా రేపల్లె 1వ వార్డు కృష్ణుడి దేవాలయం వద్ద బుధవారం వైసీపీ అభ్యర్థి ఈవూరి గణేశ్ అధ్యక్షతన సభ నిర్వహించారు. పథకాల లబ్ధిదారులను మెప్మా సిబ్బంది, వలంటీర్లు సభకు తరలించారు. అనుమతి తీసుకోకుండా జనాన్ని తరలించి సభ ఎలా నిర్వహిస్తారని ఎన్నికల డీటీ, రూట్ ఆఫీసర్ నిలదీశారు. కోడ్ ఉల్లంఘనలపై కేసు నమోదు చేసినట్లు ఆర్వో హేలా సోరాన్ తెలిపారు.

సంజాయిషీ ఇవ్వండి: సబ్‌కలెక్టర్

ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఆదివారం ఉదయం షాదీఖానా నిర్మాణం జరుగుతున్న భవనం శ్లాబు ప్రారంభోత్సవంలో గిద్దలూరు వైసీపీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షంషీర్ ఆలీ బేగ్, షాదీఖానా అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, కౌన్సిలర్, ఇతర వైసీపీ నాయకులు పాల్గొన్నారు. దీనిపై ఎమ్మెల్యే రాంబాబు, ఆలీబేగ్, మరికొందరికి సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా నోటీసులు జారీ చేశారు. నాయకులు సంజాయిషీ నోటీసుకు సమాధానం పంపారు. కాగా, ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ గోడలపై సీఎం జగన్ ఫొటోలు కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

కౌంటర్ దాఖలు చేయండి

» వలంటీర్ల నియామకంపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు వలంటీర్ల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న సీఎం జగన్, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుతోపాటు సంబంధిత అధికారులు, పలువురు వలంటీర్లను ఆదేశించింది. వలంటీర్లను ఎన్నికల సంబంధ విధుల్లో పాల్గొనకుండా నిరోధిస్తూ ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు ఇచ్చిందని ధర్మాసనం గుర్తు చేసింది. ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. విచారణను మూడునెలలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. కడప జిల్లా, రాజంపేటకు చెందిన షేక్ అబూబకర్ సిద్ధిఖ్ ఈ పిల్‌ను దాఖలు చేశారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ కార్యకలాపాలలోనూ పాల్గొనకుండా గ్రామ, వార్డు వలంటీర్లను నిలువరించాలని, వారు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా నిరోధించాలని అభ్యర్థించారు.

కోడ్ ఉల్లంఘించిన సలహాదారులపై చర్యలు

» సీఈవో మీనాకు సీఎఫ్‌డీ కార్యదర్శి నిమ్మగడ్డ ఫిర్యాదు

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వ సలహాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభావశీలురైన కొంతమంది ప్రభుత్వ సలహాదారుల కోడ్ ఉల్లంఘనలు, చేసిన తప్పులను సీఎఫ్‌డీ ద్వారా ఇప్పటికే సీఈవో ముఖేశ్ కుమార్ మీనా దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. "ప్రభుత్వ సలహాదారులు ఖజానా నుంచి జీతాలు, భారీ పారితోషికాలు తీసుకుంటున్నారు. కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి ప్రయోజనం పొందే ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండాలి. కానీ చాలామంది సలహాదారులు ఇప్పటికే కోడ్‌ను ఉల్లంఘించి రాజకీయ చర్చలు, కార్యక్రమాల్లో మునిగిపోయారు. కోడ్‌ను ఉల్లంఘించిన ఈ సలహాదారులను కేంద్ర ఎన్నికల సంఘం తొలగించవచ్చు. అలాంటి వారిని సీఈవో గుర్తించి వారిపై సుమోటోగా చర్యలు తీసుకోవాలి" అని కోరినట్టు రమేశ్‌కుమార్ తెలిపారు.

రోగులతో చెలగాటం

(మొదటి పేజీ తరువాయి)

నిలిపివేశారు. దీంతో పేద రోగులు రెండు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిరుపేద రోగులకు వరం..

రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లేని వారికి, ఒకవేళ ఉన్నా.. అందులో పేర్లు ఎక్కని వారికి ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే.. వారికి ఆరోగ్యశ్రీ సేవలు అందించడం వీలు పడదు. అలాగని ఆ పేదవారు లక్షలు ఖర్చుపెట్టి వైద్యం చేయించుకునే పరిస్థితి ఉండదు. కాబట్టి అలాంటి వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఉచితంగా వైద్యం అందించేందుకు గతంలో సీఎంసీవో రిఫరల్ లెటర్ల జారీని తీసుకొచ్చారు. అనారోగ్యానికి గురైన పేదలు సీఎంసీవో రిఫరల్ లెటర్ తీసుకుని నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళ్తే, వెంటనే వారిని ఆరోగ్యశ్రీ కింద చేర్చుకుని వైద్యం అందిస్తారు. కానీ, ఇప్పుడు వాటిని నిలిపివేశారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకూ అంటే జూన్ 6 వరకూ రిఫరల్స్ జారీచేసే అవకాశం కనిపించడం లేదు. అప్పటి వరకూ ఏ కార్డూ లేని పేద రోగుల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీరికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారా.. లేదా.. అనేది చూడాలి. ఇప్పటికే జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్లు సీఎంసీవో రిఫరల్స్ జారీకి రోజుల తరబడి తిప్పించుకుంటున్నారు. దీంతోనే పేద ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే, ట్రస్ట్ పూర్తిగా రిఫరల్స్ జారీని ఎత్తేసింది. ఇప్పుడు ఏ ఆధారం లేని పేదలు వైద్యం కోసం ఎక్కడికి వెళ్లాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తాం: ఆశా

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నిలబెట్టుకోవాలని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్(ఆశా) మరోసారి లేఖ రాసింది. బకాయిలు విడుదల చేయకపోతే ఈ నెల 18 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని గత వారంలో ట్రస్ట్‌కు నోటీసులు అందించింది. దీంతో ప్రభుత్వం, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వారితో చర్చలు జరిపి, ఈ నెల 20 నాటికల్లా బకాయిలు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ, విడుదల చేయలేదు. ఉన్నతాధికారులు ఇచ్చిన మాట తప్పారు కాబట్టి ఈ నెల 24 వరకూ వేచి చూసి, అప్పటికీ ఇవ్వకపోతే తర్వాత కొత్త రోగులను ఆస్పత్రుల్లో చేర్చుకునే ప్రసక్తే లేదని ఆశా తేల్చిచెప్పింది. బకాయిల కింద రూ.1,500 కోట్లు విడుదల చేయాలని బుధవారం ఓ లేఖలో స్పష్టం చేసింది.

రాజకీయ హత్యలపై ఈసీ కన్నెర్ర

రాష్ట్రంలో హింసరహిత, రీపోలింగ్‌కు అవకాశంలేని ఎన్నికలే లక్ష్యంగా పనిచేస్తున్నాం. దురదృష్టవశాత్తు గిద్దలూరు, ఆళ్లగడ్డ, మాచర్లలో కొన్ని హింసాత్మక ఘటనలు జరిగాయి. వీటికి కారణాలు, తీసుకున్న చర్యలను తెలుసుకోవడానికి సంబంధిత జిల్లాల ఎస్పీలను పిలిపిస్తున్నాం.

ఏవైనా ఉల్లంఘనలపై అధికారులకు నేరుగా ఫిర్యాదు చేసినా ప్రొసీజర్ ప్రకారం కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అదే సీ-విజిల్ ద్వారా అయితే నిమిషాల్లోనే యాక్షన్ మొదలవుతుంది.

- సీఈవో మీనా

(మొదటి పేజీ తరువాయి)

చెందిన వాహనం తగులబెట్టడంపై నివేదిక ఇవ్వాలని సంబంధిత జిల్లాల ఎస్పీలను ఆదేశించింది. సీఈసీ అనుమతిస్తేనే డీఎస్సీ పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా బుధవారమిక్కడ అమరావతి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ఆళ్లగడ్డ, గిద్దలూరుల్లో రెండు హత్యలు జరిగాయి. మాచర్లలో ఓ రాజకీయ పార్టీకి చెందిన కారును తగులబెట్టారు. దీనిపై ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల ఎస్పీలను గురువారం సాయంత్రం నాలుగు గంటలకు సీఈవో కార్యాలయానికి రమ్మన్నాం. ఆయా సంఘటనలు ఎలా జరిగాయి.. పోలీసు దర్యాప్తులో ఏం తేలింది.. పరిస్థితిని ఎందుకు నియంత్రించలేకపోయారు తదితర వివరాలతో వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించాం. ఆ ఎస్పీలు ఇచ్చిన నివేదికలు, వివరణలు పరిశీలించి సీఈసీకి పంపుతాం. కమిషన్ ఆదేశాలను బట్టి చర్యలు ఉంటాయి. రాజకీయ హింసను ఎవరూ ప్రోత్సహించొద్దు. ఎన్నికలు రాజకీయ హింసరహితంగా జరపాలని నిర్ణయించాం. ప్రధానమంత్రి పాల్గొన్న టీడీపీ-జనసేన-బీజేపీ సభలో భద్రతా వైఫల్యం మా పరిధిలోకి రాదు. దానిపై మాకు ఫిర్యాదులు వచ్చాయి. వాటిని కేంద్ర హోం శాఖ కార్యదర్శికి పంపాం. ప్రస్తుతం అది ఆ శాఖ పరిధిలో ఉంది' అని తెలిపారు. ఇంకా ఏం చెప్పారంటే..

డీఎస్సీ వాయిదాపై తలోమాట

ఈ నెల 30వ తేదీ నుంచి జరిగే డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని కొందరు, వాయిదా వేయవద్దని మరికొందరు అభ్యర్థులు పెద్దఎత్తున మా కార్యాలయానికి మెయిల్స్ పంపారు. ఈ పరీక్షలకు దాదాపు 4.72 లక్షల మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. వారి నుంచి వాయిదా వేయాలంటూ నాకు పెద్దఎత్తున ఫోన్లు, మెయిల్స్ వస్తున్నాయి. ప్రతినిధి బృందాలు విజ్ఞాపనలను సమర్పించాయి. డీఎస్సీ నిర్వహణకు సంబంధించి విద్యాశాఖ నుంచి వచ్చే ప్రతిపాదనలను రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ ద్వారా సీఈసీకి పంపిస్తాం. వీటిపై కమిషన్ తీసుకునే నిర్ణయాన్ని బట్టి తదుపరి చర్యలు తీసుకుంటాం. సీఈసీ అంగీకరిస్తేనే డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తాం. లేకపోతే వాయిదానే. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వలంటీర్లను ప్రభుత్వ పథకాల పంపిణీకి పంపవచ్చా లేదా అనే విషయం కూడా కమిషన్ దృష్టిలో ఉంది. దీనిపై ఆదేశాలు వెలువడతాయి. అలాగే ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకు మేం పక్కకు తప్పించిన వలంటీర్లను, రాజీనామా చేసిన వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా రాజకీయ పార్టీలు నియమించుకోవచ్చా లేదా అనే అంశంపై త్వరలో స్పష్టత ఇస్తాం. సరైన సమయంలో నిర్ణయం చెబుతాం.

ప్రజాప్రతినిధులతో ఉద్యోగులు తిరగొద్దు..



ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ భవనాలపై ఉన్న రాజకీయ నేతల ఫొటోలు, ప్రకటనలను తొలగించాలని ఆదేశించాం. ప్రజాప్రతినిధులతో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ తిరగకూడదు. రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ అమలవుతోంది. అనుమతి లేకుండా రాజకీయ పార్టీలు ప్రచారాలు, రోడ్‌షోలు చేయడానికి వీల్లేదు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయి. అన్ని ఉల్లంఘనలకు సంబంధించి మూడ్రోజుల్లో 385 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆస్తుల ధ్వంసానికి సంబంధించి 94 కేసులు, వాహనాలు, లౌడ్ స్పీకర్ల దుర్వినియోగంతో పాటు చట్టవిరుద్ధమైన సమావేశాలు, ఓటర్లను ప్రేరేపించడానికి సంబంధించి 37 కేసులు నమోదయ్యాయి. నిబంధనలు ఉల్లంఘించిన వలంటీర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులపై ఫిర్యాదులు వస్తే.. మంగళవారం వరకు 46 మందిపై చర్యలు తీసుకున్నాం. తప్పులు చేసిన వలంటీర్లను, కాంట్రాక్టు ఉద్యోగులను ఉద్యోగం నుంచి తప్పించాం. ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేశాం. ఏదైనా పార్టీకి అనుకూలంగా ఉద్యోగులు వ్యవహరిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే కొందరిపై పెట్టాం. 40 కేసులు వలంటీర్లపైనే నమోదయ్యాయి. శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లో ఒక్కో వీఆర్వోను బుధవారం సస్పెండ్ చేశాం. అదే విధంగా ప్రకాశం జిల్లా జడ్పీసీఈవో, డీపీవోలపై ఫిర్యాదులు వచ్చాయి. వాటిని ఆ జిల్లా కలెక్టర్‌కు పంపాం. మంగళగిరి తహసీల్దార్‌గా పని చేసి ప్రస్తుతం నా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రాంప్రసాద్ గతంలో నా వద్దే పనిచేశారు. ఆయన డ్రాఫ్టింగ్ బాగా చేస్తారు. ఆయనపై ఎలాంటి ఆరోపణలు లేవు. నా పర్యవేక్షణలో ఉన్నారు.

భారీగా బ్యానర్లు తొలగించాం..

గత మూడ్రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులు, రాజకీయ నేతల ఫొటోలు, ప్రకటనలు అన్నీ కలిపి 1.99 లక్షల మేరకు తొలగించాం. వీటిలో 12,400 గోడరాతలు, 92 వేల పోస్టర్లు, 62 వేల బ్యానర్లు, 39 వేల ఇతర ఐటెమ్స్‌ను తీసివేశాం. అదే విధంగా ప్రైవేటు స్థలాల్లో ఉన్న 1.15 లక్షల హోర్డింగులు తొలగించాం. రూ.3.39 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్ పట్టుకున్నాం. ఇందులో ఒక్క మద్యం విలువే రూ.1.69 కోట్లు. మద్యం ఉత్పత్తి, విక్రయాలపై దృష్టిపెట్టాం. లిక్కర్ నిల్వలకు సంబంధించి సీ-విజిల్ యాప్ ద్వారా 1,307 ఫిర్యాదులు వచ్చాయి. ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు చేస్తే 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు 74 శాతం సమస్యలను పరిష్కరించాం. ఈ యాప్ ద్వారా ఎవరైనో ఫొటో, వీడియో తీసి పంపవచ్చు. ప్రస్తుతం 173 ఫ్లయింగ్ స్క్వాడ్లు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీల్లో పాల్గొంటున్నాయి. సమావేశాలు, ఇంటింటి ప్రచారానికి అనుమతుల కోసం సువిధ యాప్ ద్వారా 398 దరఖాస్తులు వచ్చాయి.

ఉస్తాద్ టీజర్‌కు పర్మిషన్ తీసుకోవాలి..

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా టీజర్ పొలిటికల్ ప్రచారం తరహాలో ఉంటే పర్మిషన్ తీసుకోవాలి. ఆ టీజర్‌ను నేను చూడలేదు. చూస్తే గానీ ఏమీ చెప్పలేం. పవన్ కల్యాణ్ గాజు గ్లాసు చూపించడంపై ఎలాంటి నిషేధం లేదు. ఎవరైనా రాజకీయ ప్రకటనలు చేసుకోవచ్చు. అయితే అనుమతులు తీసుకోవాలి.

'సిద్ధం'ను పీకేశారు

రాష్ట్రమంతా హోర్డింగులను కబ్జా చేసి 'సిద్ధం' పేరిట వైసీపీ కట్టిన హోర్డింగులను అధికారులు తొలగించారు. గడచిన రెండు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారులు, ప్రధాన కూడళ్లలోని బస్‌స్టాప్‌లలో మరో రాజకీయ పక్షానికి అవకాశం ఇవ్వకుండా 'సిద్ధం' పేరిట వైసీపీ సైన్‌బోర్డులతో నింపేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ రావడంతో భారీ హోర్డింగులు, ప్రజారవాణా సంస్థల ప్రకటనల బోర్డులు, ఇతర ప్రైవేటు సైన్ బోర్డులను రాజకీయ పార్టీలన్నిటికీ సమానంగా ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. దీంతో తమకు 27,648 హోర్డింగులకు అనుమతివ్వాలని వైసీపీ మంగళవారం కమిషన్‌ను కోరింది. అయితే అప్పటికే ఆయా హోర్డింగులను తొలగించాలని ఎన్నికల సంఘం అధికార యంత్రాంగానికి ఆదేశాలిచ్చింది. దీంతో బుధవారం జాతీయ, రాష్ట్ర రహదారులు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సైన్ బోర్డులన్నిటినీ అధికారులు తొలగించారు. అలాగే గ్రామ/వార్డు సచివాలయాల్లో ఎక్కడా ముఖ్యమంత్రి జగన్ బొమ్మ కనిపించకుండా అధికారులు తీసేశారు. ఆ సచివాలయాలకు అతికించిన పోస్టర్లను తొలగించారు.



ఈ నెల 17న ప్రొద్దుటూరులో జరిగిన దూదేకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు(ఫైల్)

వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లుపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు

ప్రొద్దుటూరు, మార్చి 20: వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై కోడ్ ఉల్లంఘన కింద ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో బుధవారం కేసు నమోదైంది. ఈ నెల 19న స్థానిక 38వ వార్డులో రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా రాచమల్లు ప్రచారం నిర్వహించారు. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు 38వ వార్డు కౌన్సిలర్ పల్లా రమాదేవి, ఆమె కుమారుడు పల్లా సురేశ్‌లపై కేసు నమోదు చేశారు. అయితే ఎమ్మెల్యేపై నమోదు చేయకపోవడంతో అధికారుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు ఆదేశాలమేరకు రాచమల్లుపైనా కేసు నమోదు చేశారు. వాస్తవానికి ఆయన ఈ నెల 17న దూదేకుల సామాజిక వర్గంతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా.. వారికి కల్యాణ మండపం నిర్మించడానికి, వారి సంక్షేమానికి సొంత నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. దీనిపై నిర్వాహకులైన పగిడాల దస్తగిరి, సి.నాగూర్‌బాబులపై టూటౌన్‌లో ఎన్నికల అధికారులు ఫిర్యాదు చేశారు. వారిపై కేసు నమోదు చేశారు. కానీ ఎమ్మెల్యే రాచమల్లుపై ఇప్పటికీ కేసు పెట్టలేదు. ఇప్పటికీ ఆయన తన ప్రచారంలో వలంటీర్లను, రేషన్ డీలర్లను, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వాడుకుంటున్నారు. దీంతో ఎన్నికల అధికారులు ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి తప్పించారు.

ఓట్ల కోసం మంత్రి కులం కార్డు

» పల్లెల్లో మంత్రి సురేశ్ అభ్యర్థనలు

సింగరాయకొండ, మార్చి 20: 'నేను మీ బిడ్డను. మీపాలె భాగస్థుడిని. మీలో ఒకడిని. మీ కుటుంబ సభ్యుడిని. జగనన్న ఆదేశాల మేరకు వైసీపీ కొండపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. ఒక్క అవకాశం ఇవ్వండి ప్లీజ్' అని సొంత సామాజికవర్గానికి చెందిన పల్లెల్లో మంత్రి ఆదిమూలపు సురేశ్ బేల అభ్యర్థనలు చేస్తున్నారు. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మేలును వివరించి ఓట్లు అడగాల్సిన మంత్రి కులం కార్డును ప్రయోగిస్తూ ఓట్లు అడుగుతుండడంపై ప్రజలు విస్తుపోతున్నారు. బుధవారం రాత్రి ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని కలికివాయి పంచాయతీ పరిధిలో 'పల్లె పల్లెకు సురేశ్' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గతంలో మాదిరిగా కాకుండా మాల, మాదిగలందరూ తనకే ఓట్లు వేయాలని కోరారు. మరోవైపు చర్చిల్లో ఆత్మీయ సమావేశాలను ఏర్పాటుచేసి పాస్టర్ల ద్వారా ఓట్లను అభ్యర్థిస్తున్నా రు. ఎమ్మార్పీఎస్‌లో ఒక వర్గం వారితో ఓటర్లకు గేలం వేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

వైసీపీ అనుకూల అధికారులను బదిలీ చేయండి

» సీఈవోకు టీడీపీ నేత షరీఫ్ లేఖ

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులను ఎన్నికల విధులను తప్పించాలని, అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తున్న అధికారులను బదిలీ చేయాలని టీడీపీ సీనియర్ నేత ఎంఏ షరీఫ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన లేఖ రాశారు. అనపర్తి డిప్యూటీ తహసీల్దార్, అన్నమయ్య జిల్లా డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ సత్యనారాయణ, చిత్తూరు ఏసీబీ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఆ జిల్లాలోని సీఐ గంగిరెడ్డి, రాయచోటి అర్బన్ ఎస్సై సుధాకర్‌రెడ్డి అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, వీరిని వేరే జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. ముద్దనూరులో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఆలయ ప్రాంగణాలను రాజకీయ సమావేశాలకు వాడుకున్న గిద్దలూరు వైసీపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఓడిపోయే సీట్లే జగన్ బీసీలకిచ్చాడు

ఐదేళ్లుగా ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల పీకలు కోసిన జగన్‌రెడ్డి ఓటమి భయంతో ఇప్పుడు సామాజిక న్యాయం అంటూ కొత్త పల్లవి అందుకున్నాడని ఎంఏ షరీఫ్ మండిపడ్డారు. ఓడిపోయే సీట్లు మాత్రమే బీసీలకు ఇచ్చారని అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

నగరంలో 'కలియుగం పట్టణంలో..' చిత్రబృందం సందడి



లబ్బీపేట, మార్చి 20: నగరంలో కలియుగం పట్టణంలో చిత్ర బృందం సందడి చేసింది. క్రైమ్, థ్రిల్లర్, లవ్, మదర్ సెంటిమెంట్‌తో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని చిత్ర కథానాయకులు విశ్వ కార్తికేయ, నరేన్ రామ్ తెలిపారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా బందర్‌రోడ్డులోని ఒక హోటల్‌లో బుదవారం జరిగిన విలేకరుల సమావేశంలో కథానాయకుడు విశ్వ కార్తికేయ మాట్లాడుతూ కనకదుర్గమ్మ దర్శనంతో తమ చిత్రం ప్రమోషన్ ప్రారంభించామని, కళాశాల విద్యార్థులతో తమ చిత్రం ఉంటుందని, బాల నటుడిగా ఎన్నో చిత్రాల్లో నటించానని తెలిపారు. మార్చి 29 ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుందని, అందరూ చిత్రాని అదరించాలన్నారు. మరో హీరో నరేన్ రామ్ మాట్లాడుతూ తాను సీనియర్ నటుడు గుమ్మడి మనవడినని చెప్పకోవడానికి గర్వపడుతున్నానని తమిళంలో రెండు చిత్రాల్లో నటించానని, తెలుగులో ఇదే తొలిచిత్రమన్నారు. చిత్ర దర్శకుడు రమణకాంత్ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని చాలెంజింగ్ తీశానని ఈ చిత్రంలోని క్రైమ్ సన్నివేశాలను ఎవరూ ఇన్స్పిరేషన్‌గా తీసుకోవద్దన్నారు. చిత్ర హీరోయిన్ ఆరుషి, నిర్మాత మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

దుర్గగుడి మహామండపంలో డ్రైనేజీ అస్తవ్యస్తం

● అధ్వానంగా మరుగుదొడ్లు



మహామండపంలో అస్తవ్యస్తంగా తయారైన మరుగుదొడ్లు, డ్రైనేజీ

వన్‌టౌన్, మార్చి 20: దుర్గగుడి మహామండపం నిర్వహణలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నిత్యం వేలాది మంది భక్తులు దర్శనానికి వస్తుంటారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు అత్యవసరంగా బాత్రూంకు వెళ్లాల్సి వస్తే ఇబ్బందులు పడక తప్పదు. ఎందుకంటే మరుగుదొడ్లు, డ్రైనేజీ నిర్వహణ అధ్వానంగా ఉంది. డ్రైనేజీపై మూతలు లేక ముక్కుపుటాలను అదరగొట్టే దుర్వాసన వస్తోంది. అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఇంజనీరింగ్ అధికారుల వైఫల్యంతో పగిలిన, లీకవుతున్న పైపులు దర్శనమిస్తున్నాయి. మూత్రశాలల్లో నేల పగుళ్లచ్చి అధ్వానంగా కనిపిస్తున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులైనా స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. మరమ్మతులకే రూ.లక్షల వ్యయం చేస్తున్నా పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని భక్తులు వాపోతున్నారు.

ఆంగ్లభాషలో కాలానుగుణంగా వచ్చేమార్పులు తెలుసుకోవాలి

● ప్రొఫెసర్ హరి పద్మారాణి

మొగల్రాజపురం: కాలానుగుణంగా ఆంగ్ల భాషలో వస్తున్న మార్పులు, పోకడలను ఆంగ్ల ఉపాధ్యాయులు తెలుసుకుంటూ ఉండాలని పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం తిరుపతి ప్రొఫెసర్ పి. హరి పద్మారాణి చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాలలో కంటెంపరరీ సినారియోస్ ఇన ఇంగ్లీషు లిటరేచర్ అండ్ లాంగ్వేజ్ అనే అంశంపై 2 రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఆంగ్ల భాషను బోధించే ఉపాధ్యాయులు మార్పులను అందిపుచ్చుకున్నపుడే విద్యార్థులకు సమర్థవంతంగా బోధించే అవకాశం ఉంటుందన్నారు. యూనివర్సిటీ ఆఫ్ తిరానా, అల్బీనియా ఇంగ్లీషు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌హెచ్ ప్రీసదడెలిజ మాట్లాడుతూ నూతనంగా ఆంగ్ల భాష అభ్యసించే వారికి ఉచ్చారణ, హాస్యం గురించి విద్యార్థులు ఎలా లబ్ధి పొందాలో చెప్పారు. మరో ప్రొఫెసర్ డాక్టర్ రోజనా బెల్లి మాట్లాడుతూ ఆంగ్లం నుంచి చేసే అనువాదాల్లో మెలకువలను చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ జంపాల, ఆంగ్ల విభాగాధిపతి, డాక్టర్ జి.శ్రీలత, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ పోర్టు-పుదుచ్చేరి రైలు వారానికి 3 సార్లు

● కాకినాడ పోర్టు-చెంగల్పట్టు వారానికి 4సార్లు

రైల్వేస్టేషన్: కాకినాడ పోర్టు-చెంగల్పట్టు రైలు (17644) ఈ ఏడాది జూలై 8 నుంచి సోమ, మంగళ, శుక్ర, శనివారాల్లో (వారానికి 4 సార్లు) నడుస్తుంది. ఇదే రైలు (17643) నెంబరుతో చెంగల్పట్టు-కాకినాడ పోర్టు మధ్య మంగళ, బుధ, శని, ఆదివారాల్లో (వారానికి 4సార్లు) నడుస్తుంది. ఈ ఏడాది జూలై 9 నుంచి ఈ మార్పు అమలవుతోంది. కాకినాడ పోర్టు-పుదుచ్చేరి (17655) రైలు వారంలో 3 సార్లు నడుస్తుంది. ఆది, బుధ, గురువారాల్లో ఈ రైలు పుదుచ్చేరి వరకు వెళుతోంది. ఈ ఏడాది జూలై 10 నుంచి అమల్లోకి రానున్నది. ఇదేరైలు 17656 నెంబర్‌తో పుదుచ్చేరి-కాకినాడ మధ్య వారానికి 3 సార్లు సోమ, గురు, శుక్రవారాల్లో నడుస్తుంది. జూలై 8నుంచి అమల్లోకి రానున్నట్టు పీఆర్‌వో నూస్రత్ ఎం మం ద్రూష్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొప్పుల వెలమలకు దక్కని రాజ్యాంగ పదవులు

● సంఘం నేత పోల జగన్

ధర్నాచౌక్: ఉత్తరాంధ్రలో అధిక జనాభా కలిగిన కొప్పుల వెలమ సామాజిక వర్గానికి టీడీపీ తరఫున అనకాపల్లి, విజయనగరం పార్లమెంట్ సీట్లను కేటాయించాలని కొప్పుల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల జగన్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జనాభా ప్రాతిపదికన రావాల్సిన ఎమ్మెల్యే, ఎంపీ వంటి రాజ్యాంగ పదవులు వెలమలకు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో తమ సామాజిక వర్గం హక్కుల సాధన కోసం పార్లమెంట్‌లో తమ వాణి వినిపించేందుకు టీడీపీ ఇంతవరకు ప్రకటించని ఆయా పార్లమెంట్ స్థానాలను టీడీపీలో ఉన్న కొప్పుల వెలమలకు కేటాయించాలన్నారు. దీంతో వెలమల వలసలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మీటర్ రీడర్లకు 10+2 అమలు చేయాలి

● సీపీడీసీఎల్ అధికారులకు వినతి

విజయవాడ: విద్యుత్ శాఖలో మీటరు రీడర్లకు 10+2 పని దినాలను అమలు చేయాలని రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ సంఘం సీపీడీసీఎల్ అధికారులకు బుధవారం విన్నవించింది. ముందుగా తమకు 20 రోజులు పని దినాలుండేవని, వైసీపీ ప్రభుత్వం వాటిని 9 రోజులకు తెచ్చిందని సంఘ ప్రతినిధులు వివరించారు. తర్వాత ఈ పని దినాలను 7 రోజులకు కుదించారన్నారు. ఇటీవల జేఎండీ మల్లారెడ్డి ద్వారా జరిగిన చర్చల్లో 10+2 పనిదినాలు కల్పించడానికి డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు అంగీకరించాయన్నారు. 10 రోజులు మీటర్ రీడింగ్‌లు, మిగిలిన రెండు రోజులు డోర్‌లాక్‌లకు సంబంధించి రీడింగ్‌లు తీయడానికి అంగీకరించినా ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. తక్షణమే ఈ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

గ్రూప్-1 అభ్యర్థులకు గ్రేస్ మార్కులేసి మెయిన్స్‌కు పంపాలి

● ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

భవానీపురం: ఏపీపీఎస్సీ ఇటీవల నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో అనువాద లోపాలు, కొన్ని ప్రశ్నలు అర్థం కాకపోవడంతో చాలామంది తెలుగు మీడియం అభ్యర్థులు నష్టపోయారని, అందుకే మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రీజనింగ్, మెంటల్ ఎబిలిటీలో ప్రశ్నలు కష్టంగా ఉండటంతో అభ్యర్థులు 1:100 రేషియోలో మెయిన్స్‌కు అభ్యర్థుల జాబితా తయారు చేయాలని కోరారు.

ప్రజారవాణా ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

బస్టేషన్: ప్రజారవాణా సంస్థలో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఆఫీస్ సిబ్బందికి ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని ప్రజారవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనియన్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. డ్రైవర్లు, కండక్టర్లు లాంగ్ డ్యూటీల్లో ఉండడం వల్ల ఓటింగ్‌కు దూరంగా ఉంటున్న సందర్భం ఉంటుందన్నారు. మెకానిక్ సిబ్బంది, ఆఫీసు సిబ్బందికి అత్యవసర సమయాల్లో దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులున్నాయని, ఎన్నికల తేదీన ఇతర ప్రాంతాల్లో డ్యూటీలోని డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సిబ్బందికి పోస్టల్‌బ్యాలెట్ కల్పించాలని కోరారు.

మాకివ్వాల్సింది మాకిచ్చెయ్..

● వీఎంసీలో పైసలిస్తే నిబంధనలకు పాతర

నీకు నచ్చింది చేసుకో..!

● అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు ● పట్టించుకోని అధికారులు

చిట్టినగర్, మార్చి 20: ప్లాన్ పెట్టుకో.. మాకివ్వాల్సింది మాకు ఇచ్చేయ్, నీకు ఇష్టం వచ్చినట్టు కట్టుకో అన్నట్టుంది వీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు. పైసలిస్తే నిబంధనలతో పనిలేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేసుకోవచ్చు. లేకుంటే అడ్డుకుంటారు. వీఎంసీ టౌన్ ప్లానింగ్‌లో కొందరు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు కాసులకు కక్కుర్తి పడి నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. అడ్డగోలుగా ఆన్‌లైన్ ప్లాన్‌లిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. పేదవాళ్లు చిన్న నిర్మాణం చేసుకుంటే సెట్ బ్యాక్‌ల పేరుతో ముప్పతిప్పలు పెట్టే అధికారులు కాసులిచ్చే వారికి మాత్రం అడ్డగోలుగా అనుమతులిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో మాస్టర్‌ప్లాన్ ప్రకారం అనుమతులుంటాయి. కానీ అధికారులు వాటిని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా ప్లాన్‌లు ఇస్తున్నారు. కొత్తపేట, చిట్టినగర్, కేటీరోడ్డు. టైలర్‌పేట, గొల్లపాలెం గట్టు, కె.ఎల్.రావునగర్ యార్డు రోడ్డు తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

46వ డివిజన్ కేటీరోడ్డులో..

46వ డివిజన్ కేటీరోడ్డు మేయర్ కార్యాలయం ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుంది. ఒకదానికి ప్లాన్ తీసుకొని మరో నిర్మాణం చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్లాన్ ఇవ్వాలి. కానీ ఎలాంటి సెట్ బ్యాక్‌లు వదలకుండా అడ్డగోలుగా నిర్మిసుతన్నా అధికారులు మాత్రం కాసులు తీసుకొని కళ్లు మూసుకున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ ప్రాంతాల్లో కొన్ని సందర్భాల్లో ప్లాన్ కూడా ఇవ్వరు. ప్లాన్ ఇచ్చినా రోడ్డు విస్తరణకు అనుకూలంగా సెట్ బ్యాక్‌లు వదలాల్సి ఉంటుంది. అలా చేస్తేనే సుమారు 15 నుంచి 20 అడుగులు వదలాల్సి ఉంటుంది. దీంతో ఆ నిర్మాణానికి గిఫ్ట్ డీడ్ లేకుండా తూతూమంత్రంగా అండర్ టేకింగ్ లెటర్ తీసుకొని ప్లాన్ ఇచ్చారు. గృహఅవసరాల కోసంమని ప్లాన్ తీసుకొని వ్యాపారం చేసుకునేలా నిర్మాణం చేపట్టినా అధికారులు పట్టించుకోలేదు.

టేనర్‌పేట, కేఎల్ రావునగర్ యార్డు రోడ్డులో..

టేనర్‌పేటలో ముక్కా వెంకట రమణ కల్యాణ మండపం ప్రాంతంలో ఓ అక్రమ నిర్మాణానికి స్థానిక నేత, టౌన్‌ప్లానింగ్ అధికారులు లక్షల్లో తీసుకొని అనుమతులిచ్చినట్టు బహిరంగానే మాట్లాడుతున్నారు. కె.ఎల్.రావునగర్ యార్డురోడ్డులో ఓ భారీ నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతుంది. తొలుత జీ ప్లస్ టూ నిర్మాణం ప్లాన్ తీసుకొని రువాత సిల్ట్ జీ ప్లస్ టుగా అనుమతి తీసుకొని ఒక ఫ్లోర్ నిర్మాణం చేస్తున్నారు. ఎటువంటి సెట్ బ్యాక్‌లు వదలకుండా రోడ్డును అక్రమించుకుని నిర్మిస్తున్నారు. అదేమంటే అధికారులు ప్లాన్ ఉందని చెబుతున్నారు. ఒకవైపు సెట్ బ్యాక్‌లు వదలకపోవడంతో నిర్మాణం సైడ్ డ్రెయిన్‌పైకి వచ్చింది. భవిష్యత్‌లో రెండోవైపు రోడ్డు విస్తరించాలన్నా సాధ్యపడని విధంగా నిర్మిస్తున్నారు. అధికారులు మొదట్లో పట్టించుకోకపోవడంతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా రోడ్లు, డ్రెయిన్లు విస్తరణ చేయాలన్నా సాధ్యంకాని పరిస్థితి. గతంలో సెట్ బ్యాక్‌లకు సంబంధించి రెండు మూడ డుగులకు భవిష్యత్ అవసరాల దృష్ట్యా వీఎంసీ భవన యజమానుల నుంచి గిఫ్ట్‌డీడ్ తీసుకుంది. దీంతో రోడ్డు విస్తరణ చేయాలన్నా, డ్రెయిన్లు విస్తరించాలన్నా భవన యజమానుల అనుమతితో పని లేకుండా నిర్మించుకునే అవకాశం ఉంటుంది. గిఫ్ట్ డీడ్ లేకుండా భవిష్యత్‌లో ఆయా ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు విస్తరించాలన్నా భవన యాజమానులు కోర్టులకు వెళ్లి అభివృద్ధి పనులను అడ్డుకునే వీలుంది. ఇప్పటికైనా కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి ఆయా నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కేటీరోడ్డులో మేయర్ కార్యాలయం ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణం



ఎనికేపాడు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాల గురించి వివరిస్తున్న యార్లగడ్డ జ్ఞానేశ్వరి

రాష్ట్రాభివృద్ధికి టీడీపీని గెలిపించడండి

● యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి

గుణదల, మార్చి 20: అభివృద్ధి పరంగా అట్టడుగుకు చేరిన రాష్ట్రాన్ని తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చి, అభివృద్ధి పథంలో నడిపించే సత్తా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు మాత్రమే ఉందని గన్నవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి అన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని ఎనికేపాడులో బుధవారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న సంక్షేమ పథకాల గురించి మహిళలకు ప్రత్యేకంగా వివరించారు. టీడీపీ హయాంలో మహిళలకు సముచితస్థానం లభించిందని వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ బలపర్చిన యార్లగడ్డ వెంట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. వైసీపీ పెడుతున్న ప్రలోభాలకు ఎవరూ తలొగ్గవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చాగంటిపాటి వెంకటకృష్ణ, పార్టీ సీనియర్ నేత కోనేరు శివరామకృష్ణ (పెదబాబు), కోనేరు వెంకట నారాయణ, కోనేరు సందీప్, వెల్లంకి శరత్ కుమార్, గోగం బాలకోటేశ్వరరావు, పొదిలి లలిత, ముప్పా విజయలక్ష్మి, గోగం ఉషారాణి, వరికూటి కోటేశ్వరరావు, కొడాలి సుబ్బారావు, దయమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేయాలి

● దుర్గగుడి ఈవో రామారావు

వన్‌టౌన్, మార్చి 20: దుర్గగుడి అభివృద్ధికి ప్రతి అధికారి, ఉద్యోగి తమవంతు పాత్రను పోషించాలని ఈవో కేఎస్ రామారావు సూచించారు. మహామండపం 4వ అంతస్తులోని ఈవో కార్యాలయంలో బుధవారం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బడ్జెట్‌లో ఏ ఏ ప్రాధాన్యత గల అంశాలకు చోటిచ్చారన్న దానిపై కూలంకషంగా చర్చించారు. వచ్చే వేసవిలో భక్తులకు వసతి కల్పన, ఉన్నవాటిని మెరుగుపర్చుట, ఆర్జిత పూజల్లో మెరుగైన సదుపాయాలు, కౌంటర్ల నిర్వహణ వంటి వాటిపై సమీక్షించారు. మరోవైపు ఆలయంలో జరిగే ప్రతి పూజ ఇతర సేవలను భక్తులకు మరింతగా చేరవేసేందుకు సోషల్‌మీడియా వినియోగం వంటి వాటిపై సూచనలు చేశారు. పూజల ప్రత్యక్ష ప్రసారంతో పాటు కనకదుర్గ ప్రభ మాసపత్రికను భక్తులకు మరింత చేరువ చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆధ్యాత్మికతను పెంచే అంశాలను చేర్చాలని సూచించారు. ఆదాయాన్ని మెరుగుపరచేందుకు అవకాశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గదులు, శానిటేషన్, అభివృద్ధి పనులు, రవాణాను మెరుగుపర్చడం, ప్రొటోకాల్, విరాళాలపై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించారు. అధికారులు రాజీ పడకుండా ఆలయాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇంజనీర్లు కేవీఎస్ కోటేశ్వరరావు, లింగం రమాదేవి, ఇంజనీరింగ్ సిబ్బంది, ఏఈవోలు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయ అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న ఈవో కేఎస్ రామారావు

వృద్ధాప్యంలో ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

● జీర్ణకోశ వైద్య నిపుణుడు చింతవీర అభినవ్

గవర్నర్‌పేట, మార్చి 20: సరైన ఆహార నియమాలతో వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్త పడవచ్చని జీర్ణకోశ వైద్య నిపుణుడు చింతవీర అభినవ్ తెలిపారు. సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం బందరు లాకుల సెంటర్‌లోని సంఘ కార్యాలయంలో జరిగింది. అనంతరం సీనియర్ సిటిజెన్స్ కు ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ న్యాయవాది చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధులకు పలు న్యాయ సమస్యల పరిష్కారానికి చట్టంలోని రక్షణను వివరిరించారు. సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేమూరి బాబూరావు, మోతుకూరి వెంకటేశ్వరరావు, పిల్లల వైద్య నిపుణుడు చలసాని అనూషా, సీనియర్ న్యాయవాది కేవీవీ పరమేశ్వరరావు, సంఘ సహాయ కార్యదర్శి డి. సాంబశివరావు, నాదెళ్ల సుమతి, సామాజిక కార్యకర్త మోతుకూరి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



గురునాథం జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న న్యాయవాదులు

ఘనంగా కాంగ్రెస్ లీగల్‌సెల్ చైర్మన్

గురునాథం జన్మదిన వేడుకలు

విజయవాడ లీగల్, మార్చి 20: బెజవాడ బార్ అసోసియేషన్‌లో మాజీ బార్ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు, పీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ లీగల్‌సెల్ చైర్మన్ వి.గురునాథం 72వ జన్మదిన వేడుకలను బార్ న్యాయవాదులు బుధవారం ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులందరూ గురునాథానికి పూలమాలలు వేసి దుశ్శాలువాతో సత్కరించారు. న్యాయవాదులు మట్టా జయకర్, గద్దం రాజేశ్వరరావు మాట్లాడుతూ న్యాయవాదులకు ఏ కష్టం వచ్చినా ఆదుకొనే మంచి మనస్సున్న గురునాథం జన్మదినాన్ని బార్ అసోసియేషన్‌లో నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం గురునాథం చేత కేక్ కట్ చేయించి న్యాయవాదులు ఆయనకు తినిపించారు. వి.కిరణ్, రాజా, బుచ్చిబాబు, గంధం శ్రీనివాసరావు, కండెల వరప్రసాద్, జయలక్ష్మి, గద్దం రవి పాల్గొన్నారు.

అధికార భాష అనువాదాలకు

కాంతస్త్ర యాప్, వెబ్ సాఫ్ట్‌వేర్ వినియోగించండి

రైల్వేస్టేషన్, మార్చి 20: అధికార భాష అనువాదాలకు కాంతస్త్ర యాప్, వెబ్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించాలని డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. డీఆర్‌ఎం కార్యాలయంలో బుధవారం జరిగిన అధికార భాష అమలు కమిటీ 186వ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికార భాష అమలులో డివిజన్‌ను ముందంజలో ఉంచినందుకు అయన అధికారులు, సిబ్బందిని అభినందించారు. జ్ఞాన్‌గ్రంథ్ ద్వారా డివిజన్‌లో రోజువారీ ప్రాతిపదికన హిందీని వినియోగించేందుకు ప్రోత్సాహమిస్తున్నట్టు తెలిపారు. వార్షిక లక్ష్యం 30శాతమే ఉన్నా 83.02 శాతానికి తీసుకువెళ్లినందుకు అభినందనలు తెలిపారు. ఈనెల 15న ఉదయ్‌పూర్‌లో జరిగిన ఆలిండియా రైల్వే నేషనల్ హిందీ డ్రామా పోటీల్లో సర్వనీతి డ్రామాను ప్రదర్శించి మొదటి స్థానంలో నిలవడంతో పాటు మొత్తం 15 బహుమతులను దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు ప్రాతినిధ్యం వహించిన విజయవాడ సిబ్బంది గెలుచుకున్నారు. ఉత్తమ దర్శకుడు, సంగీతం వంటి పలు విభాగాలలో బహుమతులు పొందారు. వీరిని డీఆర్‌ఎం అభినందించారు. ఆపరేషన్స్ అదనపు డీఆర్‌ఎం ఎం శ్రీకాంత్, మౌలిక సదుపాయాల డీఆర్‌ఎం వీఈ ఎడ్విన్, రాజభాష అధికారి ఆశా మహేష్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం పాటిల్



పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ కబడ్డీ జట్టు

కబడ్డీ చాంపియన్‌షిప్‌కు ఏపీ జట్టు పయనం

విజయవాడ స్పోర్ట్సు, మార్చి 20: మహారాష్ట్రలోని అహ్మదానగర్ వాదా పార్కు స్పోర్ట్సు కాంప్లెక్సులో ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే 70వ సీనియర్ జాతీయ పురుషుల కబడ్డీ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టు బుధవారం అక్కడకు పయనమైందని, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కెప్టెన్‌గా తోట కుమార్ సీతారామతేజ వ్యవహరిస్తాడని, మేనేజర్ ఎం.సుబ్బరాజు, కోచ్‌గా పి.సతీష్‌కుమార్ వ్యవహరించనున్నారు.

జట్టు ఇదే... బి.శశికుమార్, కుంచాల శ్రీకాంత్, కోట హరిప్రసాద్‌రెడ్డి, పిట్టా వెంకట దుర్గారావు, గోపినీడి పవన్ కుమార్, తోట కుమార్ సీతారామతేజ, గాలి లక్ష్మారెడ్డి, ప్రీతి శ్రీశివతేజేష్, ఉనికిలి చంగళరావు, చెక్కా నాగబాబు, వాకా ఇమ్మాన్యేయేల్, పొట్ల గోపిచంద్ ఎంపికయ్యారు.

మోడరన్ ఖోఖో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా అప్పలస్వామి, ప్రసాద్



అప్పలస్వామి, రంభా ప్రసాద్

విజయవాడ స్పోర్ట్సు: రాష్ట్ర మోడరన్ ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా నగరానికి చెందిన ఆర్.అప్పలస్వామి, రంభా ప్రసాద్, ట్రెజరర్‌గా సీ.అన్వర్‌భాషా (అనంతపురం) నియమితులయ్యారు. ఈ మేరకు మోడరన్ ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సుభాష్ పల్‌దేశాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. రంభా ప్రసాద్ ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, షూటింగ్‌బాల్ అసోసియేషన్‌ల్లో కీలక పదవులను నిర్వహించారు. రంభా ప్రసాద్ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్‌లో మోడరన్ ఖోఖోను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ఫ్రంట్ నేతలు

అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ

● థర్డ్‌ఫ్రంట్ నేతలు

ధర్నాచౌక్, మార్చి 20: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ, మన రామరాజ్యం పార్టీ, జనతా కాంగ్రెస్, ప్రజా సోషలిస్టు కూటమి కలిసి ఏర్పడిన థర్డ్‌ఫ్రంట్ అభ్యర్థులు అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తారని ఫ్రంట్ నేతలు వెల్లడించారు. గాంధీనగర్‌లోని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. కేబీ శ్రీధర్, మావులేటి ధనేష్, పద్మాకర్ వైజాగ్, మహేష్, అంజనీదేవీ, భాస్కర్, పావని, కట్టా రమేష్, బాలాజీ, లాం జయబాబు పాల్గొన్నారు.



ద్వారకా తిరుమలరావును అభినందిస్తున్న యూనియన్ నాయకులు

ఏఎస్ఆర్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన

ద్వారకా తిరుమలరావుకు అభినందనలు

బస్టేషన్, మార్చి 20: జాతీయ స్థాయిలో ఆర్టీసీకి ఐదు అవార్డులు సాధించడంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న రోడ్డు రవాణా సంస్థలకు సంబంధించి అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ (ఏఎస్ఆర్‌టీయూ) జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు బుధవారం ఆర్టీసీ ఎంప్లాయీస్ రాష్ట్ర కమిటీ తరపున నేతలు అభినందనలు తెలిపారు. ఆర్టీసీహౌస్‌లో ద్వారకా తిరుమలరావును కలిసిన ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, నేతలు ఎండీఏ సిద్ధిక్, టీవీ భవాని, కే.కోటేశ్వరరావు, మందపాటి శంకర్‌రావు, షేక్ మొహిద్దీన్, బీఎస్ నారాయణ, జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరరావు ద్వారకా తిరుమలరావును పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువాతో సత్కరించారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

మీడియా సెంటర్ కలెక్టర్ పరిశీలన

కృష్ణలంక, మార్చి 20 : సాధారణ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాలకు అందచేసి ప్రజలకు తెలియజేసేలా మీడియా సెంటర్ ఏర్పాట్లు వుండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులకు సూచించారు. మీడియా సెంటర్ ఏర్పాటు పనులను పరిశీలించేందుకు కలెక్టర్ బుధవారం ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలో ఉన్న డీపీఆర్‌వో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాధారణ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపధ్యంలో ఈసీఐ సూచనల మేరకు ఎన్నికల సమగ్ర సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు అందించాల్సిన అవసరం వుందన్నారు. జిల్లాలోని 7అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రసార మాధ్యమాల సహకారం ఎంతో అవసరమన్నారు. జిల్లా లో నియోజకవర్గాల మ్యాపులు, ఓటర్ల వివరాలు, పోలింగ్ స్టేషన్ల వివరాలు, ఎన్నికల అధికారుల వివరాలను ప్రత్యేక బోర్డుల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా రూ పొందించిన నివేదికల సమాచారాన్ని మీడియా సెంటర్‌లో ఎప్పటికప్పుడు అందుబాటులో వుంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో వి.శ్రీనివాసరావు, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహనరావు, అదనపు పీఆర్వో కె.రవి, ప్రచార సహాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి అభిషేక్‌కు మధ్యంతర బెయిల్

- ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు నిందితుడికి 4 వారాల పాటు బెయిల్ ఇచ్చిన సుప్రీం కోర్టు
- ఈడీ కేసుల్లో ట్రయల్స్ జాప్యంపై తీవ్ర అసహనం



న్యూఢిల్లీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన బోయినపల్లి అభిషేక్‌కు సుప్రీంకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. లిక్కర్ కేసులో 2022 అక్టోబరులో అరెస్టయిన అభిషేక్.. గత ఏడాది నవబరు 20న అభిషేక్ సుప్రీం కోర్టులో స్పెషల్‌లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ సంజీవ్ కన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అభిషేక్ ఇప్పటికే 19 నెలల నుంచి జైల్లోనే ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. అభిషేక్ భార్య అనారోగ్యంతో బాధ పడుతున్నందున బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ వాదనలపై ఈడీ తరపున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు అభ్యంతరం తెలిపారు. ఈక్రమంలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. ఈడీ కేసుల్లో ట్రయల్స్ జాప్యంపై అసహనం వ్యక్తం చేసింది. అభిషేక్‌కు 4 వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ట్రయల్ కోర్టు విధించిన షరతులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. మొబైల్ నంబర్‌ను ఈడీ అధికారులకు ఇవ్వాలని, పాస్‌పోర్టు సరెండర్ చేయాలని, హైదరాబాద్ వెళ్లి భార్యకు చికిత్స చేయించుకుని తిరిగి రావాలని సూచించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేసింది.

అన్ని అంశాలు అధ్యయనం చేసి రండి: హైకోర్టు

- 'రాజధాని రైతులకు కౌలు' కేసులో పిటిషనర్‌కు సూచన

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూసమీకరణ పథకం కింద భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వ ఖజానా నుంచి వార్షిక కౌలు చెల్లించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. సీఆర్డీఏ చట్టాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన యాక్ట్‌లో భూసమీకరణ పథకానికి చట్టబద్ధత కల్పించడంతో పాటు భూములు ఇచ్చిన రైతులకు రక్షణ కల్పించారని గుర్తుచేసింది. ఈ తరువాత సీఆర్డీఏ రద్దు చట్టాన్ని సైతం ప్రభుత్వం ఉపసంహరించుకుందని ఈ నేపథ్యంలో తదనంతర పరిణామాలపై అధ్యయనం చేసి కోర్టు ముందుకు రావాలని పిటిషనర్‌కు సూచించింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. పిటిషనర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ యునైటెడ్ ఫ్రంట్ నార్త్ ఆంధ్రా జిల్లాల అధ్యక్షుడు పాక సత్యనారాయణ తరఫున న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపించారు.

అచ్చెన్న ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు దాఖలు చేసిన పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని సీఐడీని ఆదేశిస్తూ న్యాయస్థానం విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఆదేశాలిచ్చారు.

గల్లా జయదేవ్ ఎన్నికపై మోదుగుల పిటిషన్ కొట్టివేత

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ తరపున గుంటూరు ఎంపీగా గల్లా జయదేవ్ ఎన్నికను సవాల్ చేస్తూ నాటి వైసీపీ అభ్యర్థి మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్(ఈపీ)ను హైకోర్టు కొట్టివేసింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు విషయంలో మోదుగుల లేవనెత్తిన అభ్యంతరాలను తిరస్కరించింది. ఫాం 13బీలో బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్ నమోదు చేయని పక్షంలో వాటిని తిరస్కరించవచ్చని ఎన్నికల నిబంధనలు చెబుతున్నాయని గుర్తు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు బుధవారం తీర్పు ఇచ్చారు. మోదుగుల తరఫున న్యాయవాది వీఆర్‌ఎన్ ప్రశాంత్, గల్లా జయదేవ్ తరపున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, న్యాయవాది ఎం.బాలాజీ వాదనలు వినిపించారు.

'ఉమ్మడి రాజధాని' పిల్ కొట్టివేత

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు హైదరాబాద్‌ను మరో పదేళ్ల ఉమ్మడి రాజధానిగా కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)ను హైకోర్టు కొట్టివేసింది. ఇదే వ్యవహారంపై దాఖలు చేసిన ఒక పిల్‌ను ఇప్పటికే కొట్టివేశామని గుర్తు చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి దాఖలు చేసిన ఈ పిల్ బుధవారం విచారణకు రాగా, పిటిషనర్ తరఫు న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) సి.సుమన్ వాదనలు వినిపించారు.

తక్కువ ధరలకే బెస్ట్ లిథియం మెటల్ బ్యాటరీలు!

- టీఐఎఫ్‌ఆర్ శాస్త్రవేత్తల ఘనత

హైదరాబాద్, మార్చి 20: తక్కువ ధరలకే సురక్షితమైన, నాణ్యమైన లిథియం మెటల్ బ్యాటరీలను తయారు చేసే విధానాన్ని హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్‌ఆర్) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఎలక్ట్రికల్ వాహనాలతో పాటు ఎలక్ట్రానిక్ సాధనాల్లో ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీల కంటే లిథియం మెటల్ బ్యాటరీల్లో పది రెట్లు అధిక సామర్థ్యముంటుంది. అయితే వీటిని ఉపయోగించే సమయంలో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. వేగంగా చార్జింగ్ చేసేందుకు ఇవి అనుకూలంగా లేకపోవడం, అతిగా వేడెక్కడం వల్ల షార్ట్ సర్క్యూట్ కావడం వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను నివారించి అధిక స్టోరేజ్ సామర్థ్యమున్న లిథియం మెటల్ బ్యాటరీలను తయారు చేయడంపై టీఐఎఫ్‌ఆర్‌కు చెందిన టీఎన్ నారాయణన్ నేతృత్వంలో శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపి సఫలీకృతులయ్యారు. దీనిపై శాస్త్రవేత్తలు ప్రీతి యాదవ్, పల్లవి ఠాకూర్ మాట్లాడుతూ.. 'గ్రాఫైట్ పొడిని ఉపయోగించి బ్యాటరీలోని ఎలక్ట్రోడ్లను విడివిడిగా ఉంచడంతో పాటు వేర్ల వంటి పదార్థం అభివృద్ధి చెందకుండా చేయడంలో విజయం సాధించాం. ఈ చిన్న మార్పు వల్ల దీర్ఘకాలం ఉపయోగించే వీలున్న లిథియం మెటల్ బ్యాటరీలను తక్కువ ధరలకు అందించవచ్చు' అని వివరించారు.

సత్వరమే యుద్ధాన్ని ముగించండి!

- పుతిన్, జెలెన్‌స్కీలకు మోదీ ఫోన్

న్యూఢిల్లీ, మార్చి 20: రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ప్రధాని మోదీ బుధవారం వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని త్వరగా ముగించాలని, సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఇరుదేశాలకు ఆయన సూచించారు. అయిదోసారి రష్యా అధ్యక్షుడిగా గెలుపొందినందుకు పుతిన్‌కు అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో భారత్- రష్యా మధ్య ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు అంగీకారం కుదిరినట్లు మోదీ ఎక్స్(ట్విటర్) వేదికగా వెల్లడించారు. జెలెన్‌స్కీతో మాట్లాడుతూ.. రష్యా- ఉక్రెయిన్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు చేసే ప్రయత్నాలకు భారత్ మద్దతు కొనసాగుతుందని మోదీ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత మోదీని తమ తమ దేశాలకు రావాల్సిందిగా పుతిన్, జెలెన్‌స్కీఆహ్వానించారని అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి బిహార్ నేత పప్పు యాదవ్

న్యూఢిల్లీ, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల వేళ బిహార్‌లో రాజకీయాలు వేగంగా మారిపోతున్నాయి. గతంలో ఐదుసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన, ప్రాంతీయ పార్టీ జన్ అధికార్ అధినేత రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఈ సందర్భంగా పప్పు యాదవ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మోదీ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడతానని అన్నారు. కాంగ్రెస్, ఆర్జేడీ కలిసి పోటీ చేయడం వల్ల లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. పప్పు యాదవ్ భార్య రణ్‌జీత్ రంజన్ ప్రస్తుతం కాంగ్రెస్ తరఫున రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. బిహార్‌లోని సీమాంచల్ ప్రాంతంలో పేరున్న పప్పు యాదవ్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు బీఎస్పీ బహిష్కృత ఎంపీ డానిష్ ఆలీ కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఆయన ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



అమెరికా నేవీ అధికారులతో తూర్పు నౌకాదళం అధికారులు

టైగర్ ట్రయంఫ్-24కు అమెరికా నిఘా విమానం

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): టైగర్ ట్రయంఫ్-24లో అమెరికా నిఘా విమానం పాల్గొననుంది. భారత్, అమెరికా సంయుక్తంగా తూర్పుతీరంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయంఫ్-24 విన్యాసాల్లో పాల్గొనడానికి అమెరికా నిఘా విమానం పీ-8ఏ, వైమానిక దళానికి చెందిన సీ-130జె, సి-146 విమానాలు బుధవారం విశాఖపట్నంలోని ఐఎన్‌ఎస్ డేగాకు చేరుకున్నాయి. ఇవి భారత నేవీ, సైనిక దళాలతో కలిసి పనిచేస్తాయి.

కోడ్‌లో మేసే యత్నం!

- పర్యాటక యూనిట్లు ప్రైవేటుకు అప్పగించే కుట్ర
- కాంట్రాక్టర్లతో ఏపీటీడీసీ ఉన్నతాధికారుల రహస్య భేటీ
- సెక్యూరిటీ కనుసన్నలలో నిర్వహణ
- అగ్రిమెంట్ కాని పనులు బలవంతంగా చేయించేందుకే..
- వర్క్ ఆర్డర్ ఇవ్వని పనులు కూడా..
- ఇంజనీరింగ్ విభాగంపైనా ఒత్తిళ్లు
- ప్రభుత్వం మారితే.. విజిలెన్స్ విచారణే?
- భయంతో కాంట్రాక్టర్ల వెనకడుగు

విజయవాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పర్యాటక యూనిట్లలో మరమ్మతులు, మెయింటెనెన్స్ చేపట్టే కాంట్రాక్టర్లతో ఏపీటీడీసీ ఉన్నతాధికారులు అత్యంత రహస్యంగా సమావేశమయ్యారు. పర్యాటక శాఖ ఈడీ మల్‌రెడ్డి బుధవారం విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీటీఏ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) ఎండీ కన్నబాబు ఈ సమావేశంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అగ్రిమెంట్ కాని కాంట్రాక్టర్లతో సెక్యూరిటీ పర్యవేక్షణ మధ్యన ఈ సమావేశం ఏర్పాటు చేయటం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక యూనిట్లను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు ఏపీటీడీసీ ఉన్నతాధికారులు రహస్యంగా టెండర్లు పిలిచారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఆయా పర్యాటక యూనిట్లలో వస్తున్న ఆదాయం కంటే చాలా తక్కువగా పర్యాటక యూనిట్లను ఐదేళ్లకు లీజుకు ఇచ్చేందుకు వీలుగా టెండర్లను పిలిచారు. లాభాలు వచ్చే పర్యాటక యూనిట్లను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం వెనుక ఉన్నతాధికారుల సొంత ప్రయోజనాలు దాగున్నాయన్న విమర్శలు వచ్చాయి. విచ్చలవిడి ప్రైవేటీకరణపై ఉద్యోగుల యూనియన్ తరపున హైకోర్టులో కేసు కూడా వేశారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని ఏపీటీడీసీ ఉన్నతాధికారులను హైకోర్టు ఆదేశించింది. ఇదే సందర్భంలో పర్యాటక యూనిట్ల ఆస్తులను తాకట్టు పెట్టి బ్యాంకుల నుంచి భారీ మొత్తంలో రుణం తీసుకునే ప్రయత్నం జరిగింది. అలాగే, పర్యాటక యూనిట్ల ఆధునికీకరణ, పునరుద్ధరణ, మెయింటెనెన్స్ పేరుతో కోట్ల రూపాయల వ్యయంతో టెండర్లు పిలిచారు. పర్యాటక యూనిట్లను ప్రైవేటు చేతుల్లో పెట్టే ముందు .. వీటిని ఆధునికీకరించి వారి చేతుల్లో పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. ఇంతలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో ఏపీటీడీసీ ఉన్నతాధికారులు కంగు తిన్నారు. పాత డేట్లతో అగ్రిమెంట్స్ చేయించుకుని వర్క్ ఆర్డర్లు ఇచ్చేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారని, కమీషన్లు దండుకోవటం కోసమే కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారని ఏపీటీడీసీ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. హైకోర్టులో కేసు నడుస్తున్నా కూడా ఖాతరు చేయకుండా.. అడుగులు వేస్తున్నారని అంటున్నారు. ఏ కాంట్రాక్టర్‌తో కూడా ఇప్పటి వరకు అగ్రిమెంట్ చేసుకోలేదు. అందువల్ల వారికి వర్క్ ఆర్డర్లు కూడా ఇవ్వలేదు. దీంతో పనులు చేయటానికి అవకాశం లేదు. ఎన్నికల కోడ్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుంటే కోడ్‌కు ముందే అగ్రిమెంట్ చేసుకుని ఉండాలి. ఆ తర్వాత వర్క్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుంది. పనులు కూడా ప్రారంభించి ఉండాలి. ఇవేమీ లేకుండా కాంట్రాక్టర్లు పనులు చేయటం అసాధ్యం. ఈ క్రమంలో కాంట్రాక్టర్లతో రహస్య సమావేశం నిర్వహించటం చర్చనీయాంశంగా మారింది. ఇంజనీరింగ్ విభాగం మీద ఈ సమావేశంలో ఉన్నతాధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చినట్టు తెలుస్తోంది. కాంట్రాక్టర్లు తక్షణం పనులు చేయాలంటూ ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. అయితే, ఎన్నికల్లో ప్రభుత్వం మారితే .. కచ్చితంగా విజిలెన్స్ విచారణ జరిపిస్తుందంటూ పలువురు కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ఇష్టపడటం లేదని తెలుస్తోంది.

ముగ్గురు చిన్నారులపై గొడ్డలితో దాడి

- యూపీలో ఓ యువకుడి కిరాతకం
- ఇద్దరి మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు
- నిందితుడు ఎన్‌కౌంటర్‌లో హతం

బదయూన్, మార్చి 20: ఉత్తరప్రదేశ్‌లోని బదయూన్ జిల్లాలో అభంశుభం తెలియని ఇద్దరు చిన్నారులను ఓ యువకుడు అతి కిరాతకంగా గొడ్డలితో నరికి చంపేశాడు. బదయూన్‌లోని బాబా కాలనీలో మంగళవారం రాత్రి ఈ ఘోరం జరిగింది. అయితే, నిందితుడు గంటల వ్యవధిలోనే పోలీసుల కాల్పుల్లో చనిపోయాడు. పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడి పేరు సాజిద్. వయస్సు 22 ఏళ్లు. బాధిత పిల్లలు ఆయుష్(12), అహాన్(8), యువరాజ్(10) అన్నదమ్ములు. సాజిద్ ఇటీవలే బాబా కాలనీలో సెలూన్ షాపు తెరిచాడు. అతని షాపునకు ఎదురుగా వినోద్ కుమార్ ఇల్లు ఉంది. మంగళవారం రాత్రి సాజిద్.. వినోద్ ఇంట్లోకి వెళ్లాడు. అప్పుడు ఇంట్లో వినోద్ తల్లి, ముగ్గురు పిల్లలు మాత్రమే ఉన్నారు. తొలుత వినోద్ తల్లితో మాట్లాడిన సాజిద్ తర్వాత ఇంటి రెండో అంతస్తులో పిల్లలు ఉన్న చోటుకు వెళ్లాడు. అక్కడ ముగ్గురు పిల్లలపై విచక్షణారహితంగా గొడ్డలితో దాడి చేశాడు. ఆయుష్, అహాన్ అక్కడికక్కడే చనిపోయారు. యువరాజ్ తీవ్ర గాయాలతో తప్పించుకొని కిందికి పరుగెత్తుకుంటూ వచ్చి ప్రాణాలు కాపాడుకున్నాడు. చిన్నారుల హత్యతో బాబా కాలనీలో స్థానికులు ఆగ్రహంతో ఊగిపోయారు. సాజిద్ షాపును, బైక్‌ను ధ్వంసం చేశారు.

రక్తపు దుస్తుల్లోనే పారిపోయే యత్నం!

దాడి అనంతరం సాజిద్ పారిపోవడానికి ప్రయత్నించాడు. అయితే, హత్యపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆ ప్రాంతంలో నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. "సాజిద్ షేక్‌పూర్ అటవీ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందింది. మా బృందం అక్కడికి వెళ్లగానే సాజిద్ పోలీసులపైకి కాల్పులు జరిపాడు. ఎదురు కాల్పుల్లో అతడు తీవ్రంగా గాయపడి చనిపోయాడు" అని ఐజీ ఆర్కే సింగ్ తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో సాజిద్ పిల్లల రక్తపు మరకలు అంటిన దుస్తుల్లోనే ఉన్నట్లు చెప్పారు. వినోద్‌కుమార్ కుటుంబంపై వ్యక్తిగత ద్వేషంతోనే అతడు పిల్లలను చంపేశాడని యూపీ డీజీపీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. దాడిలో సాజిద్ ఒక్కడే పాల్గొన్నాడని పేర్కొన్నారు. అంతకుముందు, ఈ దాడిలో సాజిద్‌తో పాటు అతని సోదరుడు జావెద్ కూడా పాల్గొన్నట్లు వార్తలు వచ్చాయి.

సంతోషకర దేశాల్లో భారత్ ర్యాంకు 126

- మనకంటే పేద దేశాల్లో ఆనందం ఎక్కువే
- ఏడేళ్లుగా టాప్‌లో 'ఫిన్లాండ్'.. 2,3 స్థానాల్లో డెన్మార్క్, ఐస్‌ల్యాండ్

న్యూయార్క్, మార్చి 20: ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదుగుతున్న భారత్.. మానవాభివృద్ధి సూచీ(హెచ్‌డీఐ), నిరుద్యోగిత, సంతోషం వంటి సూచీల్లో మాత్రం వెనకబడే ఉంది. 'అంతర్జాతీయ ఆనంద దినోత్సవం(మార్చి 20)' సందర్భంగా బుధవారం ఐక్యరాజ్య సమితి(ఐరాస) అనుబంధ సంస్థ సస్టైనబుల్ డెవలప్‌మెంట్(సుస్థిరాభివృద్ధి) సొల్యూషన్స్ నెట్‌వర్క్ సంతోషకర దేశాల ర్యాంకులను విడుదల చేసింది. 143 దేశాలు ఈ జాబితాలో ఉండగా.. భారత్ స్థానం 126. గత ఏడాది స్థానాన్ని భారత్ పదిలపరుచుకుంది. అయితే.. మిగతా దేశాలతో పోలిస్తే.. యువత(127వ ర్యాంకు), దిగువ మధ్య వయసు(127), ఎగువ మధ్యవయసు(121), వయోవృద్ధులు(121) కేటగిరీల ర్యాంకులను బట్టి.. భారత్‌లో సంతోషం అనేది అన్నివయసుల వారికి దాదాపుగా సమానంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఆత్మ సంతృప్తి, తలసరి జీడీపీ, సామాజిక మద్దతు, జీవనకాలం, స్వేచ్ఛ, దాతృత్వం, అవినీతి వంటి అంశాల ఆధారంగా సంతోషకర దేశాల జాబితాను రూపొందిస్తారు. ఇక సంతోషకర దేశాల్లో ఫిన్లాండ్ ఎప్పటి లాగే అగ్రస్థానంలో నిలిచింది. ఫిన్లాండ్ టాప్‌లో ఉండడం ఇది వరుసగా ఏడోసారి. మొదటి మూడు స్థానాలను నార్డిక్ దేశాలు-- ఫిన్లాండ్, డెన్మార్క్, ఐస్‌ల్యాండ్ కైవసం చేసుకోవడం గమనార్హం.! గత ఏడాది అక్టోబరు నుంచి హమాస్‌తో యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్ కూడా ఐదో ర్యాంకులో ఉంది. టాప్-10లో పెద్ద దేశాలు లేవు. టాప్-10లో 1.5 కోట్ల కంటే ఎక్కువ జనాభా ఉన్న దేశాలు నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా మాత్రమే. టాప్-20లో కూడా 3 కోట్ల కంటే ఎక్కువ జనాభా ఉన్న దేశాలు కెనడా, బ్రిటన్ మాత్రమే..! ఈ జాబితాలో మన పొరుగుదేశాలు-- చైనా(60), నేపాల్(93), పాకిస్థాన్(108), మయన్మార్(118) మెరుగైన ర్యాంకుల్లో ఉండగా.. శ్రీలంక 128వ, బంగ్లాదేశ్ 129వ ర్యాంకులను కైవసం చేసుకున్నాయి. తాలిబాన్ల పాలనలోకి వెళ్లిన తర్వాత తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఆఫ్గానిస్థాన్ ఈ జాబితాలో అట్టడుగున నిలిచింది. 2006 నుంచి ఆఫ్గానిస్థాన్‌తోపాటు.. లెబనాన్, జోర్డాన్ ప్రజలు ఆనందాన్ని కోల్పోతూ వస్తున్నారని, సెర్బియా, బల్గేరియా, లాత్వియా వంటి దేశాల్లో పరిస్థితి మాత్రం మెరుగైందని 'ప్రపంచ సంతోషకర దేశాలు-2024' నివేదిక స్పష్టం చేస్తోంది.

ర్యాంకులు చేజార్చుకున్న అమెరికా, జర్మనీ

సుమారు దశాబ్దకాలంపాటు అమెరికా, జర్మనీ దేశాలు ఈ జాబితాలో టాప్-20లో ఉండేవి. ఈ ఏడాది అవి కిందకు దిగజారి, 23, 24 స్థానాలకు చేరాయి. అయితే.. కోస్టారికా, కువైత్ దేశాలు టాప్-20లోకి ఎగబాకడం గమనార్హం.! ఈ దేశాలు వరుసగా 12, 13 స్థానాలను దక్కించుకున్నాయి.

వలస కార్మికులకు రేషన్ కార్డులివ్వండి: సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 20: దేశవ్యాప్తంగా ఎనిమిది కోట్ల మంది వలస కార్మికులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీం కోర్టు ఆదేశించింది. జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలోకిరాని 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులకు రేషన్‌కార్డులు ఇవ్వాలని పేర్కొంది. 2023, ఏప్రిల్‌లోనే దీనికి సంబంధించి ఆదేశాలు ఇచ్చినప్పటికీ జాప్యం జరిగిందని, ఇప్పటికైనా వారికి కార్డులు మంజూరు చేయాలని తెలిపింది. 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో మొత్తం 28.6 కోట్ల మంది కార్మికులు నమోదయ్యారు. వీరిలో 20.63 కోట్ల మందికి రేషన్ కార్డులు మంజూరు చేశారు. దీంతో మిగిలిన వారికి కూడా కార్డులు ఇవ్వాలని న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లి ఆదేశించారు. సామాజిక ఉద్యమ కారులు అంజలి భరద్వాజ్, హరీష్ మండెర్, జగ్దీప్ చొకర్‌లు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, చెరీ డి.సౌజాలు వాదనలు వినిపించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 10 కోట్ల మంది కార్మికులకు జాతీయ ఆహార భద్రతా చట్టం అమలు కావడం లేదని ప్రశాంత్ భూషణ్ తెలిపారు. ఆ తర్వాత వలస కార్మికుల సంఖ్య మరింత పెరిగిందన్నారు.

ఇంగ్లిష్ రానివారితో ఆంగ్లంలో బోధనా?

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ రానివారితో ఆంగ్లంలో బోధన చేయించడం ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన తప్పనిసరి చేసిన తరువాత ఆంగ్ల నైపుణ్య పరీక్షలో అర్హత సాధించని వారితో బోధన చేయించడం సరికాదని అభిప్రాయపడింది. టీచర్లను ఎంపిక చేసిన తరువాత వారికి ఆంగ్లంతో పాటు వివిధ అంశాల్లో రెండేళ్ల పాటు నైపుణ్య తరగతులు నిర్వహిస్తున్నామన్న ప్రభుత్వ వాదనను ఆక్షేపించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలి డైరెక్టర్‌ను ఆదేశిస్తూ, వారికి నోటీసులు జారీ చేసింది. డీఎస్సీ నోటిఫికేషన్ ప్రక్రియను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. విచారణను మే 1కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులనే నియమించడంతో పాటు, అన్ని బడులను సమానంగా చూసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ పిల్ దాఖలు చేశారు. ఇది బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరపున న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు, విద్యాశాఖ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగాన్ని నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 20: ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారాన్ని తనిఖీ చేసి అవి నిజమో కాదో చెప్పేందుకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ప్రారంభించిన 'ఫ్యాక్ట్ చెక్ (నిజనిర్ధారణ)' విభాగాన్ని కేంద్ర ఐటీ శాఖ బుధవారం నోటిఫై చేసింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఆన్‌లైన్‌లో వచ్చే వార్తల్లో.. తప్పుదోవ పట్టించేవి, తప్పుడు సమాచారాన్ని విస్తరింపజేసేవి ఏవైనా ఉంటే వాటిని గుర్తించి, వాటికి సంబంధించిన వాస్తవ సమాచారాన్ని ప్రజలకు అందించేందుకు పీఐబీ ఈ ఫ్యాక్ట్‌చెక్ విభాగాన్ని ప్రారంభించింది. అయితే ఇది భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనని, పత్రికలపై సెన్సార్‌షిప్ విధించినట్టుగా భావించాల్సి వస్తుందని గత ఏడాది ఏప్రిల్‌లో 'ద ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ' తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫ్యాక్ట్‌చెక్ విభాగాన్ని నోటిఫై చేయకుండా ఆదేశాలివ్వాలంటూ ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా బాంబే హైకోర్టును ఆశ్రయించారు. కానీ కోర్టు తోసిపుచ్చింది. దీంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ కేసు విచారణ గురువారం జరగనుంది. ఇంతలోనే కేంద్రం.. ఫ్యాక్ట్‌చెక్ విభాగాన్ని నోటిఫై చేసింది.

ఏపీపీఎస్సీ అప్పీల్‌పై నేడు విచారణ

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్(2018) ఫలితాలను రద్దు చేసి, తాజాగా పరీక్ష నిర్వహించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ వేసిన అప్పీల్‌పై హైకోర్టు గురువారం విచారించే అవకాశం ఉంది. దీనిపై బుధవారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరపాల్సి ఉంది. జస్టిస్ జి.నరేందర్ సెలవులో ఉండడంతో అత్యవసరంగా విచారణ జరపాలని జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనాన్ని ఏపీపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించాయి. దీంతో గురువారం విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

బౌద్ధ మేధావి చంద్రశేఖర్ మృతి

- ప్రభుత్వాసుపత్రికి శరీర దానం
- పలువురు ప్రముఖుల సంతాపం

వేటపాలెం(చీరాల), మార్చి 20: ప్రముఖ బౌద్ధ రచయిత, మేధావి దేవన చంద్రశేఖర్(65) ఇక లేరు. మంగళవారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందారు. ప్రజల సందర్శనార్థం మృతదేహాన్ని బుధవారం బాపట్ల జిల్లా వేటపాలెంలోని స్వగృహంలో ఉంచారు. పలువురు ప్రముఖులు సందర్శించి, ఆయనతో పరిచయాన్ని, బంధాన్ని మననం చేసుకున్నారు. బుద్ధభూమి పత్రిక నిర్వహణలో చంద్రశేఖర్ ప్రధాన పాత్ర పోషించారని, బౌద్ధతత్వాన్ని నేటి తరానికి పరిచయం చేసేందుకు కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. అనంతరం ఆయన దేహాన్ని కుటుంబసభ్యులు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి దానం చేశారు.

ఆ 15 ఎకరాలు సనాతన ధర్మ ప్రచారానికే...

- శారదా పీఠానికి కేటాయించిన భూమిపై ఉత్తర్వులు

విశాఖపట్నం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో భీమిలి సమీపాన శారదా పీఠానికి కేటాయించిన 15 ఎకరాలను ఉద్దేశించిన ప్రయోజనాలకే ఉపయోగించుకోవాలని, వేరే వాటికి బదలాయించకూడదని స్పష్టం చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. సంస్కృత, వేద పాఠశాలల ఏర్పాటు నిమిత్తం శారదా పీఠం స్థలం కోరడంతో వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల క్రితం కొత్తవలస సర్వే నం.102, 102/2, 103లలో 15 ఎకరాలను నామమాత్రపు ధరకు కేటాయించింది. అయితే 2023 నవంబరులో జిల్లా కలెక్టర్‌కు శారదా పీఠం ఉత్తరాధికారి ఓ విన్నపం చేశారు. పీఠం ఆర్థిక వ్యవహారాలకు భూమిని ఉపయోగించుకునేందుకు వీలుగా జీవోను మార్చి ఇవ్వాలని కోరారు. అయితే దేవదాయ శాఖ సూచించిన విధంగానే ఆ భూమిని ఉపయోగించుకోవాలని సూచిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

16 నుంచి ఈఏపీసెట్

- ఎన్నికల నేపథ్యంలో షెడ్యూలు సవరణ

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈఏపీసెట్ పరీక్షల షెడ్యూలును ఉన్నత విద్యామండలి మార్చింది. ఈ మేరకు బుధవారం సవరణ షెడ్యూలు విడుదల చేసింది. మొదట ప్రకటించిన షెడ్యూలు ప్రకారం మే 13 నుంచి 19 వరకు పరీక్షలు జరగాలి. సరిగ్గా పోలింగ్ రోజునే సెట్ ప్రారంభం కావాల్సి వస్తున్నందున, దానిని 16 నుంచి ప్రారంభమయ్యేలా మార్చింది. 16, 17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు.. 18 నుంచి 22 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. అలాగే పీజీసెట్ షెడ్యూలును కూడా సవరించింది. జూన్ 3న ప్రారంభం కావాల్సిన పీజీ సెట్‌ను అదే నెలలో 10 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపింది. ఏపీఆర్‌సెట్ పరీక్షలు మే 2 నుంచి 5 వరకు జరుగుతాయని పేర్కొంది.

యథావిధిగా పాలీసెట్: ఇప్పటికే ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఏప్రిల్ 27వ తేదీనే పాలీసెట్ జరుగుతుందని, ఇందులో ఎలాంటి మార్పులు లేవని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో మార్పులు ఉంటాయేమోనని విద్యార్థులు భావిస్తున్న తరుణంలో ఆమె ఈ స్పష్టతనిచ్చారు. అలాగే పాలిటెక్నిక్ సీ20 4, 5 సెమిస్టర్ల పరీక్షలు ఏప్రిల్ 18 నుంచి ప్రారంభమవుతాయన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు కూడా షెడ్యూలు ప్రకారమే జరుగుతాయన్నారు.

హౌసింగ్‌లో వలంటీర్ల సేవలొద్దు

- ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయండి: హౌసింగ్ ఎండీ

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల నిర్మాణ కార్యకలాపాల్లో వలంటీర్ల సేవలను ఏ రూపంలోనూ ఉపయోగించుకోవద్దని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట రమణారెడ్డి అన్ని జిల్లాల హౌసింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఈసీఐ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రాష్ట్రంలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణం పురోగతిపై బుధవారం ఆయన వర్చువల్‌గా సమీక్షించారు. కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి హౌసింగ్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో కొత్త లబ్ధిదారుల నమోదు, ఓటీఎస్ ఆన్‌లైన్ మాడ్యూల్, కొత్త లే-అవుట్‌ల ఐడీలను నిలిపివేసినట్లు తెలిపారు. రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులెవరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దని, రాజకీయ పార్టీలకు అనుబంధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎండీ హెచ్చరించారు.

అంత హడావుడిగా అనుమతులెందుకు?

- గనుల శాఖ అధికారుల తీరుపై హైకోర్టు అభ్యంతరం
- మైనింగ్‌ను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కొడవలి బౌద్ధక్షేత్రం సమీపంలో గ్రావెల్ తవ్వకాలకు మైనింగ్‌శాఖ అధికారులు అనుమతివ్వడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. హడావుడిగా అనుమతులు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. పురావస్తు శాఖ సర్వే పూర్తి చేసేవరకు వేచి ఉండాల్సిందని పేర్కొంది. సర్వే పూర్తయ్యేవరకు గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి బౌద్ధక్షేత్రం సమీపంలో గ్రావెల్ తవ్వకాలకు మైనింగ్ శాఖ అధికారులు అనుమతివ్వడాన్ని సవాల్ చేస్తూ కొడవలి బౌద్ధమహాస్తూప పరిరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు అయితాబత్తుల రామేశ్వరరావు, మరికొందరు హైకోర్టులో పిల్ వేశారు. ఈ పిల్‌పై బుధవారం విచారణ జరిగింది. పిటిషనర్ తరపున న్యాయవాది మహిత వాదనలు వినిపించారు. గ్రావెల్ తవ్వకాలతో బౌద్ధక్షేత్రానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. మైనింగ్ అనుమతులు ఇచ్చే ముందు అధికారులు పురావస్తు శాఖ సమ్మతి తీసుకోలేదన్నారు. పురావస్తు శాఖ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ బౌద్ధక్షేత్రం చుట్టుపక్కల మైనింగ్‌కు అనుమతులు ఇవ్వొద్దని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశామన్నారు. మైనింగ్ శాఖ తరపున ప్రభుత్వ న్యాయవాది నవీన్ వాదనలు వినిపిస్తూ చట్ట నిబంధనలకు లోబడే మైనింగ్ అనుమతులు ఇచ్చామన్నారు.

రైతు రుణాలు.. రెన్యువల్‌కే పరిమితం

- అప్పుల్లో కూరుకుపోయిన అన్నదాతలు

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పంటలు తీవ్రంగా నష్టపోయి.. అప్పుల్లో కూరుకుపోయిన అన్నదాతలు 2023-24 వ్యవసాయ సీజన్లలో తీసుకున్న పంట రుణాలను తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నారు. రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించలేక వడ్డీ చెల్లించి, అసలును రెన్యువల్ చేసుకునేందుకే రైతులు పరిమితమవుతున్నారు. మరో 10 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో బ్యాంకర్లు, సహకార సంఘాల సిబ్బంది రుణాల వసూలుపై దృష్టి సారించారు. అయితే రుణాల చెల్లింపులపై రైతుల నుంచి పెద్దగా స్పందన లేదు. కృష్ణా, గోదావరి ప్రాంతాల్లో రికవరీ సాధారణంగా ఉండగా, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వసూళ్లు మందకొడిగా ఉన్నాయని బ్యాంకర్లు చెప్తున్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 40లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. పంట దిగుబడులు కూడా బాగా తగ్గాయి. ఈ కారణంగా ఖరీఫ్, రబీలో తీసుకున్న పంట రుణాలను తిరిగి చెల్లించడం రైతులకు భారంగా మారింది. రూ.లక్ష లోపు రుణాలను 7% వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంది. లేకపోతే.. వడ్డీ రాయితీ దక్కని పరిస్థితి. అందువల్ల రూ.లక్షలోపు రుణాలను మాత్రమే రైతులు చెల్లిస్తున్నారు. రూ.లక్షపైన రుణాలను రైతులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో రుణాలను రెన్యువల్ చేయాలని రైతులు కోరుతున్నారు. దీంతో పీఏసీఎస్ సిబ్బంది బుక్ ఎగ్జిస్ట్‌మెంట్‌తో రుణాలు రెన్యువల్ చేస్తున్నారు. బ్యాంకర్లకు మాత్రం రుణాలు వసూలు చేయడం సంకటంగా మారింది. 2023-24లో రాష్ట్రవ్యాప్తంగా రూ.2.08 లక్షల కోట్లు రుణాలిచ్చినట్లు బ్యాంకర్ల కమిటీ ప్రభుత్వానికి నివేదించింది. ఇందులో సగం కూడా రికవరీ అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఖరీఫ్‌లో పంట రుణాలు తీసుకున్న కొందరు రైతులు తీవ్ర వర్షాభావం వల్ల విత్తనమే వేయలేకపోయారు. రబీలోనూ కొందరు రైతులు సాగుకు దూరంగా ఉన్నారు. రెండు సీజన్లలో పంటలు వేసినా, కరువు కారణంగా 14.23లక్షల ఎకరాలు, తుఫాన్ వల్ల దాదాపు 6.65లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని, 11.59లక్షల మంది రైతులు నష్టపోయారని ప్రభుత్వమే తేల్చింది.



ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ప్రవేశానికి 'నెస్ట్'

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 21 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్), ముంబైలోని యూనివర్సిటీ ఆఫ్ ముంబై-డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్(యూఎం-డీఏఈ సీఈబీఎస్)లలో ప్రవేశానికి ఉద్దేశించిన నేషనల్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (నెస్ట్) 2024 నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. బయాలజీ, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఫిజిక్స్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. దేశవ్యాప్తంగా 120 సెంటర్లలో ఈ ఎగ్జామ్‌ను నిర్వహించనున్నారు. నైసర్‌లో మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఇక్కడ చదివినవారికి హోమి బాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్(హెచ్‌బీఎన్‌ఐ) ఎమ్మెస్సీ డిగ్రీని ప్రదానం చేస్తుంది. యూఎం-డీఏఈ సీఈబీఎస్‌లో 57 సీట్లు ఉన్నాయి. ఇక్కడ చదివినవారికి యూనివర్సిటీ ఆఫ్ ముంబై బీఎస్సీ-ఎమ్మెస్సీ డిగ్రీలను ప్రదానం చేస్తుంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి సైన్స్/మేథ్స్ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2022, 2023 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైనవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

నెస్ట్ వివరాలు: ఇది ఆన్‌లైన్/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో బయాలజీ, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఫిజిక్స్ అనే నాలుగు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్ 60 మార్కులకు ఉంటుంది. ప్రతి సెక్షన్‌లో 20 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు 3 మార్కులు నిర్దేశించారు. సమాధానం తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ఇస్తారు. బెస్ట్ స్కోర్ వచ్చిన మూడు సెక్షన్‌లను పరిగణనలోకి తీసుకొని సెక్షన్‌వారీ మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. నైసర్, సీఈబీఎస్ విడివిడిగా మెరిట్ లిస్ట్‌లు రూపొందిస్తాయి.

స్కాలర్‌షిప్: ఎంపికైన అభ్యర్థులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ-డీఐఎస్‌హెచ్‌ఏ ప్రోగ్రామ్ లేదా డీఎస్‌టీ వారి ఇన్‌స్పైర్ ప్రోగ్రామ్ కింద ఏడాదికి రూ.60,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు. సమ్మర్ ఇంటర్న్‌షిప్ కోసం ఏడాదికి రూ.20,000ల గ్రాంట్ చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ కేటగిరీలకు చెందిన పురుషులకు రూ.1,400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.700
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 15 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్
- **నెస్ట్ 2024 తేదీ:** జూన్ 30
- **ఫలితాలు విడుదల:** జూలై 10
- **వెబ్‌సైట్:** www.nestexam.in, www.niser.ac.in, www.cbs.ac.in

ఏపీ గురుకుల పాఠశాలల కామన్ అడ్మిషన్ టెస్ట్

గుంటూరులోని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(ఏపీఆర్‌ఈఐఎస్)- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏపీఆర్‌ఈఐఎస్ క్యాట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా అయిదో తరగతి ప్రవేశాలు సహా ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ ప్రక్రియ నిర్వహిస్తారు. బాలురకు, బాలికలకు విడివిడిగా జనరల్, మైనారిటీ కేటగిరీల పాఠశాలలు ఉన్నాయి. అయిదో తరగతిలో ప్రతి గురుకుల పాఠశాలలో 80 సీట్లు చొప్పున మొత్తం 3,920 సీట్లు ఉన్నాయి. ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మొత్తం 575 సీట్లు మిగిలి ఉన్నాయి.

గురుకుల పాఠశాలల ప్రత్యేకతలు: ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. బోధన, వసతి ఉచితం. క్రీడలు, వ్యాయామానికి ప్రాధాన్యమిస్తారు. ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, ప్లే గ్రౌండ్స్ అందుబాటులో ఉంటాయి. ప్రతి తరగతికి లోకో పేరెంట్‌ను నియమిస్తారు. మేథ్స్ ఒలింపియాడ్, హిందీ ప్రచార సభ, ఎన్‌టీఎస్‌ఈ తదితర పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.



అర్హత వివరాలు: అయిదో తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు 2022-23 సంవత్సరంలో మూడో తరగతి, 2023-24 సంవత్సరంలో నాలుగో తరగతి చదివి ఉండాలి. ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో ప్రవేశానికి 2023-24 సంవత్సరంలో అయిదు, ఆరు, ఏడు తరగతులు చదివి ఉండాలి.

వయసు: అయిదో తరగతికి 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య; ఆరో తరగతికి 2012 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య; ఏడో తరగతికి 2011 సెప్టెంబరు 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య; ఎనిమిదో తరగతికి 2010 సెప్టెంబరు 1 నుంచి 2012 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

- జనరల్ పాఠశాలల్లో ప్రవేశానికి ఓసీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లో చదివి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఈ నిబంధన వర్తించదు.
- కుటుంబ వార్షికాదాయం రూ.1,00,000లకు మించకూడదు.

ఏపీఆర్‌ఈఐఎస్ క్యాట్ వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. విద్యార్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్న పత్రాన్ని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. అయిదో తరగతికి మాత్రం ఉర్దూ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో కూడా ఇస్తారు.

- అయిదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో నాలుగో తరగతి సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. తెలుగు/ఉర్దూ నుంచి 25, ఇంగ్లీష్ నుంచి 15, మేథ్స్ నుంచి 30, ఈవీఎస్ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు.
- ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో అయిదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు నుంచి 20, ఇంగ్లీష్ నుంచి 20, మేథ్స్ నుంచి 30, ఈవీఎస్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు.
- ఏడు, ఎనిమిది తరగతుల్లో ప్రవేశానికి ఆరు, ఏడు తరగతుల సిలబస్ ఆధారంగా ప్రశ్నలు ఇస్తారు. తెలుగు, ఇంగ్లీష్, మేథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్‌ల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 17 నుంచి
- **ఏపీఆర్‌ఈఐఎస్ క్యాట్ 2024 తేదీ:** ఏప్రిల్ 25
- **ఫలితాలు విడుదల:** మే 14
- **వెబ్‌సైట్:** https://aprs.apcfss.in

జాబ్ కార్నర్

బెల్‌లో సీనియర్ ఇంజనీర్లు

బెంగళూరులోని కేంద్ర ప్రభుత్వ సంస్థకు చెందిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బెల్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు: 33**

1. సీనియర్ ఇంజనీర్: **19 పోస్టులు**
2. డిప్యూటీ మేనేజర్: **10 పోస్టులు**
3. సీనియర్ మేనేజర్: **4 పోస్టులు**

విభాగాలు: పవర్ ఎలక్ట్రానిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్(మెకానికల్), సిస్టమ్ ఆర్కిటెక్ట్ ఎంబెడెడ్, మాడ్యుల్ డెవలప్‌మెంట్ ఎంబెడెడ్, మాడ్యుల్ డెవలప్‌మెంట్ ఎంబెడెడ్ ఆర్‌టీఓ ఎస్/ఎఫ్‌పీజీఏ, మాడ్యుల్ డెవలప్‌మెంట్ పీసీబీ డిజైన్, పవర్ ఎలక్ట్రానిక్స్, పవర్ మాడ్యుల్(మెకానికల్), ట్రాన్స్‌పోర్టేషన్, బ్యాటరీ ప్యాక్ డెవలప్‌మెంట్, బ్యాటరీ బీఎంఎస్ డెవలప్‌మెంట్, ఏసీసీ సెల్ డిజైన్ డెవలప్‌మెంట్, నేవల్ కంట్రోల్ సిస్టమ్, యాక్టివ్ ప్రొటెక్షన్ సిస్టమ్, నేవల్ బ్యాటరీ ప్యాకింగ్.

అర్హత: ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్‌లో బీఈ/బీటెక్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 32 నుంచి 42 ఏళ్లు మించరాదు

జీతం: సీనియర్ ఇంజనీర్ పోస్టుకు రూ.70,000 - రూ.2,00,000; డిప్యూటీ మేనేజర్ పోస్టుకు రూ.80,000 - రూ.2,20,000. సీనియర్ మేనేజర్ పోస్టుకు రూ.1,00,000 నుంచి రూ.2,60,000.

ఆన్‌లైన్‌దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31

వెబ్‌సైట్: https://edn.bhel.com/

ఏపీ డీఎస్సీ ఎస్‌జీటీ మోడల్ ప్రశ్నలు

విద్యా దృక్పథాలు

1. ప్రజాస్వామిక విలువ
   1) అసహనము
   2) సామాజిక సున్నితత్వం లేకుండుట
   3) స్వీయ స్పృహ 4) తోటివారనే భావన
2. **విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం, తరగతిలో 150 మంది పిల్లల కంటే ఎక్కువ ఉంటే నియమించాల్సిన ఉపాధ్యాయుల సంఖ్య?**
   1) నలుగురు 2) ముగ్గురు
   3) ముగ్గురు, ఒక ప్రధాన ఉపాధ్యాయుడు
   4) ఐదుగురు, ఒక ప్రధాన ఉపాధ్యాయుడు
3. **భారతదేశం బాలల హక్కుల ఒడంబడికపై సంతకం చేసింది. ఈ ఒడంబడికలోని అతి ముఖ్యమైన సూత్రాలు**
   1) పాల్గొనే హక్కు, వ్యవస్థీకరణ హక్కు, సమాచార హక్కు
   2) విద్యాహక్కు, వ్యవస్థీకరణ హక్కు, సమాచార హక్కు
   3) పాల్గొనే హక్కు, సమానత్వం హక్కు, సమాచార హక్కు
   4) పాల్గొనే హక్కు, విద్యా హక్కు, సమాచార హక్కు
4. **ఇచ్చిన వాక్యాలను చదవండి. కింది వాక్యాలకు సంబంధించి ప్రముఖమైంది**
   -వ్యత్యాసం అంగీకరించు----వైవిధ్యాలను వేడుక చేసుకోవడం
   -అవకాశాలు కలుగజేయి-----నియంత్రణలు కాదు, పిల్లల అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేసుకో
   -కలిసి నేర్చుకోవడం ప్రతీ ఒక్క విద్యార్థికి లాభదాయకం
   1) వృత్తి విద్యకు అవకాశం
   2) సమ్మిళిత విద్యకు అవకాశం
   3) అనియత విద్యకు అవకాశం
   4) బ్రిడ్జ్ కోర్సుకు అవకాశం

విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం

5. **మోటార్ ఇంజన్‌ను రిపేరు చేయగల వ్యక్తి ఆ సూత్రంపై పనిచేసే ఇతర వాహనాల ఇంజన్లు కూడా రిపేర్ చేయగల్గుతాడు అని తెలియజేసే అభ్యసన సిద్ధాంతం?**
   1) సమరూప మూలకాల సిద్ధాంతం
   2) సామాన్యీకరణ సిద్ధాంతం
   3) సమగ్రాకృతి సిద్ధాంతం
   4) ఆదర్శాల సిద్ధాంతం
6. **విస్మృతికి కారణం కానిది**
   1) అవగాహన చేసుకొని చదవడం
   2) మార్కుల కోసం చదవడం
   3) ఉపాధ్యాయుడు విధించే దండనకు భయపడి చదవడం 4) అర్థమైనా కాకపోయినా చదవడం
7. **కింది వాటిలో థార్న్‌డైక్ సామీప్యతా/సంసర్గ నియమాన్ని గుర్తించండి**
   1) టైప్ నేర్చుకున్న వ్యక్తి కంప్యూటర్ కీ బోర్డు మీద సులభంగా పనిచేయగల్గడం
   2) మెరుపు అనగానే ఉరుము గుర్తుకు రావడం
   3) జీవశాస్త్రంలో కన్ను అనే పాఠ్యాంశాన్ని బోధించేటప్పుడు భౌతిక శాస్త్రజ్ఞానాన్ని కూడా బోధించి పాఠాన్ని చెప్పడం
   4) ఉపాధ్యాయుడు అన్ని విషయాలను బోధించినప్పటికీ విద్యార్థి కొన్ని విషయాల పట్ల మాత్రమే ఆసక్తి చూపడం
8. **అనుకూల బదలాయింపు వలన------**
   ఎ. నూతన అభ్యసనం సులభతరం అవుతుంది
   బి. తక్కువ సమయంలో నూతన అభ్యసనం జరుగుతుంది
   సి. పునరభ్యసనంను పోలి ఉంటుంది
   సరైన సమాధానాన్ని గుర్తించండి
   1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
   3) ఎ, సి మాత్రమే 4) ఎ, బి, సి
9. **కింది వాటిలో మూర్తిమత్వ లక్షణం కానిది**
   1) మూర్తిమత్వ వికాసం అనువంశికత, పరిసరాలపై ఆధారపడి ఉంటుంది
   2) మూర్తిమత్వం అనేక లక్షణాల కలయిక కాదు
   3) మూర్తిమత్వంలో స్వీయ చేతనత్వం ముఖ్యమైంది
   4) వ్యక్తి అన్ని లక్షణాంశాల సమగ్రరూపం



10. **కింది వాటిలో అభ్యసన వైకల్యతకు సంబంధించి పఠన వైకల్యానికి సంబంధించింది**
    1) డిస్‌గ్రాఫియా 2) డిస్‌కాల్క్యులియా
    3) డిస్‌ఫేసియా 4) డిస్‌లెక్సియా
11. **కింది వాటిలో ఉదాత్తీకరణానికి సంబంధించిన ఉదాహరణ**
    1) రాముని మీద విపరీతమైన భక్తిభావాలు కలిగిన తులసీదాస్ రామచరిత మానస్‌ను రచించడం
    2) ప్రధానోపాధ్యాయుని మీద కోపాన్ని ఉపాధ్యాయుడు పిల్లల మీద చూపడం
    3) తింటున్న ఆహారం రుచిగా లేనప్పటికీ చాలా రుచికరంగా ఉందని చెప్పడం
    4) పదే పదే పుట్టింటికి వెళ్లే నూతన వధువు
12. **అభిరుచులకు సంబంధించి సరైనది**
    ఎ) అభిరుచులు స్థిరంగా ఉండవు
    బి) వైయుక్తిక బేధాలుంటాయి
    సి) వ్యక్తికి ప్రేరణ శక్తిగా పనిచేస్తుంది
    డి) అభిరుచులను మాపనం చేయవచ్చు
    1) ఎ, బి, సి మాత్రమే 2) బి, సి, డి మాత్రమే
    3) ఎ, బి, డి మాత్రమే 4) ఎ, బి, సి, డి
13. **ఉద్వేగాత్మక ప్రజ్ఞకు సంబంధించి సరైనవి**
    ఎ. ఉద్వేగాత్మక ప్రజ్ఞను సామర్థ్య నమూనా ఆధారంగా తెలిపింది - పీటర్ సలోవే& జాన్ మేయర్
    బి. ఉద్వేగ ప్రజ్ఞను లక్షణ నమూనా ఆధారంగా తెలిపింది- కాన్‌స్టారటిన్, వాసిలి పెట్రిడ్స్
    సి. ఉద్వేగ ప్రజ్ఞను మిశ్రమ నమూనా ఆధారంగా తెలిపింది - గోల్‌మన్
    1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి డి) ఎ, బి, సి
14. **రావెన్స్ ప్రోగ్రెసివ్ మాత్రికల పరీక్షకు సంబంధించి సరైనది**
    1) దీనిని కేవలం నిరక్షరాస్యులకు మాత్రమే వినియోగిస్తారు
    2) దీనిని కేవలం అక్షరాస్యులకు మాత్రమే ఉపయోగిస్తారు
    3) దీనిని అక్షరాస్యులకు, నిరక్షరాస్యులకు ఉపయోగిస్తారు
    4) దీనిని వైయక్తికంగా మాత్రమే ఉపయోగించగలం
15. **కింది వాటిలో ఒకటి అభ్యసన వైకల్యానికి కారణం**
    1) ప్రజ్ఞాలబ్ధి 70 కంటే తక్కువగా ఉండడం
    2) బోధన సరిగా లేకుండుట
    3) సమస్యలను సాధించడంలో తప్పులు చేయడం
    4) ప్రత్యక్షాత్మక ప్రక్రియ లోపం
16. **వైకల్యాలు ఉన్న పిల్లలను ప్రత్యేక పాఠశాలలో చేర్చడం వల్ల తరచుగా వచ్చే ఫలితం?**
    1) ప్రత్యేక శిశువుల అవసరాలు తీర్చడం
    2) ప్రధాన ప్రవాహాల్లో అట్టి పిల్లలను చేర్చడం
    3) ప్రధాన ప్రవాహం నుంచి అట్టి పిల్లలను వెలివేయడం
    4) బోధనలో మమేకం కావడం
17. ఎ) విలీన విద్య పరిధి ప్రత్యేక విద్య పరిధికి సమరూపంగా ఉంటుంది.
    బి) ప్రత్యేక విద్య తరగతుల్లోని విద్యార్థులు సాధారణ విద్యార్థుల కంటే ఎక్కువ స్థాయిలో విభేదిస్తారు.
    సి) విలీన విద్యలో సాధారణ తరగతిలో కలపడానికి ఆచరణాత్మకంగా అనువుగా ఉన్నటువంటి స్థాయి వరకు ఉన్న విద్యార్థులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.
    1) ఎ, బి సరైనవి 2) బి, సి సరైనవి
    3) ఎ, సి సరైనవి 4) ఎ, బి, సి సరైనవి
18. **సమ్మిళిత విద్యలో ఉన్న హేతుబద్ధత ఏమిటి?**
    1) సమాజంలో విషమజాతీయం. ఈ సమాజానికి అనుగుణంగా పాఠశాలలు కూడా సమ్మిళిత లక్షణాలతో ఉండాలి.
    2) ప్రతి పిల్లవాడి పనితీరుకు సంబంధించిన నిర్దిష్టాంశాలు ఒకవిధంగా, ప్రామాణీకీకృతంగా ఉండాలి.
    3) ప్రత్యేక పిల్లల పట్ల సానుభూతి చూపించాలి. వారిని సదుపాయాలకు అందుబాటులో ఉంచాలి.
    4) ప్రత్యేక పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పడం పెద్ద ఖర్చుతో కూడినది కాదు
19. **కుర్జ్ వీల్ రీడింగ్ మెషిన్?**
    1) ముద్రిత సమాచారాన్ని వాగ్రూపంలోకి మారుస్తుంది
    2) వాగ్రూప సమాచారాన్ని ముద్రిత రూపంలోకి మారుస్తుంది
    3) ముద్రిత సమాచారాన్ని వాగ్రూపంలోకి, వాగ్రూప సమాచారాన్ని ముద్రిత రూపంలోకి మారుస్తుంది
    4) చిత్రాలను పఠించుటకు ఉపయోగిస్తుంది
20. **కార్న్‌హసర్ అభిప్రాయంలో వైఖరి అంటే?**
    1) ప్రపంచంలోని ఒక వస్తువుని, చిహ్నాన్ని, అంశాన్ని, అనుకూల, ప్రతికూల రీతిలో మూల్యాంకనం చేసే వ్యక్తి మానసిక ధోరణియే వైఖరి
    2) ఒకానొక పరిస్థితి పట్ల వ్యక్తికి ప్రతిస్పందించడానికి ఉండే సంసిద్ధత
    3) ఒక జాతి ఆచారం, సంస్థ పట్ల వ్యక్తి అనుకూలంగా లేదా ప్రతికూలంగా ప్రతిస్పందించే ధోరణి
    4) ఒక వస్తువు లేదా వ్యక్తి పట్ల ప్రతిస్పందించే ప్రత్యేక ప్రవృత్తి లేదా సంసిద్ధత.



ఆకిశెట్టి వెంకటస్వామి,
సీనియర్ ఫ్యాకల్టీ

తెలుగు కంటెంట్ & మెథడాలజీ

21. **నీవు బ్రతికి ఉంటే వెయ్యి ఆవులను దానం చేయగలవు. నీ ప్రాణాలు వదులుకుంటావా? అని దిలీప మహారాజును ప్రశ్నించిందెవరు?**
    1) వశిష్ఠుడు 2) ఆవు
    3) దేవతలు 4) సింహం
22. **'అమ్మఒడి' పాఠ్యాంశంలో దైవమ్ము కంటే త్వరపడి అమ్మ ఏమి చూపును అని కవి చెప్పాడు**
    1) అనురాగము 2) వికాసము
    3) ఒరవడి 4) బుద్దులు
23. **కింది పొడుపునకు విడుపును గుర్తించండి చూస్తే చూపులు, నవ్వితే నవ్వులు, గుద్దితే గుద్దులు**
    1) అద్దం 2) నీరు 3) కళ్లద్దాలు 4) పైవన్నీ
24. **న్యాసం అంటే అర్థం?**
    1) తీయుట 2) మార్చుట
    3) ఉంచుట 4) ఉంచుకుండుట

సమాధానాలు

1) 4 2) 4 3) 1 4) 2 5) 2 6) 1
7) 2 8) 4 9) 2 10) 4 11) 1 12) 4
13) 4 14) 3 15) 4 16) 1 17) 4 18) 1
19) 1 20) 4 21) 4 22) 3 23) 1 24) 3

లిటిల్స్




మీకు తెలుసా

- అడవిలోని జంతువులను వేటాడటంలో హైనాలది అందె వేసిన చేయి. ఇవి ఉత్తర ఆఫ్రికాలోని ఎడారుల్లో ఎక్కువగా కనిపిస్తాయి.
- హైనాలు మూడు రకాలు. చుక్కల హైనా, గోధుమ రంగు హైనా, చారల హైనా. ఈ చారల హైనాలు మిగతా వాటికంటే బలమైనవి. బరువైనవి. డామినేటింగ్‌గా ఉంటాయి. చాలా అగ్రెసివ్‌గా ఉంటాయి.
- అడవిలోని గడ్డిభూముల్లో దాక్కుని ఉండి కంటికి కనపడవు. ఇవన్నీ గుంపులుగా ఉంటాయి. గేదెలు, కంచరగాడిదలు, జింకలు, గుర్రాలు.. ఇలా వేటినైనా తెలివిగా వేటాడతాయి. సింహాలనూ భయపెట్టగలవు. అయితే ఎక్కువగా సింహాలు వేటాడిన ఆహారం మీద ఇవి ఆధారపడతాయి. సింహాలు తింటుంటే మధ్యలో వచ్చి ఆహారాన్ని గుంజుకుని పోతాయి. వీటితో సింహాలు కూడా గొడవపడలేవు. అందుకే ఆహారాన్ని వదిలేస్తాయి.




- వీటికి సోషల్ ఇంటిలిజెన్స్ ఎక్కువ. ఎంతా అంటే.. కొంతమంది పరిశోధకులు పజిల్స్‌లా చేసి మధ్యలో ఆహారాన్ని పెడితే.. అవి చాలా సులువుగా అధికమించాయట. కోతులకంటే స్మార్ట్. లంచ్ బాక్స్‌లను కూడా ఓపెన్ చేయగలవు.
- ఒక పెద్ద శునకం బరువంత ఇవి ఉంటాయి. వీటి వేగం గంటకు 60 కి.మీ.
- హైనాలు ఒకటి నుంచి మూడు పిల్లలను కంటాయి. ఇవి పుడుతూనే కళ్లు తెరచి, గట్టి కండరాలు కలిగి ఉంటాయి. అలా ఉన్నా కూడా తల్లి హైనా ఆర్నెళ్లు పాలిస్తుంది. ఆ తర్వాత కూడా తన కూనకు పాలు ఇచ్చి పెంచుతుంది. అందుకే హైనాలను గ్రేట్ మదర్స్ అంటారు.
- వీటి పంజాలు బలమైనవి. దొరికిన జంతువు మాంసాన్నే కాదు ఎముకలను విరగ్గొడతాయి. ఇక పళ్ల విషయం చెప్పనక్కర్లేదు. అది నోరు తెరుస్తూనే భయపడతాయి జంతువులు.
- హైనా గొంతు విచిత్రంగా ఉంటుంది. నవ్వినట్లుంటుంది గొంతు.
- చల్లగా ఉండటానికి నీటిలో పడుకుంటాయి. రెండు, మూడు హైనాలు గుంపుగా ఉంటే వీటిని సింహాలూ ఏమీ చేయలేక వెనక్కి తిరిగి వెళ్లిపోతాయి.
- కప్పలు, చేపలు, పండ్లు, జంతువులు, పురుగులు.. ఇలా వేటినైనా తింటాయివి.


సరైన నీడ ఏది?



7 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 260

	5			8		6		
7			2		6		5	
			3				4	8
	3	6				2		
1								4
		9				7	3	
9	6				2			
	8		5		3			6
		3		6			1	

సుడోకు - 259 సమాధానం

1	6	5	4	3	2	7	8	9
3	8	7	1	9	5	6	4	2
2	4	9	7	6	8	5	3	1
9	7	6	2	5	3	8	1	4
4	3	1	8	7	9	2	5	6
5	2	8	6	1	4	3	9	7
8	1	4	3	2	7	9	6	5
6	5	2	9	8	1	4	7	3
7	9	3	5	4	6	1	2	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.